RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:191 హైదరాబాద్, శుక్రవారం, 31 జనవరి 2025 పేజీలు: 12 వెల: 1.00

## జీహెచ్ఎంసీ సమావేశంలో రసాభాస..
## భారాస కార్పొరేటర్లను సస్పెండ్ చేసిన మేయర్



%హైదరాబాద్: జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో రసాభాస నెలకొంది. బడ్జెట్ ఆమోదం తర్వాత ప్రజా సమస్యలపై చర్చించాలని భారాస పట్టుబట్టింది. ఈక్రమంలో కాంగ్రెస్, భారాస కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో భారాసకు చెందిన నలుగురు కార్పొరేటర్లను మార్షల్స్ బయటకు తీసుకెళ్లారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దీన్ని నిరసిస్తూ మిగతా భారాస కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదుపులోకి తీసుకున్న కార్పొరేటర్లను మళ్లీ తీసుకువచ్చి సభను నిర్వహించాలన్నారు. ప్రశ్నోత్తరాలు నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించాలని చెప్పారు. %దీంతో సభలో గందరగోళం నెలకొంది. మేయర్ ప్రజా సమస్యలపై చర్చిద్దామని సర్దిచెప్పినా భారాస కార్పొరేటర్లు పట్టువీడలేదు. ఈక్రమంలో ఆమె అసహనం వ్యక్తంచేస్తూనే మార్షల్స్ తీసుకెళ్లిన కార్పొరేటర్లను తిరిగి సభలోకి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. మరోవైపు ఆ నలుగురు కార్పొరేటర్లు లోనికి రావడానికి నిరాకరించడంతో వాగ్వాదం జరిగింది. దీంతో భారాస కార్పొరేటర్లందరినీ మేయర్ సస్పెండ్ చేశారు. వారిని మార్షల్స్ బయటికి పంపించగా జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.



## గాంధీ వర్ధంతి.. నివాళులర్పించిన
## తెలంగాణ గవర్నర్, సీఎం

హైదరాబాద్: గాంధీ వర్ధంతి సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద వారు అంజలి ఘటించారు. దేశం, స్వాతంత్ర్యం కోసం గాంధీ చేసిన సేవలను వారు గుర్తుచేశారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు. (

## జగన్ సీఎం అయ్యాక.. టీడీపీ
## కార్యకర్తల భరతం పడతాం : పెద్దిరెడ్డి



రాయచోటి: వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు.. అప్పుడు తెదేపా కార్యకర్తల భరతం పడతామని మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హెచ్చరించారు. కడప, రాయచోటిలో వైకాపా సమన్వయ సమావేశానికి హాజరైన పెద్దిరెడ్డి.. తెదేపా కార్యకర్తలను బెదిరించే విధంగా బహిరంగ వ్యాఖ్యలు చేశారు."వైకాపా నాయకులు, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం కేసులు పెట్టి ఇబ్బంది పెడుతోంది. సోషల్ మీడియా కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు. గ్రామస్థాయిలో కూడా మన కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ సీఎం అవుతారు. అప్పుడు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల భరతం పడతాం. వైకాపా కార్యకర్తలపై చేసిన దాడులకు ప్రతి దాడులు కచ్చితంగా ఉంటాయి. మా తడాఖా ఏందో జగన్ సీఎం అయ్యాక వారికి రుచి చూపిస్తాం. ఇక నుంచి కార్యకర్తలకు అండగా ఉంటాం, భరోసా ఇస్తామని జగన్ చెప్పారు. జగన్ ఆదేశాలను అందరూ పాటించాలి. ఎవరికీ భయపడాల్సిన పనిలేదు" అని పెద్దిరెడ్డి అన్నారు.

## ఓడిపోతారని పసిగట్టి.. కేజ్రీవాల్
## చిల్లర రాజకీయాలు: అమిత్ షా

దిల్లీ: వచ్చే నెల 5న జరగనున్న దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకే ఆప్ అధినేత కేజ్రీవాల్(%ాతీజఱఅస ఖవయతీఱఝుశ్రీ%) యమునా నదిలో భాజపా విషం కలిపిందని ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ( మండిపడ్డారు. ఈ మేరకు ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఆప్ పాలనలో యమునా నది కలుషితమైపోయిందని.. దిల్లీ ప్రజలతో మురికి నీటిని తాగిస్తోందని విమర్శించారు. దిల్లీ ఎన్నికల్లో ఓడిపోతామని కేజ్రీవాల్ గ్రహించారని.. అందుకే చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. దిల్లీలో ఆప్ పాలనను తరిమికొట్టేందుకు ఫిబ్రవరి 5 అనేది ఒక అవకాశమని పేర్కొన్న ఆయన.. ఆ రోజు భాజపాకు ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. భాజపా అధికారంలోకి వస్తే దిల్లీని నంబర్ వన్ రాజధానిగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

దిల్లీలో గెలుపు మాదే..



మరోవైపు, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దిల్లీ కంటోన్మెంట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, మేనిఫెస్టోలో చెప్పిన విషయాలను అమలు చేసే ఏకైక పార్టీ భాజపా మాత్రమేనన్నారు. దిల్లీలో ఈసారి భాజపా ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.



## బడ్జెట్ సమావేశాల్లోనే 'వక్ఫ్ బిల్లు'..
## అఖిలపక్షానికి జాబితా ఇచ్చిన కేంద్రం

దిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం (జనవరి 31) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలోనే నేడు అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో కేంద్రమంత్రులు, పలు పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఈసందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కేంద్రం అఖిలపక్షానికి అందించింది. ఇందులో వక్ఫ్ సవరణ బిల్లు ( కూడా ఉంది.

బడ్జెట్ సమావేశాల్లోఁవక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌కు తీసుకురానున్నట్లు కేంద్రం తెలిపింది. దీంతోపాటు మొత్తం 16 బిల్లులను సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. ఆ జాబితాను అఖిలపక్షం ముందు ఉంచింది. వక్ఫ్ చట్ట సవరణపై గతంలో కేంద్రం జేపీసీని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే.

'వక్ఫ్ బిల్లు'పై స్పీకర్‌కు నివేదిక

వక్ఫ్ చట్టంలో మార్పుల పరిశీలన కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ ( ఇటీవల సవరణ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే.

విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించింది. దానికి సంబంధించిన తుది నివేదికను సిద్ధం చేసి.. తాజాగా లోక్‌సభ స్పీకర్‌కు అందించింది.

వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకురావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. అయితే, ఈ సవరణలపై విపక్షాలు అసమ్మతి తెలిపాయి. ముస్లింలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెచ్చారని, వక్ఫ్‌బోర్డుల పనితీరులో జోక్యం చేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశమని విపక్ష సభ్యులు ఆరోపించాయి.

## భారత్‌కు ట్రంప్ మిత్రుడా..?
## శత్రువా..?: జైశంకర్ సమాధానమిదే

దిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతీయవాది అని విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్ అభివర్ణించారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ట్రంప్ విధానాలు గణనీయమైన మార్పు తీసుకురావొచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు. దిల్లీ యూనివర్సిటీకి చెందిన హన్సరాజ్ కాలేజ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

"ఇటీవల జరిగిన ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి నేను హాజరయ్యాను. మనకు ఎంతో గౌరవం లభించింది. ఆయనొక జాతీయవాది అని నేను విశ్వసిస్తున్నాను" అని జై శంకర్ అన్నారు. ట్రంప్ భారత్‌కు మిత్రుడా..? శత్రువా..? అని అడిగిన ప్రశ్నకు పైవిధంగా బదులిచ్చారు. ట్రంప్ విధానాలతో ప్రపంచ వ్యవహారాల్లో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశాలున్నప్పటికీ.. భారత్ మాత్రం దేశ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. "అమెరికాతో మనం బంధం బలంగా ఉంది. ప్రధాని మోదీకి ట్రంప్‌తో మంచి స్నేహముంది" అని వెల్లడించారు.

ప్రపంచవ్యాప్తంగా భారత్ ప్రభావం పెరుగుతోందన్నారు.



"కొందరు భారతీయేతరులు తమను తాము భారతీయులుగా చెప్తున్నారు. విమానంలోనో, ఇంకోచోటో తమకు సీటు దక్కేందుకు అది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు" అని అన్నారు. అలాగే మంత్రి తన కెరీర్ గురించి మాట్లాడారు. "నేను ఒక బ్యూరోక్రాట్‌ను అవుతానని అనుకోలేదు. నా రాజకీయ ప్రవేశం అనూహ్యంగా జరిగింది. అది అదృష్టమే అనుకోండి.

భారతశక్తి
VOICE OF INDIAN

# అన్నీ దేశాల్లోను అక్రమ వలసలే

అమెరికా సార్వభౌమత్వాన్ని పరిరక్షించేందుకు ట్రంప్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. దేశంలో చట్టవిరుద్ధంగా ఆశ్రయం పొందుతున్న తమ పౌరులను వెనక్కు పిలిపించుకునేందుకు ప్రపంచ దేశాలు తగిన చర్యలు తీసుకోవాలి' అంటూ శ్వేతసౌధం తాజాగా చేసిన ప్రకటన ఆహ్వానించదగినదే. అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయగానే వలసలపై కొరడా ఝుళిపిస్తామని చేసిన ప్రకటనను నాలుగు రోజుల్లోనే అమల్లో పెట్టేశారు. దేశంలోని పలు ప్రాంతాల్లో అక్రమ వలసదారుల్ని అరెస్టులు చేయడం ప్రారంభించారు. వీరిని ప్రత్యేక ఆర్మీ విమానంలో గుర్తుతెలియని ప్రాంతానికి తరలించారు. . దీంతో మిగిలిన వారికి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. వలసదారులపై ట్రంప్ సర్కార్ ఇవాళ కఠిన చర్యలు ప్రారంభించింది. ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన మూడు రోజుల తర్వాత భారీ ఆపరేషన్ చేపట్టిన అధికారులు.. వందలాది మంది అక్రమ వలసదారులు అరెస్టు చేశారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ దీనిపై స్పందించారు. అమెరికా అధికారులు 538 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేశారని, సైనిక విమానాన్ని ఉపయోగించి వందల మందిని దేశం నుంచి తరలించినట్లు ప్రకటించారు. అనుమానిత ఉగ్రవాది, ట్రెన్ డి అరగువా ముఠాలోని నలుగురు సభ్యులు, మైనర్లపై లైంగిక నేరాలకు పాల్పడిన అనేక మంది అక్రమార్కులతో సహా 538 మంది అక్రమ వలస నేరస్థులను ఇవాళ అమెరికా ప్రభుత్వం అరెస్టు చేసినట్లు ప్రెస్ సెక్రటరీ వెల్లడించారు. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద వలసల బహిష్కరణ ఆపరేషన్ జోరుగా సాగుతోందని ఆమె తెలిపారు. తమ దేశం సరిహద్దులను రక్షించడానికి ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వైట్ హౌస్ ప్రివ్యూ విడుదల చేసినట్లు ఆమె తెలిపారు. ఇందులో అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అరెస్టు చేసిన కొంతమంది వ్యక్తుల పేర్లు , వారు చేసిన నేరాలను విడుదల చేశారు..ఏ దేశానికైనా అక్రమ వలసదారులు గుదిబండలా మారతారనేది నిర్వివాదాంశం. అయితే వారిని వెనక్కు పంపేందుకు విధివిధానాలంటూ ఉండాలి. లేనిపక్షంలో విమర్శలకూ, వివాదాలకూ దారితీస్తుంది. ఇప్పుడు అగ్రరాజ్యం విషయంలో జరుగుతున్నదదే. ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామిక దేశంగా చెప్పుకునే అమెరికా అక్రమ వలసదారుల విషయంలో అనుసరిస్తున్న వైఖరిని గమనించి, ప్రజాస్వామికవాదులు ముక్కున వేలేసుకుంటున్నారు. లేడికి లేచిందే పరుగన్నట్లు డొనాల్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి వారం రోజులైందో లేదో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపడం మొదలుపెట్టారు. తమ దేశంలో తిష్ఠ వేసుకుకూర్చున్న వేలాదిమంది విదేశీయుల్ని ఉన్నపళంగా, కట్టుబట్టలతో వెనక్కు పంపుతున్నారు. తాను అధికారంలోకి వస్తే అక్రమ వలసదారుల్ని వెనక్కి పంపుతానంటూ ట్రంప్ మొదటినుంచీ చెబుతూనే ఉన్నారు. వలస విధానాన్ని మార్చేస్తాననీ, ప్రపంచంలోనే అత్యంత భారీ డిపోర్టేషన్ చేపడతాననీ హెచ్చరించారు కూడా. ఇప్పుడు అన్నంతపనీ చేస్తున్నారు. అమెరికాను స్వర్గధామంగా భావిస్తూ, అక్కడ ఉద్యోగావకాశాలు సంపాదించి, గ్రీన్ కార్డు సాధించి, అక్కడే స్థిరపడిపోవాలనేది అనేకమంది కల. వీలైతే సక్రమ మార్గంలో, లేనిపక్షంలో అక్రమంగా ఆ దేశంలోకి చొరబడేవారు ఏటా వేల సంఖ్యలోనే ఉంటారు. అక్రమంగా వలస వచ్చినవారు పిల్లల్ని కని, వారికి అమెరికా పౌరసత్వం లభిస్తే చాలనుకుంటారు. ఇప్పుడు ఇదే ట్రంప్ ఆగ్రహానికి కారణమవుతోంది. అక్రమంగా తమ దేశంలోకి చొరబడి, తమ దేశీయుల ఉపాధి అవకాశాలను కొల్లగొట్టడమే కాకుండా, నేరాలకు ఘోరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు పెను సవాలుగా పరిణమిస్తున్నారన్న ట్రంప్ వాదన కాదనలేని సత్యం. దేశంలోకి అక్రమంగా ప్రవేశించేవారితోపాటు దొంగతనాలకు, హింసకు పాల్పడేవారిని నిర్బంధించే బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ ఇప్పటికే ఆమోదం తెలిపిన నేపథ్యంలో ట్రంప్ తన కత్తికి పదును పెట్టారు. ఆయన ఆదేశాల మేరకు రోజుకు రెండువందల మందికి పైగా అక్రమ వలసదారుల్ని గుర్తించి, వారిని వెనక్కి పంపే బృహత్ కార్యాన్ని ఇమిగ్రేషన్ అధికారులు నెత్తికి ఎత్తుకున్నారు. కొలంబియా, మెక్సికో, బ్రెజిల్ తదితర దేశాలకు చెందిన అక్రమ వలసదారుల్ని వెనక్కు పంపిస్తున్నారు. బ్రెజిల్ వలసదారుల్ని కనీస సౌకర్యాలు సైతం లేని విమానంలో చేతులకు బేడీలు వేసి పంపిన వైనం వివాదాస్పదమైంది. ఇది మానవహక్కుల ఉల్లంఘనేనంటూ బ్రెజిల్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఇలాంటి ఆందోళనలను, నిరసనలను ట్రంప్ లెక్కచేయడం సరికదా, అలాంటి దేశాలను నయానో భయానో బెదిరించి మరీ దారికి తెచ్చుకుంటున్నారు. తమ దేశానికి వలసదారుల్ని తీసుకొచ్చే అమెరికా విమానాలను అంగీకరించబోమంటూ ప్రతిఘటించిన కొలంబియాపై భారియెత్తున సుంకాలు విధిస్తామని హెచ్చరించడం ద్వారా డోనాల్డ్ ట్రంప్ ఆ దేశం మెడలు వంచగలిగారు. అక్రమ వలసలకు అడ్డుకట్ట వేసేందుకు కంకణం కట్టుకున్న ట్రంప్, ఇందులో భాగంగా తాను అధ్యక్షుడైన తొలి రోజునే జన్మతః పౌరసత్వంపై వేటు వేశారు. పనిలోపనిగా అక్రమ వలసల బెడద ఎక్కువగా ఉన్న మెక్సికో సరిహద్దుల వద్ద జాతీయ అత్యయిక పరిస్థితిని విధించి, వలసల నిరోధానికి పదివేల మంది సైనికులను మోహరించాలని నిర్ణయించారు. అక్రమ వలసల పట్ల డెమోక్రాట్ల ఉదాసీన వైఖరిని ఎండగట్టడం ద్వారా ఎన్నికల్లో ఆయన ఎంతో లబ్ధి పొందారు. అంతమాత్రాన డెమోక్రాట్లు అక్రమ వలసలకు సానుకూలమని అనుకోవడానికి లేదు. దేశ వలస విధానాన్ని సంస్కరించాలని, అందుకు చట్టాల్లో మార్పు అవసరమన్నది వారి అభిప్రాయం. అక్రమ వలసల మాటున నేరగాళ్ల ముఠాలు అమెరికాలో తలదాచుకుంటున్నాయన్నది ట్రంప్ వాదన. వారిలో ఉగ్రవాదులు కూడా ఉన్నారని, వారివల్ల దేశభద్రతకు ముప్పు పొంచి ఉంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# నామినేటెడ్ పోస్టులకు కండిషన్స్...

విజయవాడ, జనవరి 30, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచిపోయింది. ఇప్పటికే రెండు విడతల్లో దాదాపు 80 పోస్టులను భర్తీ చేసిన సీఎం చంద్రబాబు..ఇప్పుడు మిగిలిన నామినేటెడ్ పోస్టులు, పార్టీ పదవుల భర్తీపై ఫోకస్ పెట్టారు. జూన్‌లోపు ప్రభుత్వంలో ఉన్న అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇతర పార్టీల నుంచి నిన్న



మొన్న వచ్చి చేరిన వారి కంటే ఎప్పటి నుంచో పార్టీలో ఉండి పనిచేసిన వారిని నేతలు ప్రోత్సహించాలన్నారు. మొదటి నుంచి పార్టీని నమ్మకున్న వారికే పదవులు దక్కేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని తేల్చిచెప్పారు. 214 మార్కెట్ కమిటీలు, 11వందల ట్రస్ట్ బోర్డులు ఉన్నాయని, రానున్న రోజుల్లో ఈ నియామకాలు పూర్తి చేస్తామన్న చంద్రబాబు..పదవి పొందినవాళ్ల రెండేళ్ల పనితీరుపై సమీక్ష చేస్తామని..పనితీరు ఆధారంగా మళ్లీ నిర్ణయాలు, భవిష్యత్ అవకాశాలు ఉంటాయని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల నియామకంపై ఎమ్మెల్యేలు సరైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు చంద్రబాబు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల్లో పదవి ఆశిస్తున్న వాళ్లు పార్టీ..క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ విభాగాల్లో సభ్యులుగా ఉండాలన్నారు. కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ ఇచ్చారు చంద్రబాబు. టీడీపీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, పార్టీ ఇంఛార్జ్‌లతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేశారు సీఎం. టీడీపీ సభ్యత్వ నమోదులో బాగా చేసిన వారికి పదవుల్లో ప్రోత్సాహం ఇస్తామన్నారు. ఇక ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు సీఎం. ఎమ్మెల్యేలం..ఎంపీలం అయిపోయాం కాబట్టి ఇక కార్యకర్తలతో పనిలేదని అనుకోవద్దని.. కష్టపడిన క్యాడర్, లీడర్‌కు న్యాయం జరిగేలా నామినేటెడ్ పదవులు భర్తీ ఉండాలన్నారు. ఇప్పటికే రెండు విడతల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసింది కూటమి సర్కారు. అయితే ఆ రెండుసార్లు కూడా..కొందరికి అవకాశం దక్కలేదు. ప్రధానంగా టీడీపీ నుంచి చాలామంది ఆశావహులు ఉన్నారు. ఎన్నికల సమయంలో సీట్లు వదులుకుని..పార్టీ కోసం త్యాగం చేసినవారిలో చాలామంది నామినేటెడ్ పోస్ట్ కోసం ఎదురు చూస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా సహా..దేవినేని ఉమా, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వంటివారు వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. వీరికితోడు నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కూడా..అనంతపురం జిల్లాకు చెందిన యామినీ బాల కుటుంబం కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక గుంటూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కళ్లుకాయలు కాచేలా పదవి కోసం చూస్తున్నారు. ఈయన గత ఎన్నికల్లో టికెట్‌ను త్యాగం చేశారు. అదేవిధంగా పిఠాపురం సీటును త్యాగం చేసిన వర్మ కూడా ఈ జాబితాలోనే ఉన్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలామంది చంద్రబాబు చల్లటి చూపు కోసం ఎదురు చూస్తున్నారు. దాదాపుగా ఇంకా 60 కార్పొరేషన్ల పదవులను భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో పలు కీలక శాఖల కార్పొరేషన్లు ఉన్నాయి. అలాగే అధికార భాషా సంఘం, సాహిత్య అకాడమీ, స్కూల్ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రా కార్పొరేషన్, నెడ్‌క్యాప్, ప్రణాళిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, కనీస వేతనాల కార్పొరేషన్ల పదవులు ఖాళీగా ఉన్నాయి. ఇవి కాకుండా పలు కుల సంఘాల కార్పొరేషన్ కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈసారి భర్తీ చేసే పోస్టుల్లో తెలుగు యువతలో కీలకంగా పనిచేసిన నాదెండ్ల బ్రహ్మం చౌదరి పేరు ప్రధానంగా వినిపిస్తుంది. అలాగే గన్ని ఆంజనేయులు, బూరుగుపల్లి శేషారావు, కనపర్తి శ్రీనివాసరావు, సాహెబ్, మాల్యాద్రి, దారపునేని నరేంద్ర, ఏవీ సుబ్బారెడ్డి, ప్రభాకర్ చౌదరి, సుగుణమ్మ, పరుచూరి కృష్ణ, బండారు హనుమంతరావు, గంటాగౌతమ్, పెందుర్తి వెంకటేశ్, నల్లపాటి రాము, చిరుమామిళ్ల మధు, మాజీ ఎమ్మెల్యే రామానాయుడు పదవులు ఆశిస్తున్నారు. జనసేన నుంచి కూడా అమ్మిశెట్టి వాసు, రాయపాటి అరుణ, రామకృష్ణ, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, బీజేపీ నుంచి పాతూరు నాగభూషణం, అన్నం సతీష్, బాజీ, కోలా ఆనంద్ నామినేటెడ్ పోస్టుల రేసులో ఉన్నారుఇలా ఆశావహులు లిస్ట్ చాలా పెద్దగా ఉంది. కూటమిలోని మూడు పార్టీల నుంచి నామినేటెడ్ పోస్ట్ కోసం పోటీ పడుతున్న నేతలు..ఎవరికి ఏ కార్పొరేషన్ పదవి దక్కుతుందోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అయితే ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నేతలు, టికెట్ త్యాగం చేసిన లీడర్లు అయితే కార్పొరేషన్ పదవుల కంటే..ఎమ్మెల్సీ బెర్తుల కోసమే పట్టుబడుతున్నారట. ఎవరికి నామినేటెడ్ పోస్టులు దక్కబోతున్నాయి. ఏ నేతలు ఎమ్మెల్సీలు కాబోతున్నారు..పార్టీ పదవుల్లో కీలక పోస్టులు దక్కించుకునేదెవరో మరికొన్ని రోజుల్లోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది

# ప్రకాశం జిల్లాల్లో ఎయిర్ పోర్టు అడుగులు

ఒంగోలు, జనవరి 30, ప్రకాశం జిల్లాలో ఎయిర్‌పోర్టు కల సాకారమయ్యే టైమ్ వచ్చేసింది. కూటమి సర్కార్ చొరవతో ఒంగోలు ఎయిర్‌పోర్టు స్వప్నం సాకారం కాబోతుంది. సియం చంద్రబాబు నాయుడు చొరవతో ఏపీలో కొత్తగా ఏడు ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒంగోలు సహా ఏపీలో 7 కొత్త ఏయిర్‌పోర్టుల నిర్మాణాలు చేపట్టనున్నట్టు ప్రకటించారు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. ఒంగోలుకు సమీపంలోని అల్లూరు ? ఆలూరు మధ్యలో ఏయిర్ పోర్టు ఏర్పాటుకు అనుకూల భూములున్నాయని రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.. గతంలో వాన్‌పిక్ కోసం సేకరించిన భూముల్లో 732 ఎకరాలను కేటాయించే దిశగా ప్రణాళికలు సిద్దం పట్టాలెక్కాయి. ఎయిర్‌పోర్ట్ అథారిటీ నుంచి అధికారుల బృందం ఒంగోలు పరిసర ప్రాంతాల్లో పర్యటించింది. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, నగర మేయర్ గంగాడ సుజాత, ఇతర జిల్లా అధికారులు బృందం సభ్యులతో కలిసి ఒంగోలు సమీపంలోని కొప్పోలు, అల్లూరు, ఆలూరు మధ్య ఉన్న వాన్‌పిక్ స్థలాలను పరిశీలించారు. ఇప్పటికే వాన్‌పిక్ ఆధీనంలో ఉన్న 600 ఎకరాలతో పాటు మరో 150 ఎకరాలు రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. ఈ భూములు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అనువుగా ఉన్నాయా.. లేదా.. అన్న విషయంలో ఎయిర్‌పోర్ట్ అధికారుల బృందం అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ప్రతిపాదిత స్థలం లేఅవుట్లను పరిశీలించారు. కూటమి సర్కార్ చొరవ వల్లే ఎన్నో ఏళ్ల తమ




కల సాకారం అవుతుందని హర్షం వ్యక్తం చేశారు స్థానికులు. భూముల ధరలు పెరగడంతో పాటు స్థానికంగ విద్యా, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయంటున్నారు. ఒంగోలు సమీపంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం వల్ల ప్రకాశం జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. తూర్పు ప్రకాశంలో ఇంతవరకు ఎలాంటి పెద్దపరిశ్రమలు లేకపోవడంతో కోస్తాతీరం అభివృద్ధి చెందలేదు. రానున్న రోజుల్లో ఒంగోలుసమీపంలో విమానాశ్రయం, కొత్తపట్నం దగ్గర పోర్టు నిర్మిస్తే తూర్పు ప్రకాశం అభివృద్ధిలో అగ్రభాగం లోఉండే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర విమానయానసంస్థ అధికారులు ఒంగోలులో పర్యటించిన నేప ధ్యంలో జిల్లా ప్రజల్లో విమానాశ్రయం ఆశలు చిగురిస్తున్నాయి? విమానాశ్రయం ఏర్పాటుకు ఎపిఎడిసికి 1.92 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో జిల్లా ప్రజల్లోపూర్తిస్థాయి నమ్మకం ఏర్పడింది. ప్రతిపాదనలు పట్టాలెక్కాయి.

# ఢిల్లీ ప్రచారానికి చంద్రబాబు, పవన్

విజయవాడ జనవరి 30, (న్యూస్ పల్స్)

భారతీయ జనతా పార్టీ.. పలు రాష్ట్రాల్లో అవలంభించిన గెలుపు ఫార్మూలాను ఢిల్లీ గల్లీలో అమలు చేయబోతోంది. ఏపీ సెంటిమెంట్‌తో ఢిల్లీలో కూడా తిరుగులేని విక్టరీ కొట్టాలని భావిస్తోంది బీజేపీ అధిష్ఠానం.. సార్వత్రిక ఎన్నికల ప్రభంజనం తర్వాత మహారాష్ట్రలో మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. 132 స్థానాల్లో గెలిచి బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఫలితాలు మోదీకి ఎంతో శక్తినిచ్చాయి. విడిపోతే అంతర్ధానమైపోతాం.. ఒక్కటిగా ఉంటే సురక్షితంగా ఉంటాం అనే నినాదాలతో పాటు బంగ్లాదేశ్ చొరబాటుదారుల సమస్యను బలంగా లేవనెత్తారు. వీటితో పాటు ఏపీలో కూటమి నేతల ప్రచారం బాగా కలిసొచ్చింది. ఇలా అన్నీ కలిసి మహాయుతి కూటమికి తిరుగులేని విజయాన్నందించాయి. ఎన్డీఏ సంఖ్యా బలంలో కీలకంగా టీడీపీ, జనసేన.. వేర్వేరు రాష్ట్రాల్లో ఎన్డీఏ గెలుపు కోసం తమవంతు పాత్రను పోషిస్తున్నాయి. మరఠ్వాడా, విదర్భ, పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతాల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో బీజేపీ అధిష్ఠానం ప్రచారం చేయించింది. మొత్తం ఐదు బహిరంగ సభలు.. రెండు రోడ్ షోలకి ప్లాన్ చేసింది. తెలుగువాళు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతాల్లో పవన్‌తో ప్రచారం చేయించి ఓట్లను రాబట్టుకోవడంలో సక్సెస్ అయింది. సీఎం చంద్రబాబు ప్రచారానికి వెళ్లాల్సి ఉన్నా ఆఖరి నిమిషంలో మహారాష్ట్ర పర్యటన రద్దు రద్దయింది. ఏపీలో కూటమి నేతలు మహారాష్ట్రలో ప్రచారానికి వెళ్లడం.. అక్కడ విజయం సాధించడాన్ని బీజేపీ సెంటిమెంట్‌గా భావిస్తోంది. ఇప్పుడదే సెంటిమెంట్‌ను ఢిల్లీలోనూ ప్రయోగించాలనుకుంటోంది. హస్తినలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార, విపక్ష పార్టీలు ఎన్నికల ప్రచారంలో మునిగిపోయాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఈ క్రమంలో బీజేపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ సీఎం చంద్రబాబును ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో దింపబోతుంది. ఫిబ్రవరి 1న ఢిల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు చంద్రబాబు. తెలుగువాళ్లు నివసించే ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయబోతున్నారు. అలాగే పవన్ కల్యాణ్ కూడా ప్రచారంలో పాల్గొంటారని తెలుస్తోంది. బహిరంగ సభలు, రోడ్



షోలు ఎక్కడెక్కడ ఎలా ఉండాలన్న దానిపై త్వరలో క్లారిటీ రానుంది. కూటమి నేతల ప్రచారం మహారాష్ట్రలో వర్కవుట్ అయినట్టే ఢిల్లీలోనూ కలిసొస్తుందని బీజేపీ అధిష్ఠానం లెక్కలేసుకుంటోంది. ఢిల్లీలో ఆప్ వరుసగా రెండుసార్లు అధికారాన్ని చేజిక్కించుకుంది. ముచ్చటగా మూడోసారి విక్టరీ కొట్టాలని ఉవ్విళ్లూరుతోంది. అటు బీజేపీ మాత్రం ఆప్ విజయాలకు బ్రేక్ వేసి హస్తినలో కాషాయ జెండా ఎగరేయాలని కంకణం కట్టుకుంది. ఈ క్రమంలోనే తమ పార్టీ అభ్యర్థుల మద్దతు కోసం మిత్రపక్షాలను రంగంలోకి దింపాలని భావిస్తోంది.

# తెలంగాణ సచివాలయంలో భద్రతా లోపం
## సచివాలయంలో ఫేక్ ఐడీతో దొరికిన వ్యక్తి

హైదరాబాద్

రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్గా చెప్పుకుంటూ బిల్డప్ ఇస్తున్న వ్యక్తి దొరికిపోయాడు. నకిలీ ఉద్యోగి కదలికలు అనుమానంగా ఉండడంతో సెక్రటేరియట్ సీఎస్ఓ దేవిదాస్ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ సిబ్బంది నిఘా పెట్టారు. రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా ఫేక్ ఐడీ కార్డుతో చలామణి అవుతున్న ఖమ్మంకు చెందిన భాస్కర్ రావుగా గుర్తించారు. భాస్కర్ రావుకు సహకరించిన డ్రైవర్ రవిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసారు.

# ఢిల్లీలో యమునానదే ఎన్నికల అంశం..

న్యూఢిల్లీ, జనవరి 30,

ఢిల్లీలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. గత రెండు పర్యాయాలు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించింది. ఇదే ఊపులో పంజాబ్ లోనూ గెలుపును సొంతం చేసుకుంది. ఐతే ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ త్వరలో జరిగే ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ సాధించాలని భావిస్తున్నది. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రచారంలో దూకుడు మొదలుపెట్టింది. సాధారణంగా ఎన్నికల ప్రచారంలో హుందాగా మాట్లాడతాడని పేరుపొందిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఈసారి ఎందుకో లైన్ తప్పినట్టు కనిపిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో తన పార్టీ చేసిన అభివృద్ధిని చెప్పుకోలేక.. పక్క రాష్ట్రమైన హర్యానాపై తీవ్రమైన విమర్శలు చేశారు.. హర్యానాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సంచలన విజయం సాధించింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ కొనసాగుతున్నారు. అయితే హర్యానా నుంచి ఢిల్లీకి ప్రవహించే యమునా నదిలో హర్యానా ప్రభుత్వం ప్రమాదకరమైన కలుషితాలను కలుపుతోందని అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. దీంతో ఒకసారి గా రాజకీయంగా దుమారం చెలరేగింది. అరవింద్ ఆస్థాయిలో ఆరోపణలు చేయడంతో.. దానిని తిప్పి కొట్టడానికి హర్యానా ముఖ్య మంత్రి నాయబ్ సింగ్ రంగంలోకి దిగారు. వెంటనే యమునా నదిలోకి దిగి నీటిని తాగి.. కేజ్రీవాల్ కు షాక్ ఇచ్చారు. '' యమునా నదిలో విషపూరిత వ్యర్థాలను కలుపుతోందని మా ప్రభుత్వం మీద అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణలు చేశారు. నేను ఇప్పుడు ఆ నీటిని తాగాను. ఆరోపణలు చేసిన వ్యక్తి తదుపరిగా ఏం మాట్లాడతారో నేను చూడాలని భావిస్తున్నానని'' నాయబ్ సింగ్ వ్యాఖ్యానించారు. యమునా నదిలో హర్యానా ప్రభుత్వం విషపూరిత పదార్థాలు కలుపుతోందని కేజ్రీవాల్ ఆరోపించిన నేపథ్యంలో.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించారు. "అరవింద్ చేసిన ఆరోపణలు దేశానికే అవమానకరం.. హర్యానాలో ఉన్న ప్రజల బంధువులు ఢిల్లీలో నివసిస్తున్నారు. అలాంటిది సొంత ప్రజలు తాగే నీళ్లల్లో విషం ఎందుకు కలుపుతారు. యమునా నదిలో నీటిని న్యాయమూర్తులు, దౌత్యవేత్తలు, పేద ప్రజలు తాగుతున్నారు. ఆ నీటిని నేను కూడా తాగుతున్నాను. అలాంటిది హర్యానా ప్రభుత్వం యమునా నీటిలో విషాన్ని ఎందుకు కలుపుతుందని" ప్రధాని ప్రశ్నించారు. మరోవైపు యమునా నదిలో విష పదార్థాలు కలుపుతోందని హర్యానా ప్రభుత్వంపై అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో.. సోనే పాట్ ప్రాంతంలో బిజెపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు అరవింద్ కేజ్రీవాల్ పై కేసు నమోదు చేశారు. మరి ఇప్పటికైనా ఈ వివాదం ముగుస్తుందో? లేక ఇంకా కొనసాగుతుందో? వేచి చూడాల్సి ఉంది.

# చదువుతోనే బంగార భవిష్యత్తు

మేడ్చల్‌చదువుతోపాటు విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని సంపాదించుకోవాలని విద్యార్థులకు ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు బోధించారు.. మేడ్చల్ :– ఘట్కేసర్ మండలంలోని ప్రతాప సింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన వార్షికోత్సవానికి మంత్రి శ్రీధర్ బాబు. పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి వెలిగించారు..మంత్రి మాట్లాడుతూ చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని, అందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు వారిని వెన్నంటి ఉండి ప్రోత్సహించాలని తెలిపారు. ఈ పోటీ ప్రపంచంలో నైపుణ్యంతో చిత్తశుద్ధి కృతనిశ్చయంతో చిన్నారులు ముందుండాలని కోరారు..తరువాత మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ..

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

సిరిసిల్ల (క్రైం, జనవరి 26): శాంతి భద్ర తలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సబ్‌డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వివిధ నేరాల్లో నిందితులుగా ఉన్న రౌడీ షీట ర్లు, హిస్టరీ షీట్‌లు, సెస్పెక్ట్‌గా ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తనతో జీవితాలను




సరిదిద్దుకోవాలన్నారు. తర చూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చట్టపరమై న చర్యలు తీసుకుంటామన్నారు. నేరస్థులుగా ఉన్న వా రందరు విధిగా పోలీస్‌స్టేషన్‌కు హాజరుకావాలని, లేని పక్షంలో బైండోవర్ చేస్తామన్నారు. నేరాలకు దూరంగా ఉంటు సత్ప్రవర్తనతో మెదులుతున్న నేరస్థులపై రౌడీ సీట్స్ తొలగిస్తామన్నారు. అల్లర్లతో ప్రమేయం ఉన్న వారిని ప్రతినెల పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యకాలపాలకు పా ల్పడితే ఉక్కుపాదం మోపుతామన్నారు. శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, ఎస్ఐలు రాంమ్మోహన్, శ్రీకాంత్, రమాకాంత్, గణేశ్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

వేములవాడ, జనవరి 30 యువత మహనీయుల అడుగు జాడలలో నడవాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని సుభాష్‌నగర్‌లో సుభాష్ జంక్షన్ సుందరీక రణ, ఆదర్శ అంబేద్కర్ సంఘ కమ్యూనిటీ హాల్ భవనాన్ని మున్సిపల్ చైర్‌పర్స న్ రామతీర్థపు మాధవితో కలిసి ం ఆయన ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆది శ్రీనివాస



మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడం మనం దరి బాధ్యత అని అన్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా అంబేద్కర్ చౌర స్తాను సుందరీకరిస్తున్నామని,అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నా మన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో రూ.4లక్షలతో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. కమ్యూనిటీ భవనాలను ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉ పయోగించుకోవాలని అన్నారు. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ అన్వేష్, ఏఈ నరసింహస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆదర్శ అంబేద్కర్ మాల సంఘం అధ్యక్షుడు గుం డం బాలయ్య, నాయకులు రాపల్లి శ్రీధర్, సాగరం వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కొనసాగాలనే బీజేపీలోకి..

కరీంనగర్ టౌన్, జనవరి 30): అభివృద్ధి కొనసాగాలనే బీజేపీలో చేరుతున్నానని మేయర్ సునీల్‌రావు అన్నారు. బీజేపీలో చేరిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ షరతులు లేకుండా బీజేపీలో చేరుతున్నానని, సామాన్య కార్యకర్తగా తనకు మంత్రి సంజయ్ ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో నిర్వహిస్తానని తెలిపారు. బండి సంజయ్ నాయకత్వంలోనే కరీంనగర్ అభివృద్ధి జరుగుతోందని అన్నారు. తనకు మేయర్ పదవి రావడానికి ప్రధాన కారణం వినోద్‌కుమారేనని అన్నారు. తాను మేయర్ కాకుండా ఎమ్మెల్యే గంగుల కమలాకరేనని పలు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. అన్ని అవమానాలను దిగమింగుకుని బీఆర్ఎస్‌లో ఐదేళ్లు పని చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో జరిగిన ప్రతి స్కామ్ వెనుక మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హస్తముందన్నారు. అవినీతికి కేరాఫ్ గంగుల కమలాకర్ అని విమర్శించారు.

తన జోలికి వస్తే ఎమ్మెల్యే అవినీతి, అక్రమాల బండరాన్ని బయటపెడతానని హెచ్చరించారు. కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ నిధులు తీసుకువస్తే ఆ సొమ్మును ఎమ్మెల్యే దండుకున్నాడని విమర్శించారు. ఎమ్మెల్యే కమలాకర్ టెండర్లు, కమీషన్లు తీసుకున్నారని, ఆయన బినామీలతోనే అన్ని రకాల కాంట్రాక్టు పనులు చేయిస్తూ దోచుకున్నారన్నారు.

స్మార్ట్‌సిటీ నిధులు బండి సంజయ్ తెచ్చారని వాస్తవాలు చెబితే గంగులకు ఎందుకు కోపమని అన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు, ఎంపి, మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందని, బండి సంజయ్ ఏనాడూ పైసలు అడుగలేదని తెలిపారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మందు తాగించి, డిన్నర్ పార్టీలు పెట్టి బతిమిలాడడంతోనే పలువురు కార్పొరేటర్లు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని, త్వరలోనే వారంతా బీజేపీలో చేరుతారన్నారు.

## కరీంనగర్‌లో కాషాయ జెండా ఎగురవేస్తాం..

కరీంనగర్ టౌన్, జనవరి 30: ఎప్పుడు ఎన్నికలు జరిగినా కార్పొరేషన్ బీజేపీదేనని, కరీంనగర్‌లో కాషాయ జెండా ఎగురవేసి తీరుతామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి



సంజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు దంపతులు, కార్పొరేటర్లు లెక్కల స్వప్నవేణు, శ్రీదేవి చంద్రమౌళి బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కేంద్రమంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా సంజయ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇది తాను గర్వంతో చెప్పడం లేదని, ప్రజల మనుసుల్లోని మాటను చెబుతున్నానన్నారు. కార్పొరేషన్‌ను తమకు అప్పగిస్తే నగర వ్యాప్తంగా 24 గంటలపాటు నిరంతర నీటిని సరఫరా చేస్తామన్నారు. ఇందుకు కేంద్రం నుంచి నిధులు తెస్తామని చెప్పారు. స్మార్ట్‌సిటీ నిధులతో కరీంనగర్‌ను అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. పదేళ్లుగా కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు తెచ్చినా ఎన్నడూ తనను ప్రారంభోత్సవాలకు ఆహ్వానించలేదన్నారు. మేయర్ సునీల్‌రావు తనను ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తే ఆయనను పదవి నుంచి దించుతామని బీఆర్ఎస్ బెదిరింపులకు పాల్పడిందన్నారు. శుక్రవారం కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ నగరంలో అభివృద్ధి పనులను ప్రారంభించడంతో కేంద్రం నిధులతోనే కరీంనగర్ అభివృద్ధి చెందిందనే వాస్తవం ప్రజలకు తెలిసిందన్నారు. నిధులు తెచ్చే పార్టీకి అధికారం అప్పగిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని, పనులు పారదర్శకంగా జరుగుతాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధిని ఇంకా కొనసాగించేందుకు బీజేపీకి అవకాశమివ్వాలని, దీనిపై మేధావులు, యువకులు ఆలోచించాలని కోరారు. గత బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయాయన్నారు. బీఆర్ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ నడుస్తోందని సంజయ్ విమర్శించారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, కొత్తపల్లి కౌన్సిలర్ వాసాల రమేశ్ పాల్గొన్నారు.

## బల్దియాల్లో ప్రత్యేక పాలన..

బల్దియాల్లో పాలకవర్గాల గడువు ఆదివారంతో ముగియనుంది. 27 నుంచి ప్రత్యేక పాలన ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభం అయ్యాయి. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఇక నుంచి నిర్ణయాలన్నీ ప్రత్యేక అ?ధికారులు తీసుకోనున్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సిరిసిల్లలో 39 వార్డులు, వేములవాడలో 28 వార్డుల్లో పోటా పోటీగా సాగిన పోరులో పాలక పగ్గాలను రెండు చోట్ల బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. రెండు మున్సిపాలిటీల్లో 67 వార్డుల్లో ఐదు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవం కాగా, 62 వార్డుల్లో 274 మంది పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేదు. బీఆర్ఎస్, రెబల్ అభ్యర్థుల మధ్యే పోటీ సాగింది. బీఆర్ఎస్ 38 సీట్లు, కాంగ్రెస్ మూడు సీట్లు, బీజేపీ 9 సీట్లు, స్వతంత్రులు 17 సీట్లు గెలుపొందడం గమనార్హం. సిరిసిల్ల, వేములవాడలో బీఆర్ఎస్‌కు చెందిన జిందం కళచక్రపాణి, రామతీర్థపు మాధవిలు చైర్‌పర్సన్‌లుగా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత అనేక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిరిసిల్లలో కొంతమంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. వేములవాడలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వలసలు వెళ్లారు. బీఆర్ఎస్‌కు చెందిన వై చైర్మన్ మధు రాజేందర్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కౌన్సిలర్ బింగి మహేష్ వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇలా పలు రాజకీయాల మధ్య బల్దియా పాలన గడువు ముగిసిపోయింది. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టితో అభివృద్ధి అశాజనకంగానే సాగింది. ప్రధాన రోడ్లతో పాటు జిల్లా కేంద్రానికి విద్యా సంస్థలు, కూడా వచ్చాయి. వేములవాడలో గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు చేపట్టినా అంతంత మాత్రంగానే



జరిగాయనే విమర్శలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అభివృద్ధి వైపు దృష్టిసారించారు. ప్రత్యేక అధికారుల పాలనలో అభివృద్ధి ఎలా జరగనుందోననే ఆసక్తి కూడా ప్రజల్లో నెలకొంది.

అధికారంలో ప్రభుత్వం కాంగ్రెస్ ఉన్నప్పటికీ స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే కొనసాగడంతో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకుల్లో నిరాశగానే ఉండేది. మున్సిపల్ పాలకవర్గాల గడువుతో స్థానిక సంస్థల పాలనకు తెరపడి ప్రత్యేక అధికారుల పాలన ముందుకు వచ్చింది. ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలకు చురుకుగా ఏర్పాట్లు చేస్తోంది. ఇదేక్రమంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిల్‌కు కూడా ఎన్నికలు జరగనుండడంతో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లోని ఆశావాహులు దృష్టి పెట్టారు. వార్డుల్లో సంబంధాలు పెంచుకునే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు.

## దరఖాస్తుల వెల్లువ

పెద్దపల్లి) ప్రజాపాలనలో భాగంగా నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. మూడు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో మొత్తం 52,326 దరఖాస్తులు వచ్చాయి. కొత్త పథకాల ద్వారా ఎంపిక



చేసిన పలువురు లబ్ధిదారులకు ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా చెక్కులను అందజేయనున్నారు.

యేడాది క్రితం దరఖాస్తుల స్వీకరణ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఏడాది క్రితం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభల ద్వారా ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. దశల వారీగా ఆయా పథకాలను అమలు చేస్తూ వస్తున్నది. మొదటి విడతలో ప్రభుత్వం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 10,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, సొంత స్థలం గల లబ్ధిదారులనే ఎంపిక చేసి గ్రామసభ ఆమోదం కోసం పెట్టనున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,80,664 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 1,28,972 దరఖాస్తులు, పట్టణ ప్రాంతాల్లో 61,692 దరఖాస్తులు వచ్చాయి. సాగులో ఉన్న భూములకే ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించాలని నిర్ణయించిన మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి సాగు భూములను గుర్తించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం సర్వే నిర్వహించి అర్హులను గుర్తించారు. వీటిపై అభ్యంతరాలను స్వీకరించేందుకు ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సభలను నిర్వహించారు. ఈ సభల్లో ప్రభుత్వం ప్రకటించిన అర్హుల జాబితాలో పేర్లు లేవని అధికారులను నిలదీయడంతో పాటు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏడాది క్రితం ఇందిరమ్మ ఇళ్ల కోసం లక్షా 80 వేల దరఖాస్తులు రాగా, ఆ మేరకు ఇంటింటి సర్వే నిర్వహించి ఇందిరమ్మ యాప్‌లో వివరాలు నమోదు చేశారు. రేషన్ కార్డుల కోసం గతంలో వచ్చిన 15,255 దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుని సర్వే చేశారు. ఉపాధిహామీ పథకం ద్వారా 20 రోజులపాటు పనులు చేసిన కూలీలను గుర్తించారు. అందులో ఎలాంటి భూమి లేని వారికి ఏడాదికి రూ.12 వేలు ప్రభుత్వం ఇవ్వనున్నది. సర్వే అనంతరం ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో 80 వేల మంది పేర్లు మాత్రమే ఉన్నాయి. ఆత్మీయ భరోసాలో కూడా లబ్ధిదారుల జాబితా తగ్గింది. మూడు రోజులపాటు నిర్వహించిన గ్రామసభల్లో అర్హుల జాబితాలను ప్రకటించగా, పలువురు తమ పేర్లు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జాబితాలో తమ పేరు ఎందుకు లేదని గ్రామ, వార్డు సభల్లో ప్రజలు అధికారులు, సిబ్బందిని నిలదీశారు. దీంతో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని ప్రభుత్వం పరిశీలిస్తుందా, లేదా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నుంచి మొదటి విడతలో ఎంపికయ్యే లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

## సన్మానాలు.. భావోద్వేగాలు...

కోల్‌సిటీ, జనవరి 30: రామగుండంలో అభివృద్ధి నా బాధ్యత అని, నియోజకవర్గం అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందేందుకు అం దరి అభిప్రాయాలు, సహకారంతో ముందుకు పోతానని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. రామగుండం నగరపాలకవర్గ చివరి సమావేశం మేయర్ బంగి అనీల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండంలో అభివృద్ధిలో, సంక్షేమ ఫలాలు అందించ డంలో రాజకీయ వివక్ష చూపేది లేదని, పేదవాడైతే చాలు ఏ పార్టీ వారైనా సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. గతంలో ఇద్దరు ఎమ్మెల్యే డబుల్



బెడ్‌రూమ్‌లను రాజకీయాల కోసం వాడుకున్నారని, లబ్ధిదారులకు ఇండ్లు ఇవ్వలేదన్నారు. గతంలో కేటాయింపులు జరిగిన లబ్ధిదా రులకే ఇండ్లు కేటాయించామన్నారు. సింగరేణి సీఎస్ఆర్, డీఎం ఎఫ్‌టీ నిధులు గతంలో ఇతర ప్రాంతాలకు తరలివెళ్లేవని, ఇప్పు డు పరిశ్రమలపై ఒత్తిడి తెస్తున్నానన్నారు. సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ సహకారంతో రామగుండాన్ని అభివృద్ధి చేస్తా మన్నారు. నెల రోజుల్లో రుడా కార్యరూపంలోకి వచ్చే అవకాశం ఉందని, మెడికల్, బిజినెస్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు.

పెద్దపల్లిటౌన్‌పెద్దపల్లి మున్సిపాల్టీ కౌన్సిలర్ల పదవికాలం ముగియడంతో మున్సిపల్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలో 36 మంది కౌన్సిలర్లను సన్మానించారు. చైర్‌పర్సన్ డా.దాసరి మమత రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయ రమణారావు హాజరయ్యారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పెద్దపల్లి పట్టణానికి టీయూ ఎఫ్ఐడీసీ, డీఎంఎఫ్టీ నిధులతో అభివృద్ధి జరిగిందన్నారు. సహకరించిన మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిబంధతతో పని చేసినప్పుడే ప్రజల గుర్తింపు లభిస్తుందన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ కొంతం శ్రీనివాస్ రెడ్డి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే సభ్యులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కమిషనర్ ఆకుల వెంకటేష్, చైర్‌పర్సన్ ఎమ్మెల్యేను సన్మా నించారు. మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీష్,టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్,అకౌంటెంట్ నాగవేణి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## లీగల్ ఎయిడ్ ద్వారా ఖైదీల పిల్లలకు సాయం అందిస్తాం

కరీంనగర్ క్రైం, జనవరి 30

జైలులో ఉన్న ఖైదీల పిల్లలకు లీగల్ ఎయిడ్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ప్రతిమ అన్నారు. కరీంనగర్ జైలులో ఖైదీల హక్కులు, బాధ్యతలు, ఖైదీలకు అందిస్తున్న న్యాయసేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ప్రతిమ మాట్లాడుతూ ఖైదీలు పిల్లల చదువు నిర్లక్ష్యం చేయవద్దని, వారు ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా విద్య అందించాలన్నారు. ఖైదీలు మానసికంగా దృఢంగా ఉండాలని, అధైర్య పడకూడదని సూచించారు. ముద్దాయిలు స్వయంగా, వ్యక్తిగతంగా మార్పు చెందాలని అన్నారు. పేద ఖైదీలకు ప్రభుత్వ న్యాయ వాదులను




నియమించి న్యాయ సహాయాన్ని అందిస్తామని అన్నారు. ఖైదీల హక్కులు, బాధ్యతలను వారికి అందిస్తున్న న్యాయ సహాయం గురించి ప్రధాన న్యాయమూర్తి వివరించారు. ఖైదీలు నేరాలు చేయకుండా సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని కోరారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత కొత్త జీవితాన్ని ప్రారంభించి సరైన మార్గంలో నడవాలని సూచించారు.

జైలులో ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాల గురించి సంతృప్తి వ్యక్తం చేస్తూ జైలు అధికారులను, సిబ్బందిని అభినందిం చారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్ మాట్లాడుతూ జైలుకు వచ్చిన ఖైదీల సమస్యలను తెలుసుకుని వారికి న్యాయ సేవా పరంగా అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని, లీగల్ సర్వీస్ అ?థారిటీ ద్వారా లీగల్ అడ్వకేట్‌లను జైలుకు పంపించి సహాయ సహకారాలు అందిస్తు న్నామన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా జైలు సూపరిండెంట్ కె శ్రీనివాస్, జైలు వైద్యాధికారి కె వేణుగోపాల్, జైలర్ పి శ్రీనివాస్, బి రమేష్, యు పరశురాం, డిప్యూటిజైలర్‌లు ఏ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ సుధాకర్ రెడ్డి, ఎల్ రమేష్ నాయక్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తనుకు మహేష్, పి పరశురాములు, ఎస్ మల్లేశం, ఈ జ్యోతి, సిబ్బంది ఖైదీలు పాల్గొన్నారు.

## డొనాల్డ్ ట్రంప్ కాల్స్...

న్యూఢిల్లీ, జనవరి 30,

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా జనవరి 20న ప్రమాణం చేసిన డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్రమోదీ జనవరి 27న ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని మోదీ స్వయంగా ఎక్స్‌లో షేర్ చేసుకున్నారు. ఇప్పుడు వైట్‌హౌస్ కూడా కీలక ప్రకటన చేసింది.అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన రిపబ్లిక్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్.. 47వ అధ్యక్షుడిగా జనవరి 20న ప్రమాణం చేశారు. ఆయన బాధ్యతలు చేపట్టిన వెంటనే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జన్మతః పౌరసత్వం రద్దు చేశారు. అక్రమంగా అమెరికాలో ఉంటున్నవారిని స్వదేశాలకు పంపిస్తున్నారు. ఇక అనేక నిర్ణయాలతో దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఐరన్ డోమ్ నిర్మాణానికి కూడా ప్రతిపాదన చేశారు. ఈ క్రమంలో వారం తర్వాత అమెరికా కొత్త అధ్యక్షుడికి భారత ప్రధాని నరేంద్రమోదీఫోన్ చేశారు. కీలక అంశాలపై చర్చలు జరిపారు. ట్రంప్ 2.0 అడ్మినిస్ట్రేషన్‌లో



అమెరికా?భారత్ సంబంధాలు మరింత బలపడతాయని మోదీ ఆకాంక్షించారు. రెండోసారి యూఎస్ అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ శ్రేయస్సు, శాంతితోపాటు భద్రత కోసం కృషి చేస్తామని చెప్పారు. వాణిజ్య సమస్యలు, ఇమ్మిగ్రేషన్ విధానాలపై ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ ఇరు దేశాల మధ్య సంబంధాలను ఇవి ప్రభావితం చేసే అవకాశం లేదని తెలుస్తోంది.ట్రంప్‌తో చర్చించిన అంశాలను మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. అమెరికాతో సంబంధాల గురించి అందులో ప్రస్తావించారు. రెండు పక్షాలూ ఉపయోగకరమైన, నమ్మకమైన పార్ట్‌నర్‌షిప్‌ను నిర్మించడానికి కట్టుబడి ఉన్నాయని తెలిపారు. టెక్నాలజీ, వాణిజ్యం, డిఫెన్స్, ఇన్వెస్ట్‌మెంట్, ఎనర్జీ వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునే మార్గాలపై ట్రంప్‌తో చర్చించినట్లు వివరించారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లోని పరిస్థితులు సహా ప్రపంచ సమస్యలపై అభిప్రాయాలను పంచుకున్నారు. త్వరలో ఇద్దరూ కలవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఇక మోదీ, ట్రంప్ చర్చలపై తాజాగా వైట్‌హౌస్ కూడా కీలక ప్రకటన చేసింది. మోదీని అమెరికా పర్యటనకు ఆహ్వానించడంపైనీ చర్చ జరిగిందని తెలిపింది. రెండు దేశాల పరస్పర సహకారం పెంపొందించుకోవడంపై ట్రంప్, మోదీ చర్చించినట్లు అమెరికా అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. అమెరికా తయారు చేసిన ఆయుధాల కొనుగోళ్లను పెంచాల్సిన అవసరాన్ని భారత్‌కు విజ్ఞప్తి చేసినట్లు వైట్‌హౌస్ తెలిపింది. పారదర్శకమైన ద్వైపాక్షిక వాణిజ్య బంధాన్ని పెంచాలని కూడా మోదీని ట్రంప్ కోరారని ప్రకటించింది. ఇరు దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యంపైనా చర్చించినట్లు వివరించింది. ఈ ఏడాది భారత్‌లో క్వాడ్ సదస్సు నిర్వహణపై మోదీ, ట్రంప్ ఫోన్‌కాల్స్‌లో చర్చించారు. ఫిబ్రవరిలో అమెరికా రావాలని మోదీని ట్రంప్ ఆహ్వానించారు. ఈమేరు ఇద్దరూ వైట్‌హౌస్‌లో చర్చిస్తారని తెలిపింది.

## వేములవాడ లో తృటిలో తప్పిన పెను ప్రమాదం

**బీభత్సం సృష్టించిన టిప్పర్ లారీ**
**విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టి దూసుకెళ్లిన టిప్పర్**
**తిప్పాపూర్ లో ఓ దుకాణంతోపాటు ఐదు బైక్ లు ధ్వంసం**
**ఆపే ప్రయత్నం చేసిన డ్రైవర్ రాష్ డ్రైవింగ్ తో ఆగకుండా వెళ్ళిన వైనం**
**దారికి అడ్డంగా భారీ గేట్లు పెట్టి ఆపే ప్రయత్నం చేసిన ఆగకుండా డ్రైవ్ చేసిన డ్రైవర్**
**చివరకు మూలవాగు వద్ద డివైడర్ ను ఢీకొట్టి ఆగిపోయిన టిప్పర్**
**అర్థరాత్రి జరిగిన ఘటనతో తృటిలో తప్పిన ప్రాణనష్టం**

వేములవాడ

వేములవాడ లో తృటిలో పెను ప్రమాదం తప్పింది. టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసి, బీభత్సం సృష్టించాడు. అర్ధరాత్రి జరిగిన ఘటన కావడంతో దారిలో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. వేములవాడ నుంచి తిప్పాపూర్ వైపు వెళ్ళే టిప్పర్

మొదట బైపాస్ రహదారి మహాలక్ష్మి వీధిలోని విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. స్థంభం విరిగి విద్యుత్ వైర్లు కిందపడ్డాయి. ఎవరు అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. టిప్పర్ లో స్థంభం పడగా డ్రైవర్ ఆగకుండా ముందుకు దూసుకెళ్ళాడు. స్థంభం రోడ్డుపై రాక్కుంటు వెళ్ళడం నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. స్థానిక యువకులు పోలీసులు ఆపే ప్రయత్నం చేసిన ఆగకుండా తిప్పాపూర్ లో కదిరే రాజమల్లయ్య కన్సల్టెంట్ దుకాణంలోకి దూసుకెళ్ళింది. దుకాణంతోపాటు ఐదు బైక్ లు ధ్వంసం అయ్యాయి. అయినా ఆగకుండా వెళ్ళాడు. చివరకు పోలీసులు, యువకులు వెంబడించి దారికి అడ్డంగా భారీ గేట్లు పెట్టి ఆపే ప్రయత్నం చేసిన ఆగకుండా డ్రైవ్ చేశాడు డ్రైవర్. చివరకు డివైడర్ ను ఢీకొట్టి టిప్పర్ ఆగిపోవడంతో డ్రైవర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తు దిగేలా గుణపాఠం చెప్పారు. అర్థరాత్రి కావడంతో ఎవరు దారిలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని భావిస్తున్నారు. లేకుంటే నిత్యం భక్తులతో రద్దీగా ఉండే వేములవాడలో పగటిపూట అయితే భారీగా ప్రాణనష్టం జరిగేదని భావిస్తున్నారు. మద్యం మత్తులో రాష్ డ్రైవింగ్ చేసిన డ్రైవర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# వైసీపీకి దిశా,నిర్దేశం ఎవరు..



విజయవాడ జనవరి 30, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు టీటీడీ ఎంపీలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈనెల 31న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.. ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండటంతో.. చంద్రబాబు ఎంపీలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి ఏవిధంగా కేటాయింపులు ఉంటాయి..? వాటిమీద ఎలా స్పందించాలి.? బడ్జెట్‌పై చర్చలో ఎలా వ్యవహరించాలి..? ఎలాంటి అంశాలు లేవనెత్తాలి..? అనే విషయాలపై గైడెన్స్ ఇచ్చారు. రాష్ట్రానికి నిధులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాజధాని అమరావతిని హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలతో అనుసంధానిస్తూ బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు ఈ ఐదేళ్లలో కచ్చితంగా శంకుస్థాపన చేసేలా ఎంపీలంతా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం లభించేలా ప్రయత్నించాలన్నారు.ఎంపీలతో చంద్రబాబు మీటింగ్‌లో? అమరావతి, పోలవరం కీలకమైన ప్రాజెక్టులే ప్రధానంగా ప్రస్తావనకొచ్చినట్టు తెలుస్తోంది. గత బడ్జెట్‌లోనే పోలవరం కోసం 12 వేల కోట్ల పైచిలుకు నిధులు కేటాయించింది కేంద్రం. కానీ.. చివరి డీపీఆర్‌ను ఆమోదించి ఆ మేరకు నిధులు విడుదల చేసేలా కార్యాచరణ ఉండాలి? పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చివరి పైసా వరకూ తమదే బాధ్యత అని ఇటీవలే హోంమంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారు. అటు.. అమరావతి మౌలిక సదుపాయాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్రానికి నిధులు రావాల్సిన నిధులు, తీసుకురావాల్సిన విధానంపైనా పార్టీ ఎంపీలకు డైరెక్షన్ ఇచ్చారు సీఎం చంద్రబాబు..ఇక టీడీపీ సంగతి అటుంచితే? వైసీపీలో కేంద్ర బడ్జెట్ సమావేశాలపై ఎలాంటి ఊసు లేదు. వైసీపీ ఎంపీలతో అధినేత భేటీ అయ్యిందీ లేదు. ఎంపీలకు దిశానిర్దేశం, గైడెన్స్ అన్న మాటలు అస్సలేలేవు. అసలేంటి వైసీపీలో ఏం జరుగుతోంది?? కీలక బడ్జెట్ టైమ్‌లోనూ కామ్‌గా ఉండటమేంటి?? అంటూ పొలిటికల్ సర్కిల్‌లో హాట్‌హాట్ డిబేట్స్ నడుస్తున్నాయ్.ఇక విజయసాయి రెడ్డి రాజీనామాతో వైసీపీ కాస్త డల్ అయినట్లు తెలుస్తోంది. మూడేళ్లు ఉండగానే రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు విజయసాయిరెడ్డి. అంతేకాదు పార్టీకి కూడా గుడ్‌బై చెప్పేశారు. అయితే పార్లమెంట్ సెషన్స్‌లో విజయసాయిరెడ్డి కీలకంగా వ్యవహరించేవారు. పార్లమెంట్‌లో వైసీపీకి టీమ్ లీడ్‌గా ఉండేవారు. ఇప్పుడాయన లేకపోవడం వైసీపీ పెద్దలోటే అయినప్పటికీ? ఆయన స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారు. వైసీపీ ఎంపీలను ఎవరు లీడ్ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది?!రాజ్యసభలో 11 మందిగా ఉండే వైసీపీ టీమ్ ఇప్పుడు ఏడుకి పడిపోయింది. అంతకుముందు బీద మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణ, ఆర్.కృష్ణయ్య రాజీనామా చేయగా? తాజాగా విజయసాయిరెడ్డి పార్టీని వీడటంతో ఆ సంఖ్య ఏడుకి తగ్గింది. ప్రస్తుతం వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, నిరంజన్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, మేడా రఘునాథ్ రెడ్డి, గొల్ల బాబూరావు రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. మరి వీరిలో ఎవరు విజయసాయిరెడ్డి పాత్ర పోషిస్తారు?? పార్టీ గొంతును ఎవరు గట్టిగా వినిపిస్తారన్నది ఇంట్రెస్టింగ్‌గా మారింది.మొత్తంగా? బడ్జెట్ సెషన్స్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఏపీలోని పార్టీలని ప్రిపేర్ అవుతుంటే? వైసీపీలో మాత్రం నిర్లిప్తత కనిపిస్తోంది. ఇప్పటివరకు పార్టీ అధినేత ఎంపీలతో భేటీ కాకపోవడం, దిశానిర్దేశం చేయకపోవడం చర్చనీయాంశమైంది.

# అమల్లోకి వాట్సప్ సేవలు

నెల్లూరు, జనవరి 30, (న్యూస్ పల్స్)

ఆంధ్రప్రదేశ్ మరో కీలక సంస్కరణను అమలు చేసేందుకు సిద్ధమైంది. దేశంలో తొలిసారిగా...ప్రభుత్వ పౌరసేవలు, ప్రజల నుంచి వినతులు స్వీకరణ, అవసరమైన సమాచారం అందించేందుకు వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రారంభించనుంది. జనవరి 30 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయిజ వాట్సాప్ సేవలను మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. తొలివిడతలో 161 ప్రభుత్వ సేవలు అందుబాటులో తీసుకురానున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. వెరిఫైడ్ ట్యాగ్ తో అధికారిక వాట్సాప్ నంబర్‌ను అందుబాటులో తెస్తామన్నారు. ఈ వాట్సాప్ నెంబర్ వన్‌స్టాప్ సెంటర్‌లా పనిచేస్తుందన్నారు. భవిష్యత్తులో ఈ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు.ఈ విధానంలో ప్రభుత్వం నేరుగా ప్రజలకు సమాచారం అందిస్తుంది. వాట్సాప్ అకౌంట్ లో భారీవర్షాలు, వరదల కారణంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటన, విద్యుత్ అంతరాయం. పిడుగులు పడే అవకాశం, మీ ప్రాంతంలో జరిగే అభివృద్ధి పనులపై సమాచారాన్ని ఒకేసారి కోట్ల మందికి వాట్సాప్ ద్వారా చేరవేయనుంది.ప్రజలు తమ సమస్యలపై వినతులు, ఫిర్యాదులు చేయవచ్చు. ప్రభుత్వ నెంబర్ కు మెసేజ్ చేస్తే, వెంటనే వారికి ఒక లింక్ పంపిస్తారు. అందులో సంబంధిత వ్యక్తి పేరు, ఫోన్ నెంబర్, అడ్రస్, సమస్యలను టైప్ చేయాలి. వెంటనే వారికి ఒక రిఫరెన్స్ నెంబర్ ఇస్తారు. దీని ఆధారంగా వారి సమస్య పరిష్కారం ఎంత వరకూ వచ్చిందో చెక్ చేసుకోవచ్చు. తమ ప్రాంతంలోని డ్రైనేజీ కాలవల లీకేజీలు, రహదారుల గుంతలు ఫొటోలు తీసి పంపవచ్చు. వాతావరణ కాలుష్యంపై వాట్సాప్ లో ఫిర్యాదులు చేయొచ్చు. ప్రభుత్వం అమలుచేసే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు అర్హతలు, లబ్ధి గురించి వాట్సప్ నెంబర్ కు మెసేజ్ చేసి తెలుసుకోవచ్చు.రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని



వాట్సాప్‌లో తెలుసుకోవచ్చు. మీకు కావాల్సిన ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని, టికెట్లు, వసతి సహా అన్ని బుక్ చేసుకోవచ్చు. విద్యుత్తు బిల్లులు, ఆస్తి పన్నులను అధికారిక వాట్సాప్ ద్వారా చెల్లించవచ్చు. అలాగే ట్రేడ్ లైసెన్సులు పొందవచ్చు. దేవాలయాల్లో దర్శన టికెట్లు, వసతి బుకింగ్, విరాళాలు పంపడం చేయవచ్చు. అదే విధంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ రికార్డుల యాక్సెస్, వివిధ సర్టిఫికెట్లు వాట్సాప్ ద్వారా పొందవచ్చు."దేవదాయ, ఇంధనం, ఏపీఎస్‌ఆర్టీసీ, రెవెన్యూ, అన్న క్యాంటీన్, సీఎంఆర్‌ఎఫ్, మున్సిపల్ శాఖలకు సంబంధించిన 161 ప్రభుత్వ సేవలు రేపటి నుంచి వాట్సాప్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. దేశంలోనే వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు అందిస్తున్న తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేష్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్ 22న మెటా సంస్థతో ఒప్పందం చేసుకున్నది. ధ్రువపత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బంది ఇక ప్రజలకు తప్పుతుంది"- సీఎం చంద్రబాబు

## అక్రమ మందు నిల్వలపై డీసీఏ దాడులు

నిజామాబాద్, జనవరి 30,

తెలంగాణ రాష్ట్రంలోని సెకింద్రాబాద్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్నట్లు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు తెలిపారు. ఈ దాడి శుక్రవారం ఈస్ట్ మారేడ్‌పల్లి ప్రాంతంలోని సిద్ధి శ్రీధర్ క్లినిక్‌లో నిర్వహించారు. ఈ దాడిలో 27 రకాల మందులు, ముఖ్యంగా యాంటీబయోటిక్స్, యానల్జిసిక్స్, స్వాధీనం చేసుకున్నారు. ఈ మందులు సరైన లైసెన్స్ లేకుండా నిల్వ చేయడం ద్వారా డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టాన్ని ఉల్లంఘించారని అధికారులు తెలిపారు. అధికారులు స్వాధీనం చేసిన మందులను స్వాధీనం చేసుకుని, మరింత విచారణ చేపట్టారు. అనుమతులు లేకుండా మందులను సరఫరా చేసే డీలర్ల పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ఇంకొక దాడిలో ఆఅం అధికారులు కొన్ని ఆయుర్వేద మందులను తప్పుదారి పట్టించే ప్రకటనలతో మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. భవాని ఫార్మాస్యూటికల్స్ కంపెనీ తయారు చేసిన 'దవ-టోన్ సిరప్'ను కిడ్నీ రాళ్లను చికిత్స చేయడానికి అని, మన్‌ఫర్ ఆయుర్వేద డ్రగ్స్ కంపెనీ తయారు చేసిన 'శతాపుష్ప ఫ్రూట్ చూర్ణ'ను జ్వరం చికిత్స చేయడానికి అని, ఆల్నా బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ తయారు చేసిన 'కార్డిఫోలియా టాబ్లెట్లు'ను జ్వరం చికిత్స చేయడానికి అని తప్పుదారి పట్టించే ప్రకటనలతో మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ ప్రకటనలు డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్‌మెంట్స్) చట్టం, 1954ను ఉల్లంఘిస్తున్నాయి.అధికారులు స్పష్టంగా తెలిపారు, నిర్ధారణ చేయని వైద్య ప్రకటనలను ప్రచారం చేయడం చట్టవిరుద్ధం, ఈ చట్టం ప్రకారం శిక్షించబడుతుంది. ఈ దాడులు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో నిర్వహించారు. విచారణ పూర్తైన తర్వాత, నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేయబడతాయని అధికారులు తెలిపారు

## బయట సమోసాలు తిని ఐదుగురు విద్యార్థినీలకు అస్వస్థత...

**డీటీడీవో శంకర్**

సూర్యాపేట సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గిరి నగర్ గిరిజన బాలికల వసతి గృహంలో ఐదుగురు విద్యార్థినీలకు అస్వస్థతకు గురయ్యారు. విరామ సమయంలో స్కూల్ బయట కొనుగోలు చేసిన సమోసాలు తిన్న విద్యార్థినీలే అస్వస్థతకు గురైనట్లు డీటిడీవో శంకర్ తెలిపారు. బాలికలు తెలిపిన వివరాల ప్రకారం హాస్టల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న కనిష్క, పూజిత, మహేశ్వరి, అక్షిత దుర్గ,అనే విద్యార్థినీలు స్కూల్ విరామ సమయంలో స్కూల్ బయట సమోసాలు కొనుగోలు చేసి తిన్నారు. రెండు గంటల తర్వాత సమోసాలు తిన్న ఐదుగురు వాంతులు చేసుకున్నారు, దీనితో స్కూల్ పక్కనే ఉన్న పిహెచ్సి లో ట్రీట్మెంట్ అందించి తిరిగి స్కూల్కి పంపించారు. మరల ఆరోగ్య పరిస్థితి బాగాలేక పోవడంతో సిబ్బంది మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో వేణుమాధవ్ , డిప్యూటీ డీఎం హెచ్ ఓ చంద్రశేఖర్, డీటీడీవో శంకర్ ఆసుపత్రికి చేరుకుని వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినీల పరిస్థితి మెరుగుపడినట్లు ఆరోగ్య పరిస్థితిని నిలకడగా ఉండడంతో తిరిగి హాస్టల్కు తరలించామని శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు

హైదరాబాద్ ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావు, రాధా కిషన్ రావుకు బెయిల్ మంజూరు అయింది. లక్ష రూపాయలతో కూడిన రెండు షూరిటీలు సమర్పించాలని హైకోర్టు షరతు విధించింది.

# ఒక్కొక్కొ వివాదంలో ఇరుక్కుంటున్న వైసీపీ నేతలు

కాకినాడ, జనవరి 30 అయిదేళ్ల పాలనతో అనేక అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడిన వైసీపీలో ముఖ్య నాయకులందరూ కూటమి ప్రభుత్వానికి టార్గెట్ అవుతున్నారు. వైసీపీ మౌత్ పీస్‌లా పనిచేసి టీడీపీ, జనసేన అధినేతలతో పాటు, ఆ పార్టీల ఇష్టానుసారం నోరుపారేసుకున్న వారంతా.. ఇప్పుడు ఒకొక్క వివాదంలో ఇరుక్కుంటూ కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అయితే అలాంటి వారికి సొంత పార్టీ నుంచి ఎలాంటి మద్దతు లభించడం లేదంట. ఎవరిపై వచ్చిన ఆరోపణలకు వారే సమాధానాలు ఇస్తున్నారు తప్ప పార్టీలో ఇతర నేతలు మాత్రం వారికి సపోర్ట్‌గా మాట్లాడటం లేదట. దీంతో అసలు పార్టీలో ఏం జరుగుతుందో అర్థం కాక కేడర్ గందరగోళంలో పడుతోందంట. అసలు వైసీపీ పెద్దల మౌనం వెనుక.ప్రభుత్వం మారినప్పటి నుంచి పలువురు వైసీపీ ముఖ్య నేతలు రకరకాల ఆరోపణలు ఎదుర్కోవాల్సి వస్తూ.. కేసుల చట్రంలో ఇరుక్కుంటున్నారు. పార్టీలో కీ లీడర్ విజయసాయిరెడ్డి దగ్గరి నుంచి రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, అంబటి రాంబాబు, రోజా వంటి ముఖ్య నేతలు వివిధ అభియోగాలు ఎదుర్కొంటున్నారు. జగన్‌కు సలహాదారుడిగా వ్యవహరించిన పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు భార్గవ్‌లు కూడా అరెస్టుల భయంతో కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. అయితే ఆయా నేతలపై ఆరోపణలు వచ్చిన సమయంలో ఎవరికీ వారే బయటకు వచ్చి అసలేం జరిగిందనే దానిపై వివరణలు ఇచ్చుకోవాల్సి వస్తుంది.అంతే తప్ప ఎక్కడా కూడా ఒకరికి మద్దతుగా మరొకరు మాట్లాడిన సందర్భాలు కనపడటం లేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలు మాత్రమే వివరణలు ఇచ్చుకుంటున్నారు. మామూలుగా ఏ పార్టీలో అయినా అధికారం ఉన్నా లేకపోయినా ఆరోపణలు ఎదుర్కొనే నాయకులకు మద్దతుగా పలువురు నేతలు బయటకు వచ్చి మాట్లాడతారు. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీలో కూడావిమర్శలను తిప్పికొట్టడానికి నాయకులంతా మీడియా ముందు ప్రత్యక్షమయ్యేవారు. కానీ ఓటమి తర్వాత వైసీపీలో అలాంటి సిట్యువేషన్ లేకపోవటం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.పౌరసరఫరాల శాఖ అద్దెకు తీసుకున్న పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఉన్న గోడౌన్‌లో వేల బస్తాల రేషన్ బియ్యం మాయమయ్యాయి. దానిపై ప్రభుత్వం కేసు పెట్టింది. పౌరసరఫరాల అధికారుల ఫిర్యాదు మేరకు గోడౌన్ యజమాని జయసుధపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేయడమే కాకుండా, ఆమెను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని పేర్ని నాని ఆయన కుమారుడు కిట్టుకు కూడా నోటీసులు జారీ చేసేందుకు పోలీసులు ఆయన ఇంటికి వెళ్లటం.. వారు లేకపోవటంతో నోటీసులు ఇంటికి అంటించి వెళ్ళటం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి.అప్పట్లో నాలుగు రోజులు ఎవరికి అందుబాటులో లేని పేర్ని నాని వైసీపీ సెంట్రల్ ఆఫీస్ లో సడెన్ ఎంట్రీ ఇచ్చారు. జరిగిన పరిణామాలపై మీడియా ముందుకు వచ్చిన పేర్ని నాని.. వ్యక్తిగతంగా కక్ష తీర్చుకోవాలంటే తన సతీమణిని విడిచిపెట్టి, తనను అరెస్టు చేసుకోవచ్చన్నారు. తనను కట్టుకున్న నేరానికి నా భార్య వ్యక్తిత్వ హననానికి గురవుతుందని చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు. టెక్నికల్‌గా తమ బాధ్యత లేకున్నా.. నైతికంగా బాధ్యత వహిస్తూ అధికారులు చెప్పినట్లుగా జరిమానా చెల్లించామన్నారు. తమ కుటుంబం ఎటువంటి తప్పు చేయలేదని తన తల్లి మీద ఒట్టేసి చెబుతున్నానన్నారుతమపై కక్ష కట్టి తన భార్య, గోడౌన్ ఇన్‌చార్జి మీద కేసు నమోదు చేశారన్నారు. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు వెళ్తే రకరకాల కుట్రలు చేశారని పేర్ని నాని ఆరోపించారు. అధికారులు అడిగినట్లు జరిమానా కట్టాక కూడా క్రిమినల్ కేసులు పెట్టడం సివిల్ సప్లైస్ చరిత్రలోనే లేదన్నారు. పేర్ని నాని వరుస పరిణాలమాలపై మీడియా సమావేశం అనంతరం కూటమి నేతలు ఆయనకు గట్టిగానే కౌంటర్ లు ఇవ్వటం స్టార్ట్ చేశారట. మంత్రులు నాదెండ్ల మనోహర్ తో పాటు కొల్లు రవీంద్ర సహ టీడీపీ నేతలు ప్రభాకర్ రెడ్డి, బుద్దా వెంకన్న తదితరులు పేర్ని నానిపై తీవ్ర విమర్శలు గుప్పించారు.గతంలోనే తమను టార్గెట్ చేసి కేసులు పెట్టించినప్పుడు ఏమైందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్నినాని కేనా పెళ్లాం పిల్లలు.. తమకు లేరా అని కూటమి నేతలు ఫైర్ అయ్యారు. మంత్రిగా ఉన్నప్పుడు పేర్నినానికి ఆడవాళ్లు గుర్తుకురాలేదా అంటూ సెటైర్లు వేశారు. కూటమి నేతలు ఒకరి తర్వాత మరొకరు వరుసగా టార్గెట్ చేస్తుండటంతో పేర్ని నాని సైలెంట్ అయిపోవాల్సి వచ్చింది. అయితే కూటమి నేతలు వరుసబెట్టి నానిపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నా వైసీపీ నుంచి ఇతర నేతలు ఎవరూ ఈ విషయంలో రియాక్ట్ కాలేదు.. వైజాగ్ లో ప్రెస్ మీట్ పెట్టిన బొత్స సత్యనారాయణ హైదరాబాద్ లో ప్రెస్ మీట్లు పెట్టిన బుగ్గన, శ్రీకాంత్ రెడ్డి కానీ చిత్తూరులో మాట్లాడిన ఎంపీ మిథున్ రెడ్డి కానీ.. ఇతర సీనియర్లు కూడా వారు మాట్లాడాలనుకున్న విషయాలను మాట్లాడారే తప్ప నాని అంశాన్ని ప్రస్తావించలేదు.గతంలో విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామక?ష్ణారెడ్డి వంటి నేతలు ఆరోపణలు ఎదుర్కొన్న సమయంలో కూడా.. ఎవరిపై వచ్చిన ఆరోపణలకు వారే సమాధానాలు చెప్పారే తప్ప ఇతర వైసీపీ నేతలెవ్వరూ వారికి సపోర్ట్‌గా బయటకు రాలేదు.. ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటున్న తమ నేతలకు సొంత పార్టీ వారే అండగా నిలబడకపోవడం వైసీపీ శ్రేణులకు మింగుడు పడటం లేదంట. దాని గురించి ప్రస్తావిస్తే వైసీపీ అధిష్టానం మాత్రం అవసరమైన సమయంలో అందరూ కచ్చితంగా స్పందిస్తారని చెబుతోందట.పార్టీ లీడర్ల నుంచి క్యాడర్ వరకు ఎవరికైనా ఏ ఇబ్బంది వచ్చినా వారికి పార్టీ అండగా ఉంటుందని జగన్ బయటకు వచ్చినప్పుడల్లా చెప్పి వెళ్తున్నారు. పార్టీలో ప్రతీ ఒక్కరూ ముఖ్యమేనని అందరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చి పోతున్నారు .. ఆయన మాట్లాడం కాదుకదా పార్టీలో ఒకరికి మద్దతుగా మరొకరు స్పందించడం మానేశారు. దాంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతల విషయంలో అసలు పార్టీ లైన్ ఏంటనేది స్పష్టత రాకపోవడం పార్టీ వర్గాలను అయోమయానికి గురిచేస్తోందట. పార్టీలోని కీలక నేతలకే దిక్కులేక పోతే ఇక తమను పట్టించుకునేదెవరని? వైసీపీ శ్రేణులు బెంబేలెత్తి పోతున్నాయంట.

## దిగాలుగా పల్లీ రైతులు

మహబూబ్ నగర్, జనవరి 30,

: తిను బండారమైన వస్తువైనా ఏదైనా తయారుచేసిన ఆ వస్తువు డిమాండ్ ను పరిగణలోకి తీసుకుంటూ ధరను నిర్ణయించడం తయారీదారుడి హక్కుగా పరిగణిస్తాం. ఇది నిజం కూడా ఇది అందరూ ఒప్పుకుంటారు. ఒక్క రైతు విషయంలో మాత్రం పండించిన పంటకు వ్యాపారస్తులు ధనం నిర్ణయిస్తారు. మార్కెట్లో తయారుచేసిన వ్యక్తికి హక్కు ఉంది.అవసరం ఉంటే కొనండి... లేదంటే మానేయండి అనే విధంగా వివిధ వ్యాపారాల్లో వ్యాపారస్తులు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఒక్క రైతు విషయానికి వస్తే మాత్రం మీరు పండించిన పంటకు ధర గింతే ? మీకు ఇష్టమైతే ఇవ్వండి లేదంటే తీసుకుపోండి ? అనే విధంగా వ్యాపారస్తులు రైతులతో వాదిస్తున్న దాఖలాలు లేకపోలేదు. నాలుగు నుంచి ఆరు మాసాలు శ్రమించి పండించిన పంట దిగుబడి అంతంత మాత్రమే ఉండి ధరలు కూడా లేకపోవడంతో వేరుశనగ రైతు కన్నీటి పర్వతమవుతున్నారు. రాత్రి పగలు శ్రమించి పండించిన వేరుశనగకు ఆశించిన మేరకు ధరలు లేకపోవడంతో రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. పల్లి కొనుగోలు చేయు సమయంలో అధిక ధరకు విక్రయించిన వ్యాపారస్తులు, రైతు విక్రయించినప్పుడు వ్యాపారస్తులు కొనే సమయంలో మాత్రం ధర ఎందుకు లేదని రైతుకు ఎప్పటికీ దొరకని సమాధానంగా ప్రశ్న మిగిలిపోతుంది. మహబూబ్ నగర్ మార్కెట్ యార్డ్ కు చాలా ప్రత్యేకత ఉంది. జిల్లా నలుమూలల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి అత్యధికంగా పల్లి ఈ మార్కెట్ యార్డ్ కు చేరుకుంటుంది. రోజు దాదాపు 5000 క్వింటాళ్లు పల్లి ప్రస్తుతం వస్తుంది. మంగళవారం మొత్తం 4848 పల్లి మార్కెట్ కు చేరుకుంది.అత్యధిక ధర 6526 రాగ అత్యల్పంగా దాటిన కేవలం అతి తక్కువ పనికి మాత్రమే రూ 3506 ధర రావడం జరిగింది. అత్యధికంగా పెద్ద మొత్తంలో కొనుగోలు చేయుచున్న పల్లికి రూ 3500 నుంచి రూ 5 వేల మధ్య మాత్రమే ధర పలుకుతుంది. తక్కువ స్థాయిలో మాత్రమే రూ 6600 వరకు క్వింటాల్ కు ధర పలుకుతుంది. దీంతో రైతన్న పెట్టుబడి కూడా రావడం లేదని, ఇలా అయితే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పంటను పండిస్తారు... వ్యాపారస్తులు ఎంత చెబితే అంతకు అమ్ముకుంటారు... ఇది మా కర్మ ఇంకా ఏం చేస్తాం అనుకుంటూ వెళ్లిపోతారు.. ఈ దృశ్యాలు, ఆవేదన శ్రమించి పండించిన పంట విక్రయించిన ప్రతిసారి రైతులు కలత చెందుతున్నారు. పల్లి కొనుగోలు చేయుసమయంలో అన్ని విత్తనాలు అందుబాటులో ఉంచిన మాదిరిగానే, పల్లి విత్తనాలు కూడా ప్రభుత్వం అందుబాటులో ఉంచి తక్కువ ధరకు నాణ్యమైన విత్తనాలు అందిస్తే మేలు జరుగుతుందని రైతులు కోరుకుంటున్నారు.ఒక పల్లె విషయానికి వస్తే మాత్రం ప్రభుత్వము పల్లి విత్తనాలను అందించడం లేదనే ఆవేదన రైతుల్లో ఎంతో ఉంది. దీంతో వ్యాపారస్తులు దగ్గరనే వివిధ పేర్లతో లభించే పల్లి విత్తనాలను కొనుగోలు చేసి, అత్యధిక పెట్టుబడి పెట్టి సాగు చేస్తే దిగుబడి రాకపోవడంతో పాటు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు రైతులకు మెండుగా ఉన్నాయి.ప్రభుత్వ ఆలోచనలు రైతులకు దరి చేరాలంటే మన జిల్లాలో అత్యధికంగా పండించే పల్లి రైతులకు కూడా నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి ఉంచి, సరియైన ధరలలో కొనుగోలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. సీజన్ వచ్చిందంటే పంట పండించాలి.. మంచిగా లాభం వచ్చేటట్లు చూసుకోవాలి అని ఉంటుంది. గట్లనే అనుకోని పల్లెని పండించిన ఏమి లాభం. ఐదు ఎకరాల్లో పల్లి పంట పండిస్తే 100 సంచలపల్లి అయింది. రెండు లక్షల పైగా ఖర్చు అయింది. అసలు పల్లి ధర తక్కువగా ఉంది. ఎన్ని రోజులు ఇక్కడ ఉండి ఆవేదన చెప్పకుండా మమ్మల్ని ఎవరు పట్టించుకుంటారు అయ్యా. మా గతికింతే ఏం చేస్తాం. జర సర్కారులు ఆలోచన చేయాలి మా గురించి అని కోరుతున్నారు

## గాంధీ విగ్రహానికి వినతిపత్రం

యాదాద్రి జిల్లా

కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి నేటికీ 420 రోజులు పూర్తి అయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నెరవేర్చాలని భువనగిరిలో గాంధీ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి వినతిపత్రం బీఆర్ఎస్ పార్టీ నాయకులు అందజేసారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంతవరకు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చకపోవడంతో వారు నిరసన చేపట్టారు. విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసి గాంధీ జయంతి లోగా నైన హామీలన్నీ పూర్తి చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు..

## బేగంపేటలో కాలేజీ విద్యార్థుల అందోళన

సికింద్రాబాద్..

బేగంపేటలోని ప్రైవేట్ కళాశాల వద్ద విద్యార్థులు ఆందోళన కు దిగారు. ఇంగ్లీష్ లెక్చరర్ నాగేంద్ర మాల కు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ విద్యార్థులు నిరసన చేపట్టారు. క్లర్కు స్వామి ,ఇన్చార్జి ప్రిన్సిపల్ రజినీలు తనను వేధిస్తున్నారని ఇంగ్లీష్ లెక్చరర్ నాగేంద్ర మాల ఆరోపించారు.జనవరి 25 న క్లర్క్ స్వామి,ఇంచార్జీ ప్రిన్సిపల్ రజినీ లు తన వీడియోలు రహస్యంగా తీశారని ఆరోపించారు. ఇదే విషయమై 27 న బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలైన నాగేంద్ర మాల కు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేస్తూ విద్యార్థులు, ఎన్ ఎస్ యు ఐ నాయకుల నిరసన కు దిగారు.తన పట్ల కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై ఆమె తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తనకు న్యాయం చేయాలని తన పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# తమ్ముళ్ల మధ్య తారాస్థాయికి యుద్ధం

తిరుపతి, జనవరి 30, తంబళ్లపల్లె నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి జయచంద్రారెడ్డి వర్సెస్ తెలుగు తమ్ముళ్ల మధ్య యుద్ధం తారా స్థాయికి చేరింది. చంద్రబాబుపై రాళ్ల దాడి చేయడంతో పాటు యువ నేత నారా లోకేష్‌పై బూతు పురాణంతో విరుచుకుపడిన వ్యక్తులను పార్టీలోకి చేర్చుకుంటున్న ఇన్చార్జ్‌పై తంబళ్లపల్లె తమ్ముళ్లు రగిలిపోతున్నారంట. రాష్ట వ్యాప్తంగా కూటిమి ప్రభంజనం వీడిననప్పటికీ తంబళ్లపల్లెలో టీడీపీ ఓటమికి పెద్దిరెడ్డి కుటుంబంతో జయచంద్రారెడ్డి చేసుకున్న లోపాయికారీ ఒప్పందమే కారణమని పార్టీ శ్రేణులు విమర్శిస్తున్నాయి. అయితే పార్టీ ఇన్చార్జ్ మాత్రం తనను సొంత వారే వెన్నుపోటు పొడిచారని ఆరోపిస్తున్నారు. ఎవరి వాదనలు ఎలా ఉన్నా ప్రస్తుతం అక్కడ పార్టీకి పెద్ద దిక్కులేకుండా పోయాడంటున్నారు.చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీలో వర్గ విబేధాలు తారాస్థాయికి చేరాయి. తంబళ్లపల్లె నియోజవర్గం తెలుగుదేశం ఆవిర్భావం నుంచి టీడీపీకి బలమైన నియోజకవర్గాల్లో ఒకటిగా ఉండేది. కాని ప్రస్తుతం సరైన నాయకుడు లేని పరిస్థితి ఎదుర్కొంటోంది. 2009లో లక్ష్మీ దేవి కూమారుడు ప్రవీణ్ కూమార్‌రెడ్డి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. అయితే మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డితో పాటు ప్రవీణ్ కూడా వైసీపీలో చేరిపోయారు. 2014లో వైసీపీ తరపున పోటీచేసిన ప్రవీణ్‌ను అప్పుడే టిడిపిలో చేరిన శంకర్ యాదవ్ ఓడించారుసరిగ్గా అప్పుడే మాజీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చూపు తంబళ్లపల్లెపై కూడా పడింది. 2019లో శంకర్ యాదవ్ పై వైసిపి అభ్యర్దిగా పెద్దిరెడ్డి తమ్ముడు ద్వారకానాథ్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిచారు. అ ఎన్నికల్లో ఓటమి తర్వాత తంబళ్లపల్లెలో టీడీపీ పరిస్థితి దారుణంగా మారిపోయింది. పెద్దిరెడ్డి పెత్తనానికి దడిచి జిల్లా అగ్ర నాయకులు కనీసం అటు వైపు దృష్టి సారించలేదంటారు. గత ఎన్నికల ముందు అభ్యర్థి విషయంలో చివరి దాకా అగినా.. అధిష్టానం చివరికి మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ కాదని జయచంద్రారెడ్డికి టికెట్ ఇచ్చింది.జయచంద్రారెడ్డి అభ్యర్థిత్వాన్ని శంకర్ వర్గం వ్యతిరేకించింది. ఎన్నికల్లో జయచంద్రరెడ్డి రెడ్డి ఓడిపోయారు. అంతకు ముందు ఎన్నికల్లో సాధించిన మెజార్టీలో నాలుగో వంతు మెజార్టీ సాధించిన పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి రెండో సారి ఎమ్మెల్యే అయ్యారు. అప్పటి నుంచిజయచంద్రరెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు శంకర్ అనుచరులకు ఇప్పుడు లోకల్ టీడీపీ కేడర్ కూడా తోడైంది.ఈ మధ్య రెండు వర్గాల మధ్య అధిపత్యపోరు పిక్స్ చేరిందంటున్నారు. ముఖ్యంగా జయచంద్రరెడ్డి తీరును అసలు తమ్ముళ్లు తట్టుకోలేక పోతున్నారంట. 2019 ఎన్నికల్లో దాదాపు 47 వేల ఆధిక్యతతో గెలిచిన పెద్దిరెడ్డి తమ్ముడు గత ఎన్నికల్లో పది వేల మెజార్టీతో గట్టెక్కారు. దానికి పెద్దిరెడ్డి ఫ్యామిలీతో జయచంద్రారెడ్డి చేసుకున్న లోపాయికారీ ఒప్పందమే కారణమన్న ఆరోపణలున్నాయి. దానికి తగ్గట్లే ఎన్నికల తరువాత పెద్దిరెడ్డి అనుచరులను ఆయన పార్టీలో చేర్చుకోవడం మొదలెట్టారు. తంబళ్లపల్లెలో చంద్రబాబుపై రాళ్ళ దాడి చేసివారికి సైతం టీడీపీలో చేర్చుకుని ప్రాధాన్యత ఇస్తున్నారని తెలుగు తమ్ముళ్లు ఆరోపిస్తున్నారు. ఆ క్రమంలో జయచంద్రరెడ్డి తీరుపై పార్టీ పెద్దలకు ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేశారంట. ఇన్‌చార్జ్‌గా ఆయన్ని తప్పించాలని డిమాండ్ చేస్తున్నారంట.ఇదే సమయంలో మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా తంబళ్లపల్లె సెగ్మెంట్లో పోటాపోటీగా ఫ్లెక్సీలు వెలిశాయి. జయచంద్రారెడ్డి వర్గం ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను అయన వ్యతిరేకవర్గం చింపేయడంతో.. శంకర్ వర్గం తెచ్చిన భారీ కేక్ ను నేల పాలు చేసారు జయచంద్రారెడ్డి వర్గీయులు. ఇరు వర్గాలు రోడ్డున పడి కొట్టుకునే స్థితికి రాగా వారిని సముదాయించడం పోలీసులకు తలనొప్పిగా మారింది. ఎన్నికల ముందు శంకర్‌యాదవ్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన స్థానిక కేడర్ ఇప్పుడు జయచంద్రారెడ్డి తీరు నచ్చక శంకర్‌తో కలసి అడుగువేస్తున్నారంట.జయచంద్ర రెడ్డి మాత్రం ఎవరు ఎన్ని చెప్పినా వినకుండా వైసీపీ మద్దతుదారులకే సహాయం చేస్తున్నారని ఆరోపణలు తీవ్ర స్థాయిలో వినబడుతున్నాయి. ఎన్నికల ముందు పెద్దిరెడ్డితో లోపాయికారీ ఒప్పందం గురించి ఆరోపణలు ఎదుర్కొన్న జయచంద్రారెడ్డి ఎన్నికల తర్వాత కూడా అదే తీరు ప్రదర్శిస్తుండటంపై తెలుగుతమ్ముళ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో అక్రమ కార్యకలాపాలు పెరిగాయని దానికి కారణం జయ చంద్రారెడ్డి వెంట తిరుగుతున్న వైసీపీ మద్దతు దారులే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు పై అంగల్లలో రాళ్లతో దాడి చేసిన వారికి సైతం ఆయన రక్షణగా ఉంటూ పచ్చ కండువా కప్పి తన వెంట తిప్పుకుంటున్నారంట. మొత్తం మీద టిడిపిలోని గొడవలను వైసీపీ శ్రేణులు తెగ ఎంజాయ్ చేస్తున్నాయంట.

# క్యాడర్ కు అండగా పార్టీ

అనంతపురం, జనవరి 30, టీడీపీ అధినేత చంద్రబాబుకు, జగన్ కు మధ్య తేడా చాలా ఉంది. చంద్రబాబుకు ఎన్నికల్లో గట్టెక్కడం ఎలాగో తెలుసు. అలాగే జనాలను ఎన్నికల సమయంలో వాగ్దానాల ద్వారా తనకు అనుకూలంగా మలచుకునేందుకు అవకాశముంది. అదే క్యాడర్ విషయంలో మాత్రం అది కుదరని పని. తమ పార్టీ అధికారంలోకి వస్తే చాలు అని భావించి అన్నింటికీ తెగించి పార్టీ కార్యకర్తలు గెలుపు కోసం కృషి చేస్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టిగా నిలబడేది వాళ్లే. ఓటర్లను పోలింగ్ కేంద్రాలను తరలించేది వాళ్లే. అలాగే ప్రజలను చైతన్యవంతుల్ని చేయడంతో పాటు ప్రభుత్వంపై విమర్శలను తిప్పికొట్టడంలో క్యాడర్ ముందుంటుంది. అందుకే ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా అందుకు క్యాడర్ పాత్రను ఎవరూ కాదనలేరు. జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లు క్యాడర్ ను పట్టించుకోలేదు. పూర్తిగా సంక్షేమ పథకాలను మాత్రమే ఆయన అమలు చేయగలిగారు. అంతేకాదు వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో క్యాడర్ కనుమరుగై పోయింది. ప్రజలు కూడా పార్టీ క్యాడర్ ను పట్టించుకోలేదు. వారి మాటలకు గ్రామ స్థాయిలో విలువ లేకుండా పోయింది. గ్రామంలో జెండా పట్టుకుని తిరిగిన వాళ్లను జనం లెక్క చేయకపోవడం సహజంగా ఇగో దెబ్బతింటుంది. ప్రజలు పట్టించుకుంటే, నాయకత్వం తమకు బాధ్యతలు అప్పగిస్తే ఎప్పటికైనా లీడర్లుగా ఎదుగుతామని క్యాడర్ తెగించి పోరాడుతుంది. కానీ జగన్ చేసిన తప్పుతోనే మొన్నటి ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ క్యాడర్ దూరంగా ఉంది. వాలంటీర్లు ఉద్యోగులు కాబట్టి వారు సహజంగా పట్టించుకోలేదు కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే ఇప్పటి వరకూ వాలంటీర్లను అస్సలు పట్టించుకోలేదు. ఎన్నికలకు ముందు పదివేల రూపాయలు నెలకు గౌరవ వేతనం ఇస్తామని చెప్పిన చంద్రబాబు అసలు వారిని కొనసాగించే ఉద్దేశ్యంలో కూడా లేరు. ఆ వ్యవస్థ వల్ల ఉపయోగం లేదన్న భావనకు చంద్రబాబు వచ్చారు. అందించే పింఛన్లు ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా నెల మొదటి రోజే పంపిణీ చేస్తుండటంతో వాలంటరీ వ్యవస్థ గురించి కూడా జనం పెద్దగా పట్టించుకోవడం లేదు. పైగా టీడీపీ క్యాడర్ కు గ్రామ స్థాయి నుంచి పలుకుబడి పెరిగింది. వారి వద్దకు సిఫార్సుల కోసం వచ్చే వారి సంఖ్య పెరిగింది. దీంతో పాటు కోటి మంది సభ్యత్వాన్ని చేర్పించడంలోనూ క్యాడర్ సక్సెస్ అయిందనే చెప్పాలి.ఇక చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అలాగే ఉచిత ఇసుక ద్వారా క్యాడర్ లబ్దిపొందుతుంది. మద్యం దుకాణాలను కైవసం చేసుకుని ఆర్థికంగా టీడీపీ క్యాడర్ ప్రయోజనం పొందుతుంది. మరొక వైపు రహదారి మరమ్మతు పనుల విషయంలోనూ క్యాడర్ కే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనికి తోడు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ వస్తు?న్నారు. ఇలా జగన్ చేసిన తప్పులను చంద్రబాబు మాత్రం చేయడం లేదు. క్యాడర్ తనకు రక్షణ అని ఆయనకు తెలుసు. రేపటి ఎన్నికల్లోనూ గెలుపు సాధ్యంకావాలంటే వారిని కాపాడుకోవడమే మంచిదన్న చంద్రబాబుఆలోచన ఆయన అనుభవం నుంచి వచ్చిందే. అందుకే జగన్ అలా అయిపోయారు.. చంద్రబాబు ఇలా వ్యవహరిస్తున్నారు.

# పెట్టుబడులు.. కట్టుకధలా...

హైదరాబాద్, జనవరి 30,


స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు ఇటీవల జరిగింది. ఈ సదస్సుకు భారత్ నుంచి పలు రాష్ట్రాల ప్రతినిధులు వెళ్లారు. తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు వెళ్లారు. ఇక ఏపీ నుంచి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌తోపాటు అధికారులు వెళ్లారు. అయితే ఇరు రాష్ట్రాలకు వచ్చిన పెట్టుబడులు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.దావోస్‌లో ఏటా జనవరిలో ప్రపంచ వాణిజ్య సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు భారత్‌తోపాటు ప్రపంచంలోని వివిధ దేశాల ప్రతిధులు వెళ్తారు. పెట్టుబడులను ఆకర్షిస్తారు. తద్వారా దేశ అభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఈ సదస్సుకు ప్రతినిధులు వెళ్తున్నారు. అయితే రెండేళ్లుగా దావోస్ సదస్సులో తెచ్చిన పెట్టుబడులపై ఇరు రాష్ట్రాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవలో రెండు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు, అధికారుల బృందం దావోస్ వెళ్లొచాయి. ఈ పర్యటన తర్వాత ఇరు రాష్ట్రాలకు వచ్చిన పెట్టబడిపై తీవ్ర చర్చ జరుగుతోంది. దేశం నుంచి వెళ్లిన రాష్ట్రాల్లో మహారాష్ట్రకు అత్యధికంగా పెట్టుబడులు వచ్చాయి. తెలంగాణ రెండో స్థానంలో ఉంది. ఏపీకి ఎలాంటి పెట్టుబడులు రాలేదు. దీనిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీకి ఎందుకీ దుస్థితి అని నెటిజన్లు నిలదీస్తున్నారు.ఇక దావోస్ పెట్టుబడులపై తెలంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలో తలో విధంగా స్పందించాయి. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక సాదించిన అతిపెద్ద విజయం ఈ దావోస్ పర్యటన అని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈమేరకు ప్రెస్‌మీట్ పెట్టి మరీ రూ.1.80 లక్షల కోట్ల పెటుట్బడులు సాధించామని వెల్లడించారు. గతంలో ఎన్నడూ ఇంత భారీగా పెట్టుబడులు రాలేదని తెలిపారు. ఇక కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ అనుకూల మీడియా కూడా తెలంగాణకు భారీగా పెట్టుబడులు వచ్చాయని ప్రచారం చేస్తున్నాయి. ఇక ఏపీ విషయంలో మాత్రం మీడియా భిన్నంగా స్పందిస్తోంది. ఈ పత్రిక కథనాలు చూస్తేనే తెలంగాణకు, ఏపీకి పెట్టుబడులు ఎలా వచ్చాయో సులభంగా అర్థమవుతుంది.

తెలంగాణ ఎడిషన్‌లో దావోస్ ధమాకా అనే శీర్షికతో కథనాలు ప్రచురించాయి. దుమ్మురేపిన తెలంగాణ బృందం అంటూ మరో పత్రిక కథనం ఇచ్చింది. ఇక ఏపీలో ఇవే పత్రికలు మళ్లీ ఏపీ బ్రాండ్, పేరుతో కథనం ఇచ్చింది. దావోస్ సదస్సులో బయటపడ్డ మన ఎనర్జీ అని మరో కథనం వచ్చింది. ఏపీలో పరిశ్రమల స్థాపనకు అనుకూలతను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వివరించారని ఇచ్చారు. దీంతో కట్టు కథలు అల్లుతున్నారని జనం మండిపడుతున్నారు.పత్రికల కథనాలు ఎలా ఉన్నా.. ఏపీ మంత్రి లోకేశ్ మాత్రం దావోస్ పర్యటనపై స్పందించారు. దావోస్‌లో పెట్టుబడులకు ఒప్పందాలు జరగవని, కేవలం చర్చలు మాత్రమే జరుగుతాయని వెల్లడించారు. దీంతో గొప్పలు చెప్పడంలో తండ్రికి మించిన తనయుడిగా లోకేశ్ తయారయ్యాడని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ మాత్రానికి దావోస్ వెళ్లడం దేనికి అని కూటమి నేతలు కూడా గుసగుసలాడుతున్నారు. ఎలాంటి ఒప్పందాలు చేసుకోకపోవడం ఏంటని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తెలంగాణ సాధించిన పెట్టుబడులను ఏపీ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోంది.

## మన భారతదేశ జాతీయ పక్షిగా అందాల హరివిల్లు లాంటి మయూరం ఎంపిక చేసి నేటికి 62 ఏళ్లు

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

నెమలి చాలా అందమైన పక్షి, నెమలికి చాలా పొడవైన అతి అందమైన రంగురంగుల తోక ఉంటుంది. తన తోకను పూర్తిగా విసనకర్ర మాదిరిగా తెరిచి, నాట్యం చేస్తుంటే నెమలి ఎంతో రాజసంగా కనిపిస్తుంది. జాతీయ పక్షి హోదాకు తగినట్లుగానే కనిపిస్తుంది. 4 అడుగుల పొడవు ఉండే ఈ తోకలో ఆకుపచ్చని ఈకలు వాటి మధ్యలో నీలపు రంగు కళ్ళు, కళ్ళ చుట్టు రాగి మరియు గోధుమ రంగు మిశ్రపు అంచులు ఉంటాయి. నెమలి శరీరం ఆకుపచ్చ, నీలం రంగుల మిశ్రమంలో ఉంటుంది. దీని తల మీద కిరీటం లాంటి పించం (కుచ్చు) ఉంటుంది. పొడవాటి తోక మాత్రం మగపక్షికీ ఉండడం మరో విశేషం. ఆడ నెమలి గోధుమ రంగులో ఉండి నీలం, ఆకుపచ్చ మచ్చలు హృదయ భాగంలో కలిగి ఉంటుంది. విశ్వంలోని



అందాన్నంతా తనలో దాచుకున్న నెమలిని భారతప్రభుత్వం జాతీయ పక్షిగా ప్రకటించింది. 1963లో జనవరి 31న ఈ ప్రకటన జరిగింది. అంటే నేటికి సరిగ్గా 62ఏళ్లు పూర్తౌందన్న మాట.. ఈ సందర్భంగా ఆ మయూరం గురించి కొన్ని విషయాలు తెలుసుకోండి.రానురాను తగ్గుతూ వస్తున్న నెమళ్ల సంఖ్య. 2011తో పోలిస్తే ప్రస్తుతం చాలా తక్కువ సంఖ్యలో జీవిస్తున్న నెమళ్లు. వేటగాళ్ల దెబ్బకు నెలకు దాదాపు 10 నుంచి 20 నెమళ్ల ప్రాణాలు విడుస్తున్నాయి.నెమళ్లు సాధారణంగా అటవీప్రాంతంలో 20సంవత్సరాలు బతుకుతాయి. వీటిన ప్రత్యేక శ్రద్ధతో పెంచితే.. 40 నుంచి 50 సంవత్సరాలు ఢోకా లేకుండా చక్కగా జీవనకాలాన్ని పెంచొచ్చు.కొన్ని నెమళ్లు తెలుపు రంగులోనూ ఉంటాయి. వీటినే శ్వేత మయూరాలంటారు.ఆహారంగా ధాన్యపు గింజలు, పండ్లు, క్రిమికీటకాలు, చిన్నపాములు, పురుగులను తీసుకునే నెమళు .ఆడ నెమళ్లు 96 సెంటీమీటర్ల దాకా పొడవు, 4 కిలోల బరువు ఉంటాయి.మగ నెమళ్లు 2. 12 మీటర్ల పొడవు, 5 కిలోలకు పైగా బరువుంటాయి.ఆడనెమళ్లు రెండేళ్ల నుంచి రోజుకొక గుడ్డు 10రోజుల పాటు పెడతాయి.గుడ్లని పొదగడానికి 30 రోజుల సమయం తీసుకుంటాయి.వేసవిలో మాత్రం నెమలికి ఈకలు రాలిపోవడమే కాకుండా గుడ్లను పొదిగే అవకాశం కూడా ఉండదు. :

## సత్యం, అహింస గాంధీ జీ ఆయుధాలు.... మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్

మహాత్మాగాంధీ 77 వ వర్ధంతి సందర్భంగా ఎంజీ రోడ్ లోని మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తలసాని మాట్లాడుతూ సత్యం, అహింస గాంధీ జీ ఆయుధాలు. జాతివివక్ష, అంటరానితనానికి పోరాడిన మహనీయుడు గాంధీ. మహాత్మాగాంధీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చి జాతిపిత గా నిలిచారని కొనియాడారు.

## జాతిపితకు నివాళులు

హైదరాబాద్జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా శాసనసభ ఆవరణలోని విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, , శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పూలమాలలు వేసి నివాళు లర్పించారు. డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, , శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అధికారులు పాల్గొన్నారు.

## విశాఖలో కేంద్ర మంత్రి కుమారస్వామి పర్యటన

విశాఖవిశాఖ ఎయిర్ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మరియు స్టీల్ మంత్రి కుమారస్వామి గురువారం చేరుకున్నారు.. విశాఖ ఎయిర్ పోర్ట్ నుండి స్టీల్ ప్లాంట్ కు బయలుదేరిన అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. మంత్రికి మంత్రికి ఎయికం పోర్టు లో పలువురు బిజెపి నేతలు ఘన స్వాగతం పలికారు.

## బోడుప్పల్ లో బీఆర్ఎస్ నిరసన

మేడ్చల్‌మేడ్చెల్ జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు 420 అబద్దాల కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన బి. ఆర్. ఎస్. నాయకులు. ఇచ్చిన హామీలు నెరవేర్చవరకు పోరాటం చేస్తామని హెచ్చరిక. ఇంటింటికి తిరుగుతూ రేవంత్ రెడ్డి మోసాలను ఎండగడుతామని మంద సంజీవరెడ్డి అన్నారు..

# ఎన్నికల ప్రవర్తనా నియామవళి పకడ్బందీగా నిర్వహించాలి: తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జనవరి 30:సూర్యాపేట జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా నిర్వహించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో ఉమ్మడి వరంగల్ -ఖమ్మం -నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పై అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వెబెక్స్ ద్వారా ఆర్డీఓ లతో, తహశీల్దార్ లతో, ఎంపిడిఓ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ -ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ని జనవరి 29 నాడు విడుదల చేయడంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని కలెక్టర్ తెలిపారు.ఫిబ్రవరి 3 నాడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని,ఫిబ్రవరి 10 నామినేషన్లు వేయుటకు చివరి రోజు , ఫిబ్రవరి 11 నాడు నామినేషన్లు స్క్రూటిని,నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 13 చివరి రోజు,ఫిబ్రవరి 27 నాడు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ,మార్చి 3 నాడు ఓట్ల లెక్కింపు జరుగుతుందని కలెక్టర్ అన్నారు.జిల్లాలో 2679 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని,జిల్లాలో మండలానికి ఒక్కటి చొప్పున 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందని కలెక్టర్



తెలిపారు.జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల ప్రవర్తన నియమావళి జాగ్రత్తగా అమలు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ ఈ సందర్బంగా సూచించారు. ఈ సమావేశం లో డి ఆర్ డి ఓ పి డి వివి అప్పారావు, డి పి ఓ నారాయణ రెడ్డి, ఎలక్షన్ సూపరిటీడెంట్ శ్రీనివాసరాజు, ఎలక్షన్ డిటి వేణు,ఆర్డీఓ లు, తహసీల్దార్ లు, ఎంపిడిఓ లు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించాలి

## విద్యార్థులను అవగాహన పార్కుకు తీసుకురావాలని ఆదేశం: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





కరీంనగర్, జనవరి 30(భారత శక్తి):పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా గురువారం తిమ్మాపూర్ లోని ఆర్టీఏ కార్యాలయం సందర్శించారు. ఈ సందర్భంగా చొక్కారావు పిల్లల ట్రాఫిక్ అవగాహన పార్కును పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు విద్యార్థులకు అనుభవ పూర్వక శిక్షణ ఇచ్చేందుకు ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్, ఫుట్ పాత్ లు, స్పీడ్ బ్రేకర్స్, నో ఎంట్రీ, వన్ వే నీ గురించి వివరించే చిత్రాలు ఏర్పాటు చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు.జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులను బ్యాచ్ ల వారీగా ఈ పార్కు కు తీసుకొచ్చి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల నుంచి నామమాత్రపు ఫీజు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఉచితంగా ఇక్కడకు తీసుకురావాలన్నారు.దీంతో రోడ్డుపై ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో విద్యార్థులకు తెలుస్తుందన్నారు. ఈ పార్కులో మరిన్ని సౌకర్యాలు కల్పించి అధునాతనంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అక్కడికి వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ట్రాఫిక్ అవగాహన పార్కులో తెలుసుకున్న విషయాలను ఆచరించాలన్నారు. హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాధాన్యతను ఇళ్లకు వెళ్లి తమ తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఫీల్డ్ ట్రిప్ లో భాగంగా మండలాల్లోని ప్రతి పాఠశాల విద్యార్థులను ఇక్కడకు తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని డీఈఓకు సూచించారు.అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ మాట్లాడుతూ.. ప్రణాళిక ప్రకారం అన్ని పాఠశాలల విద్యార్థులను ఇక్కడకు తీసుకొస్తే ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత విషయాలు తెలుస్తాయని పేర్కొన్నారు.పాఠశాల నుంచి బస్సులో తీసుకొచ్చి.. మళ్లీ బస్సులో నే వారి పాఠశాల వద్ద దించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ పురుషోత్తం, డీటీఓ చక్రవర్తి శ్రీకాంత్, డీఈఓ జనార్దన్ రావు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అశోక్, ఎంవీఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మరియు నిర్మల్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 30: నిర్మల్ జిల్లా బాసర ప్రసిద్ధ దేవాలయం బాసర సరస్వతి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఫిబ్రవరి 1 నుండి 3 వరకు జరిగే వసంత పంచమి ఉత్సాహలను ఘనంగా నిర్వహించాలని వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్ని ఏర్పాట్లు చేయాలనీ పంచాయతీ రాజ్ శాఖ ఆర్డబ్ల్యూఎస్. శాఖ, పోలీస్ డిపార్ట్మెంట్, రెవెన్యూ డిపార్ట్మెంట్ ఈ ఉత్సహలలో బాసర దేవాలయ సిబ్బంది అందరూ కలిసి జాగ్రత్తగ పని చేయాలనీ కోరారు.దర్శనం తరువాత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని రాబోవు స్థానిక సంస్థ ల ఎన్నికలలో ఐక్యము గా పనిచేసి అన్ని సీట్లు గెలిపించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వర్యులు వేణుగోపాలచారి, ఎమ్మెల్సీ దండే విఠల్ , టిపిసిసి జనరల్ సెక్రటరీ కరీంనగర్ జిల్లా గ్రంథాలయం చైర్మన్ సత్తు మల్లేష్, నిర్మల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజుమన్ అలీ, ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ ఇంచార్జి సుగుణక్క వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఆనంద్ రావు పాటిల్, పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్,మాజీ మండల అధ్యక్షులు బాపూరావు, మాజీ సర్పంచ లు సుధాకర్ రెడ్డి, లక్ష్మణ్ రావు,వైస్ చైర్మన్ మహమ్మద్ ఫరూక్ అహ్మద్ డీసీసీబీ డైరెక్టర్ లు వెంకటేష్, నారాయణ రావు పటిల్,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాజన్న,మల్కాన్న, మల్లన్న, మాజీ సర్పంచ్ రమేష్,మాజీ సర్పంచ్ లు మాజీ ఎంపీటీసీ లు మాజీ డైరెక్టర్ లు,తాలూకా కాంగ్రెస్ నాయకులు, బాసర మండల కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని మండలల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందరికీ అందుబాటులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు

## ఓర్వలేక బిఆర్ఎస్ పార్టివి చిల్లర రాజకీయాలు

## నగర కాంగ్రెస్ అధికార ప్రతినిధి బాలబద్రి



కరీంనగర్, జనవరి 30(భారత శక్తి):కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 17, 18, 19 డివిజన్ లకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గారెంటీలు అమలు చూసి ఓర్వలేక బి ఆర్ ఎస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తోందని నగర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, 18వ డివిజన్ ఇంచార్జి బాలబద్రి శంకర్ ఆరోపించారు. గురువారం ఒక పత్రికాప్రకటన లో రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు బడుగు బలహీనర్గాలకు అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. దీనికి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ప్రజలను అయోమయానికి గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వారు చేసే చిల్లర రాజకీయాలు ప్రజలు గమనించాలని, ప్రభుత్వం ప్రతి ఒక్క అర్హునికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అందే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్గ సభ్యులు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టారని చెప్పారు. 10 ఏండ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్ పార్టీ నాయకులు అవగాహన లేకుండా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను జీర్ణించుకోలేక ప్రజల్లో అపోహలు సృష్టించడం సిగ్గుచేటు అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని విశ్వాసంతో ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా మద్దతు ఇచ్చి ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నందుకు సంతోషధాయకమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటారని చెప్పారు. అర్హులందరూ ఎలాంటి అపోహలకు గురి కావద్దని రేకుర్తికి సంబంధించి ప్రతి అర్హునికి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర పథకాలన్నీ విడుతలవారిగా అందుతాయని తెలిపారు. మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ సహకారంతో అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# మధ్యాహ్న భోజనం వికటించి పలువురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురి

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జనవరి 30: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో బుదవారం నాడు మధ్యాహ్న భోజనం వికటించి పలువురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురి కాగా వెంటనే వారిని స్కూల్ సిబ్బంది హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స అనంతరం విద్యార్థులను బుదవారం రాత్రి ఇంటికి పంపించారు. మళ్లీ గురువారం ఉదయం పలువురు విద్యార్థులు మళ్లీ అస్వస్థతకు గురి కాగా వారి తల్లితండ్రులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యం చేయిస్తున్నారు, సమాచారం తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అదిమూలం సతీష్ కుమార్ ఆసుపత్రికి వెల్లి విద్యార్థుల ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు, అలాగే ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఆయనతోపాటు యువజన విభాగం నాయకుడు దయాకర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.



# గద్దర్ పై కేంద్ర హొం మంత్రి బండి సంజయ్ వాఖ్యలను బాధకరం: మాజీ మేయర్ సర్దార్

కోసమో, డబ్బు కోసమో, అవార్డుల కోసమో తన జీవితాన్ని ఫణంగా పెట్టి చేయలేదన్నారు.తెలంగాణ, తాడిత,పీడిత, పేద ప్రజల, అణగారిన వర్గాలు, మహిళల కోసం గద్దర్ పోరాడారని చెప్పారు. శరీరంలో బుల్లెట్లు ఉంచుకొని ప్రజల కోసం కొట్లాడిన వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. గద్దర్ పై విమర్శలు చేస్తే సూర్యుడి మీద ఉమ్మేయడం వంటిదని, గద్దర్ ఓ చారిత్రాత్మక వ్యక్తి..యుగ పురుషుడని కొనియాడారు. ప్రజల పాటగా చిరస్మరణీయుడని, స్థాయిని అవార్డులు నిర్ణయించలేవన్నారు. స్వయంగా ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని ఉద్దేశించి చాలా గొప్పగా వర్ణించి ఉత్తరాన్ని రాసిన సంగతి కేంద్ర హొం మంత్రి బండి సంజయ్ కి గుర్తు లేదాని ప్రశ్నించారు .కేవలం సంచలనాలను సృష్టించాలని ఉద్దేశంతో రాష్ట్ర సాధన కోసం గేయలతో తన ప్రాణాన్ని అర్పించిన యుద్ధ నౌక గద్దర్ పై ఆలోచించకుండా మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు .ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గొప్పగా చెబితే... కేంద్ర హొం మంత్రి బండి సంజయ్ విమర్శిస్తున్నారని .. నరేంద్ర మోడీ పై మీకు వ్యతిరేకత ఉందా ... లేక ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ రాసిన లేఖ ఫోర్జరీ అంటారా ... దీని పై వెంటనే కేంద్ర హొం మంత్రి బండి సంజయ్ స్పందించాలని అన్నారు.



# అహింస వాదంతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టిన నేత గాంధీ

## డిసిసి ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలు

కరీంనగర్, జనవరి 30(భారత్ శక్తి):జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముందుగా సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ పురుమళ్ళ శ్రీనివాస్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ హాజరై మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు.అనంతరం వారు మాట్లాడుతూ ఆనాడు ఉప్పు సత్యాగ్రహంతో అహింసా



మార్గంలో ఈ దేశ స్వాతంత్ర ఉద్యమానికి నాందిపలికిన మహా నాయకులు మహాత్మా గాంధీ అన్నారు. ఈ దేశాన్ని ఆక్రమించిన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టడానికి కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు ఏవో హ్యూమ్ తో కలిసి ఉద్యమాన్ని నడిపి ఈ దేశ ప్రజలకు స్వేచ్ఛ వాయువులను అందించిన మహాత్మా గాంధీ అని కొనియాడారు.

ఆ మహానేతను చంపిన గడ్సెను పూజిస్తూ నేడు ఈ దేశంలో కొంత మంది దుర్మార్గులు వారి భావజాలాన్ని దేశ ప్రజలపై చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వాదులంతా ఏకమై మహాత్మా గాంధీ చూపిన బాటలో నడవాలని వారి ఆశ సాధనకు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి నాయకులు ఎండీ తాజ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి , శ్రవణ్ నాయక్ , చర్ల పద్మ, అహ్మద్ అలీ, విక్టర్ ,వెన్న రాజ మల్లయ్య, కల్వల రామచందర్, నిహాల్ ,వంగల విద్యాసాగర్ ,నాగుల సతీష్, పడిసెట్టి భూమయ్య, సలీముద్దీన్ ,సిరికొండ శివప్రసాద్, కుంభాల రాజ్ కుమార్, మంద మహేష్ ,పర్వత మల్లేశం, చాంద్, ఇమ్రాన్, జీడి రమేష్, స్వప్న శ్రీ ,వాసిం, హసీనా, ముల్కల కవితయోన, హస్తపురం తిరుమల, ఇన్నారెడ్డి ,సిరిపురం నాగప్రసాద్ లావణ్య, సుంకరి గణపతి ,దిండిగాల మధు, చింతల కిషన్ ,మూల జయపాల్ , ముక్క భాస్కర్, జొన్నల రమేష్, బాశెట్టి కిషన్, బండి శరణ్య ,మాలోతు మహాలక్ష్మి, భాకరపు శివయ్య, పాష, శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు అత్యధిక ప్రాధాన్యత: జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి


### సింహాద్రిపురం జిల్లా పరిషత్ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి





వైయస్సార్ జిల్లా,జనవరి 30(భారత శక్తి ): రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అన్నారు. సింహాద్రిపురం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరయ్యి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి,జిల్లా టిడిపి అధ్యక్షులు,పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసుల రెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, ఇతర టిడిపి నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు %ూ%4 మోడల్ (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టిసిపేషన్) కు ప్రతిరూపంగా సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిలిచిందన్నారు. ప్రభుత్వం, ప్రవేటు, దాతలు, గ్రామ పెద్దలు అందరి సహకారంతో అద్భుతమైన స్కూలును నిర్మించారన్నారు. అలాగే రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకుని వచ్చి ప్రక్షాళన చేస్తూ ప్రపంచంలోనే అన్ని రంగాల్లో పోటీపడే విధంగా విద్యను అందించాలనే ఉద్దేశంతో ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక నిధులు కేటాయిస్తోందని తెలిపారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాలు ఉపయోగం లోకి తీసుకొచ్చిన దాతలు, గ్రామస్తులకు,నేతలకు హృదయ పూర్వక కృత్ఞతలు తెలిపారు.నేను కూడా జిల్లా పరిషత్ స్కూల్ లోనే చదివానని ఈ స్కూల్ చూడగానే మా గుర్తుకు వచ్చిందన్నారు. కార్పొరేట్ స్థాయి స్కూల్లకు ఏమాత్రం తీసుకోకుండా ప్రభుత్వ పాఠశాలను నిర్మచడం గొప్ప అంశమన్నారు. విద్యకు ప్రభుత్వ ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా వుందన్నారు. ఒక మంచి ఆలోచనతో ఏమైనా సాధించవచ్చు అని దానికి నిదర్శనంగా ఈ స్కూలు నిలిచిందన్నారు. ప్రైవేటు స్కూల్లో చదివే విద్యార్థి సంవత్సరానికి 35వేలు ఫీజు కడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థి పై సంవత్సరానికి దాదాపు 76వేలు రెట్టింపు ఖర్చు పెడుతోందని తెలిపారు. విద్యార్థులకు కావలసిన అన్ని వసతులు కల్పిస్తోందని అన్నారు.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పిల్లలకు, మంచి విద్యతోపాటు ఆరోగ్యాన్ని అందించడానికి మధ్యాహ్న భోజన పథకం ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి అర్హత గల టీచర్లు ఉన్నారని పిల్లలకు విద్య తో పాటు ఆటలు, టెక్నాలజీ,అంశాలను కూడా నేర్పించాలని కోరారు. నాకు చదువు నేర్పించి రామానుజాచార్యులు టీచర్ వల్లనే నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానన్నారు. విద్యార్థులకు మంచి నడవడిక క్రమశిక్షణ కళలు వంటి నైపుణ్యాలను నేర్పించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ గ్రామం నుంచి ఉన్నత స్థానాలు అలంకరించిన వారు కొంత సమయాన్ని కేటాయించి గ్రామ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు.పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి మాట్లాడుతూ వేసవి కాలంలోపే సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మార్చాలని కోరిన వెంటనే జిల్లా కలెక్టర్ వచ్చిన నందుకు కృతజ్ఞాలు తెలిపారు.మా నాన్నగారు బంధువులు ఇక్కడే చదివారన్నారు. ఈ పాఠశాలతో మా కుటుంబానికి ఎంతో ఆప్యాయతలు ముడిపడి ఉన్నాయని అన్నారు. పాఠశాల ముందు లారీలు కూడా రాలేని రోడ్లు వుంటే వాటిని ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద పూర్తి చేయడం జరిగిందన్నారు. విద్యార్థులందరూ బాగా చదువుకొని మంచి పేరు తీసుకురావాలని కోరారు. స్కూలుకు కావలసిన ఫర్నిచర్ అడిగిన వెంటనే జిల్లా కలెక్టర్ కల్పించారన్నారు. చదువులతో పాటు విద్యార్థులు ఆటలు మీద దృష్టి కేటాయించాలన్నారు.చిన్న దేశాలు ఒలంపిక్ పథకాలు గెలుస్తున్నాయని వాటికి దీటుగా మనం కూడా పథకాలు సాధించాలన్నారు. మండలంలో చీని పంటలకు వ్యాధులు సోకి రైతులు నష్టపోతున్నారని శాస్త్రజ్ఞుల బృందంతో పరిశోధన చేయించాలని కోరారు. అలాగే శనగ రైతులు పంటలు నష్టపోయారని క్రాప్ ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ను కోరారు.గత ప్రభుత్వంలో అసంపూర్తి గా మిగిలిన పనులను పూర్తి చేస్తున్నామన్నారు.జిల్లా టిడిపి అధ్యక్షులు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ అత్యద్భుతంగా సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నిర్మించారన్నారు. ఓ వైపు సరస్వతి దేవి,మరోవైపు వివేకానంద స్వామి విగ్రహాలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో చదువుకోవాలనే స్ఫూర్తిని నింపుతున్నాయన్నారు. గతంలో ఆగిపోయిన పాఠశాలను జిల్లా కలెక్టర్ కు విన్నవించి పూర్తిచేసిన నాయకులకు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. 93 సం క్రితం ఏర్పాటైన పాఠశాలకు చాల చరిత్ర వుందని అన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.అంతకు ముందు సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవం లో భాగంగా పాఠశాల మీటింగ్ హాలు, ఆఫీస్ రూము, అత్యాధునిక వసతులతో కలిగిన లాంగ్వేజ్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ ,కిచెన్ గదులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జోగి రెడ్డి, రఘునాథరెడ్డి, పులివెందుల ఆర్డిఓ చెన్నయ్య,డీఈవో శంషుద్దీన్,డిప్యూటీ డిఈవో మీనాక్షి,సమగ్ర శిక్ష అధికారి అధికారి నిత్యానంద రెడ్డి,సింహాద్రిపురం జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కే ఉమామహేశ్వరి , పూర్వ విద్యార్థులు, స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేట పట్టణ అభివృద్ధికి 4కోట్ల 40 లక్షలు:ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30 :అధికారం ఉన్న లేకున్నా సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు.సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ సదాశివపేట పట్టణంలో టియుఎఫ్ఐడిసి పథకం ద్వారా మంజురైనా సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ లకు సంబంధించిన 14 పనులకు గాను రూ. 4 కోట్ల 40 లక్షలకు టెండర్ ప్రక్రియ మొదలైంది అన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే సదాశివపేట పట్టణ అభివృద్ధికి పనులు ప్రారంభం అవుతాయాని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సదాశివ పేట్ పట్టణ ప్రజలు చింతా ప్రభాకర్ కు ధన్యవాదాలు తెలిపి అర్థం వ్యక్తం చేశారు.

# 420 హామీలు వెంటనే అమలుపర్చలని గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ శ్రేణులు

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జనవరి 30: బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు కామారెడ్డి మాజీ శాసనసభ్యులు గంప గోవర్ధన్, బిఆర్ఎస్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు యంకె ముజీబోద్దీన్ ఆదేశానుసారం కామారెడ్డి పట్టణంలోని గాంధీ గంజ్ ఆవరణలో గల గాంధీజీ వర్ధంతి సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చి, ఇచ్చిన హామీలను అమలుపర్చక ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వనికి నిరసనగా బిఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జూకంటి ప్రభాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కుంబాల రవి యాదవ్, మాజీ కౌన్సిలర్లు గెరిగంటి లక్ష్మీనారాయణ, పోలీస్ కృష్ణాజీరావ్, రైతు బంధు కమిటీ మండల అధ్యక్ష్యులు నిట్టు లింగా రావు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గాంధీ గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, జనవరి 30: మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా ఖమ్మం ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వాసవి క్లబ్ రోటరీ నగర్ ఖమ్మం అధ్యక్షులు పాలువాయి వెంకటేశ్వరరావు గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పాల్వాయి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గాంధీ మహాత్ముడి జీవితం మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం. సత్యం, అహింస, శాంతి వంటి వాటి గురించి బాపూజీ చెప్పడమే కాదు ముందుగా తనే ఆచరించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. బాపూజీ తన జీవితంతో పాటు మన జీవితానికి సంబంధించి కొన్ని మంచి విషయాలతో పాటు సేవాగుణాన్ని అలవరచుకుని సత్యమార్గం దిశగా పయనించేందుకు దిశా నిర్దేశం చేస్తూ ఎన్నో సూక్తులు సందేశాలను చెప్పారు. కేవలం బోధనలతోనే కాకుండా ఉప్పు సత్యాగ్రహం, దండి మార్చ్, విదేశీ వస్తువుల బహిష్కరణ, సహాయ నిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఇలా మన దేశానికి స్వాతంత్ర్యం రావడానికి కేవలం శాంతియుతంగా పోరాడారు. తనతో పాటు ఇతర నాయకులను కలుపుకుని అందరి సహాయంతో తెల్లదొరలను వారి దేశాలకు తరమి కొట్టడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన శాంతియుత, ప్రేరణాత్మకమై, స్ఫూర్తినిచ్చే సందేశాలను, సూక్తులను ఓసారి అందరం స్మరించుకోవలసిన అవసరం ఉన్నది అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ రోటరీ నగర్ ప్రధాన కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, కోశాధికారి తల్లాడ వినోద్ కుమార్ , జోన్ చైర్ పర్సన్ కొదుమూరి జగన్నాథం, యమసాని శ్రీనివాసరావు, కొదుమూరు శ్రీనివాసరావు, అందవరపు మల్లేష్, కాబినెట్ వైస్ గవర్నర్ మాశెట్టి వరప్రసాద్, రంగా పురుషోత్తం, నిత్య గోమాత సేవకులు సీనియర్ జర్నలిస్ట్ రాయల బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తాం

## మతోన్మాద బిజెపిని నిలువరిస్తాం కేంద్ర మంత్రి బండిపై మండిపడ్డ సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి




కరీంనగర్, జనవరి 30(భారత శక్తి):సీపీఎం రాష్ట్ర మహాసభల్లో 49తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయని, ఆ దిశలోనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలను ఉధృతం చేస్తామని, గ్రామ గ్రామాన సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేస్తామని జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి స్పష్టం చేశారు. గురువారం నగరంలోగల ముకుందలాల్ మిశ్రా భవన్ లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం జరిగిందని, రాష్ట్ర కార్యదర్శిగా కామ్రేడ్ జాన్ వెస్లీనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. నూతన ఉత్తేజం, ఉత్సాహంతో ప్రజా సమస్యల పరిష్కారం దిశగా వామపక్ష ఐక్యతతో పోరాటాలను ఉధృతం చేస్తామని చెప్పారు.కరీంనగర్ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర మహాసభల్లో చర్చించామని ప్రధానంగా కరీంనగర్లోని డంపింగ్ యార్డ్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్, త్రిబుల్ ఐటీ, ఈఎన్ఐ ఆసుపత్రి, కల్పించాలని కరీంనగర్ జిల్లాలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు సాగుభూములు కేటాయిం చే వరకు పోరాడుతామని హెచ్చరించారు. అలాగే మాజీ మంత్రి గంగుల, మాజీ మేయర్ సునీల్ రావులు అవినీతి అనకొండలే అన్నారు.కరీంనగర్ నియోజకవర్గంలో మాజీ నగర మేయర్ వై.సునీల్ రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకుంటు ప్రజా సమస్యలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.వారుచేస్తున్న ఆరోపణలు ఇరువురు సాక్షాలతో బయట పెట్టాలని, దుర్వినియోగం అయినా ప్రజాధనాన్ని రికవరీ చేసే విధంగా దర్యాప్తు సంస్థలు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.కరీంనగర్ లోని పార్కులు, చెరువులు, శిఖం భూములు, కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను, రెవిన్యూ అధికార యంత్రాంగం విచారణ జరిపించి రికవరీ చేసుకుని అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మతోన్మాదం పెచ్చుమీరిపోతుందని, ఈ మహాసభల్లో ప్రధానంగా మతోన్మాద బిజెపిని నిలువరించి, వామపక్ష ఐక్యతతో సామాజిక ఉద్యమాలను బలోపేతం చేస్తామని అన్నారు. కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ అవగాహన లేకుండా గద్దర్ పై అనుచిత వాక్యాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, బిజెపి కార్యకర్తలను తయారుచేసి, మతోన్మాద భావజాలం ఉన్న వారికే పద్మశ్రీ అవార్డులు ఇస్తామనడం విడ్డూరంగా ఉందని అన్నారు. సామాజిక ఉద్యమాల కోసం, బడుగు బలహీన వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయులు ప్రజా గాయకుడు గద్దరని ఆయనకే పద్మశ్రీ ఇవ్వడం కూడా తక్కువేనని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు,మహిళలకు 2500 రూపాయల పెన్షన్, వికలాంగ , వృద్ధుల పెన్షన్లను పెంచుతామని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో వామపక్ష ప్రజాతంత్ర వాదులను కలుపుకొని ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుడికందుల సత్యం, జిల్లాకమిటీ సభ్యులు ఉప్పునూటి శ్రీనివాస్, ఇ.రమేష్, కోనేటి నాగమణి, డి. నరేష్ పటేల్, నాయకులు రాయికంటీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎమ్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళిలి



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జనవరి 30: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు .ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ, స్వతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ చేసిన పోరాటం మరువలేనిదని శాంతియుతంగా ఉద్యమాలు కొనసాగించి ప్రజలను ఐక్యం చేయడంలో గాంధీజీ ఎంతో కృషి చేశారని అన్నారు. కానీ నేటి బిజెపి పార్టీ అనుబంధ సంఘాలు ఆర్ ఎస్ ఎస్ గాంధీని చంపిన గాడ్సేను దేవుడిల చిత్రీకరించాలని చూస్తున్నారని అది సిగ్గుమాలిన చర్య అని గాంధీజీని చంపిన గాడ్సేను సమర్ధించడం అంటే భారతదేశ స్వతంత్ర పోరాటాన్ని, దేశ ప్రజలను అవమానించినట్టేనని అన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ ,సుభాష్ చంద్రబోస్ లాంటి ఎందరో వీరులు ప్రాణ త్యాగం చేస్తే ఆర్ఎస్ఎస్ చీఫ్ సావర్కర్ బ్రిటిష్ వాళ్లకు క్షమాభిక్ష అర్జీ పెట్టుకొని బ్రిటిష్ వారికి అనుకూలంగా మారడని అన్నారు. గాంధీజీ పై బిజెపి ఆర్ఎస్ఎస్ చేస్తున్న విష ప్రచారాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్ గౌడ్, కొత్త నరసింహులు , మోతీరాం నాయక్ జిల్లా కమిటీ సభ్యులు ముదాం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఘన నివాళులర్పించిన జిల్లా యంత్రాంగం

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జనవరి 30: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తులను స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం ఘన నివాళులర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సారథ్యంలో సంస్మరణ దినోత్సవం నిర్వహించారు.

వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





# అట్టహాసంగా మానేర్ ఖేల్ కుద్ 2025 క్రీడా పోటీలు ప్రారంబం

## క్రీడా జ్యోతి వెలిగించిన మానేరు అధినేత అనంతరెడ్డి





కరీంనగర్, జనవరి 30(భారత శక్తి):ప్రస్తుత కాలంలో విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అన్నారు. పద్మనగర్ లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో ఆయన మానేర్ ఖేల్ కుద్ 2025 పేరిట నిర్వహించిన 39వ వార్షిక క్రీడా పోటీలను ఆయన గురువారం లాంచనంగా ప్రారంబించారు. ముందుగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డితో కలిసి మానేర్ క్రీడా పతాకాన్ని, ఒలంపిక్ క్రీడా పతాకాన్ని ఆవిస్కరించారు. పాఠశాలలోని వివిధ గ్రూప్‌ల విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ చేయగా ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన క్రీడా జ్యోతిని వెలిగించి వార్షిక క్రీడా పోటీలను ప్రారంబిస్తున్నట్లు ప్రకటించారు. పాఠశాల స్పోర్ట్స్ కెప్టెన్ విద్యార్థులచే ప్రతిజ చేయించారు. ఈ సందర్బంగా మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు క్రీడల్లో రాణించినట్లే విద్యలోనూ రాణించాలన్నారు. క్రీడా దిగ్గజాలను సూర్తిగా తీసుకొని క్రీడల్లో ఎదుగాలన్నారు. క్రీడల్లో సాధించిన సర్టిఫికేట్‌లతో ఉద్యోగ అవకాశాల్లో 2 శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. మానేరులో జూడో అకాడమీ ఉందని ప్రతి సంవత్సరం జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి పోటిల్లో చాలా మంది విద్యార్థులు పాల్గొని పతకాలు సాధిస్తున్నారని తెలిపారు. అదే విధంగా ఈ సంవత్సరం జరిగిన సీఎం కప్ 2024 లో పాఠశాల నుంచి 38 మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్టస్థాయి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. పాఠశాల నుంచి జూడో, కరాటే, వుషు, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్, చెస్, రెజ్లింగ్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీ%వీ%డల్లో పలువురు విద్యార్థులు రాణించినట్లు తెలిపారు. క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం వాలీబాల్ సర్వీస్ చేసి పోటీలను ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌లు రాజు చాకో, సరితా రెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, తిరుపతి, జహేద, స్వామి, శిరీషలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంది అసమర్ధ, దద్దమ్మ పాలన

## మోసపూరితంగా అధికారం చేపట్టి 420రోజులు

## చేతగాని ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని

## గాంధీకి బిఆర్ఎస్ వినతిపత్రం



కరీంనగర్, జనవరి 30(భారత శక్తి):ఓ జాతిపిత మహాత్మా....మీకు కోటి పాదాభివందనాలు తెలియజేస్తూ...అసమర్ధ కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి బుద్ధీ ప్రసాదించాలని కోరుతూ బి ఆర్ ఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు, మాజీ సుడా ఛైర్మన్ జి.వి. రామకృష్ణారావు ఆధ్వర్యంలో జిల్లా నాయకులతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. గురువారం నగరంలోని పెద్దపెల్లి రోడ్ లోగల జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వద్ద గాంధీ వర్ధంతి పురస్కరించుకొని బి ఆర్ ఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు ఘనంగా వేడుకలు నిర్వహించారు...ముందుగా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి కేటీఆర్ పిలుపుతో తెలంగాణ లో చేతగాని, దద్దమ్మ పరిపాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి బుద్ధీ ప్రసాదించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా జిల్లా అధ్యక్షులు రామకృష్ణారావు మీడియాతో మాట్లాడుతు మోసపూరితమైన వాగ్దానాలతో అమలు కాని పథకాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి నేటికి 420 రోజులు అవుతుందని గుర్తుచేశారు...కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ బిత్తిరి పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను నిత్యం మోసం చేస్తున్నారని, రైతుకు పెట్టుబడి సహాయంగా ఎన్నికల ముందు 15వేల రూపాయలు ఇస్తామని చెప్పి, తీరా అధికారం చేపట్టక భరోసా కింద 12వేల రూపాయలు ఇస్తామండం సిగ్గుచేటన్నారు. రాష్టంలో అన్ని రంగాలకు తీవ్ర అన్యాయం జరిగిందనీ, దీనికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్ రావు, పార్టీ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, మండల పార్టీ అధ్యక్షుడు, కరీంనగర్ సొసైటి ఛైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి. మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# కేరళ రాష్ట్రంలో జయప్రదంగా ముగిసిన ఎం సిపిఐ యూ జాతీయ కమిటీ సమావేశాలు.

## కేంద్ర కమిటీ సభ్యులు వరికుప్పల వెంకన్న.

సూర్యాపేట జిల్లా బ్యూరో(భారతశక్తి) జనవరి 30:కేరళ రాష్ట్రంలోని అలువ పట్టణంలో ఈనెల 26 నుండి 29 వరకు నాలుగు రోజులపాటు ఎం సి పి ఐ యు,ఆర్ ఎం పి ఐ కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ, సిసిసి జాయింట్ కేంద్ర కమిటీ సమావేశాలు కామ్రేడ్ శ్రీ కుమార్ ఎం సిపిఐ యూ కేరళ రాష్ట్ర కార్యదర్శి, కామ్రేడ్ గంగాధరన్ ఆర్ఎంపిఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి అధ్యక్షతన వై ఎం సి ఏ హాల్లో ఉత్సాహపూరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసాయని. ఎం సి పి ఐ యు కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న తెలిపారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటే వామపక్ష కమ్యూనిస్టు పార్టీలు ఐక్యం కావలసిన అవసరముందని సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని కమ్యూనిస్టులు ఐక్యం కాకపోవటం వల్ల మితవాద శక్తులు మితిమీరిపోయి మతోన్మాద శక్తులు బలపడుతున్నాయని అన్నారు. సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని దేశంలో మహిళలపై అత్యాచారాలు రోజురోజుకు తిరుగుతున్నాయని విద్యా, వైద్యం వ్యాపారంగా మారి నిరుద్యోగం పెరిగిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కమ్యూనిస్ట వామపక్ష పార్టీలు మాత్రమేనని అందుకోసం వామపక్ష పార్టీలు ఐక్యమైతే తప్ప ప్రజలకు పరిష్కార మార్గం లేదని తెలిపారు. ఎం సి పి ఐ ఆర్ ఎం పి ఐ ఐక్యమై రానున్న కాలంలో ఐక్య ఉద్యమాలు చేపడుతుందని సిపిఐ సిపిఎం పార్టీలతో పాటు మిగిలిన వామపక్ష కమ్యూనిస్టు పార్టీలు కలిసి దేశంలో వామపక్ష ఐక్య ఫ్రంట్ ఏర్పాటు చేయటానికి ఎం సిపిఐ యూ, ఆర్ యం పి ఐ కృషి చేస్తుందని వెంకన్న అన్నారు. ఈ సమావేశాలకు ఎం సిపిఐ యూ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయ అశోక్,



# లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలు





సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జనవరి 30:జాతీయ భద్రత మాసోత్సవాలలో భాగంగా హుజూర్ నగర్ పట్టణంలోని లారి ఓనర్స్ అసోసియేషన్ ప్రాంగణం నందు గురువారం అవగాహన సదస్సు నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోతి సంపత్ రెడ్డి వ్యవహరించగా ముఖ్య అతిథులుగా హుజూర్ నగర్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యము గ్రీన్ వుడ్ స్కూల్ కరస్పాండెంట్ తుమ్మ మర్రెడ్డి,కాకతీయ స్కూల్ కరస్పాండెంట్ కాకి శ్రీధర్ గౌడ్, శ్రీ చైతన్య స్కూల్ తరఫున ఢీన్ ప్రేమ్ సాగర్ , ఎం డి ఆర్ స్కూల్ ప్రిన్సిపల్ భూపాల్ రెడ్డి , లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు దొంతి రెడ్డి సంజీవరెడ్డి ,ప్రధాన కార్యదర్శి ఇంద్రారెడ్డి , కోశాధికారి శ్రీనివాస రాజు , ఉపాధ్యక్షులు రామిశెట్టి శ్రీనివాస్ , సత్యనారాయణ , ఓపెన్ ఐస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సులువ చంద్రశేఖర్, కోశాధికారి కోడిమల లక్ష్మణ్, జన చైతన్య ట్రస్ట్ అధ్యక్షులు పారాసాయి నాయుడు, ప్రధాన కార్యదర్శి పిల్లి శివశంకర్ డిఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ దగ్గుపాటి బాబురావు పాల్గొన్నారు కార్యక్రమానికి స్వచ్ఛందంగా విచ్చేసి సుమారు 30 మందికి హెల్మెట్లు మాజీ 9వ వార్డు కౌన్సిలర్ బొల్లెద్దు జైలు దనమ్మ కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ భద్రతా చిన్నపాటి చిట్కాలను అనుసరించడం , ఆవాటిని అమలు చేయడం వలన మన రహదారులను సురక్షితంగా ప్రయాణం చేయడంలో సహాయపడుతుందని,ఎల్లప్పుడూ సురక్షితమైన వేగంతో డ్రైవ్ చేయడం శ్రేయస్కరం అని,నగటు వేగంలో ప్రతి 1 శాతంపెరుగుదలకు, ప్రాణాంతకమైన క్రాష్ ప్రమాదంలో 4 శాతంపెరుగుదల ఉందని గణాంకాలు సూచిస్తున్నయని,వాహనం నడుపుతున్నప్పుడు పట్టీ ఉన్న హెల్మెట్ (ఐ ఎస్ ఐ ప్రమాణం) ధరించడం వలన మంచి నాణ్యమైన హెల్మెట్ ధరించడం వల్ల మరణ ప్రమాదాన్ని 42 శాతంమరియు తీవ్రమైన గాయల నుండి సుమారు 70 శాతం తగ్గించవచ్చునని ప్రమాదాలను నివారించడానికి సీటు బెల్ట్ (డ్రైవర్ మరియు ప్రయాణీకుడు ఇద్దరూ) ధరించాలి అని, సీటు బెల్ట్ ధరించడం వల్ల ఫ్రంట్ సీటులో ఉన్నవారిలో గాయాలు మరియు మరణాల ప్రమాదాన్ని 45-50 శాతం మరియు వెనుక సీటులో ఉన్నవారు 25-75 శాతం వరకు తగ్గిస్తుందని,పిల్లలను ముందు సీట్లలో కూర్చోబెట్టకూడదని, నిర్బంధంలో పిల్లలను ఉంచడం వలన కనీసం 60 శాతం మరణ ప్రమాదాన్ని తగ్గిస్తుంది, ముఖ్యంగా 4 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను ముందు సీట్లో కూర్చోబెట్టరాదని,డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఏకాగ్రతకు భంగం కలిగించే మొబైల్ ఫోన్‌లు లేదా ఇతర గాడ్జెట్‌లను ఉపయోగించవద్దు అన్నారు సంగీత సిస్టమ్‌ల వాయిస్ స్థాయి సురక్షితమైన వినగల పరిమితుల్లో వుండాలని, వాహనాలు నడిపేటప్పుడు ఇయర్ ఫోన్స్ పెట్టరాదని,ఇతర వాహన డ్రైవర్లు లేదా పాదచారుల దృష్టిని మరల్చే రహదారిపై అవాంఛిత హారన్‌లను మ్రోగించరాదని,వాహన నిర్వహణ ఫ్రీక్వెన్సీ ప్రకారం మీ వాహనం సరిగ్గా సర్వీస్ చేయబడిందని నిర్ధారించుకున్న తరవాత వాహనలను నడపాలని,మద్యం సేవించి వాహనాలు నడపకూడదు అని, డ్రింక్ మరియు డ్రైవింగ్ 0.05 జి/డీ యల్ కంటే ఎక్కువ రక్త-ఆల్కహాల్ గాఢత (బిఎసి) కలిగి ఉన్నప్పుడు ప్రమాదాల ప్రమాదాన్ని పెంచుతుందని, సురక్షితంగా ఉండటానికి ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన ముఖ్యమైన భద్రతా చర్యలు తీసుకోవాలి అని అలాగే, మైనర్ లకు వాహనాలు నడపడానికి ఇవ్వకూడదని, పిల్లలకు చిన్నవయస్సులోనే ఈ భద్రతా చర్యలను నేర్పించడం చాలా ముఖ్యం అని,తద్వారా వారు భవిష్యత్తులో దురదృష్టకర సంఘటనలను నివారించవచ్చునని అన్నారు. అనంతరం 30 మంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను బహుకరించడం జరిగిందిఇట్టి కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులు,భారీ వాహనదారుల యజమానులు,డ్రైవర్లు, ద్విచక్ర షో రూం వారు, యాజమాన్యులు,ప్రైవేట్ ట్రావెల్స్ వారి తో పాటు పట్టణ ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సంఘ కమిటీ సభ్యులు ఈశ్వర చారి, గడ్డం రాజు, అచ్చయ్య, సంఘ సభ్యులు,డీసీఎం అసోసియేషన్, ఆటో యూనియన్, వివిధ ట్రాన్స్పోర్ట్ యజమానులు, ఉద్యోగులు, షో రూమ్ యజమానులుప్రజలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇటుక బట్టీలో కాలిపోతున్న బాల్యం...!

(ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా )నిర్మల్ జిల్లా ముధోల్ మండలం, తదితర గ్రామాలలో రోజు రోజుకు ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నిబంధనల ప్రకారం పలు శాఖల నుండి తీసుకున్న అనుమతుల మేరకు కాకుండా ఇష్టానుసారంగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేసి లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా అటు వైపు కన్నెత్తి చూసే అధికారులు లేకపోవడం గమనార్హం. వ్యవసాయ భూముల్లో పరిశ్రమలు నిర్వహించడానికి ఎలాంటి అనుమతులు ఉండవు. కానీ,ఇటుక బట్టీల వ్యాపారులు మాత్రం చెరువుల ప్రాంతాలలో ఉన్న రైతుల దగ్గర భూములు లీజుకు తీసుకొని యధేచ్చగా వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇటుక బట్టీలు నిర్వహించాలంటే ముందుగా గ్రామ పంచాయితీ అనుమతితో పాటు,భూగర్భ గనుల శాఖ,కాలుష్యం నియంత్రణ మండలి అనుమతులు తీసుకోవాలి. అలాగే ప్రజల నివాస ప్రాంతానికి కనీసం 5 కి.మీ.దూరంలో,పంట పొలాలకు కనీసం 500 మీటర్ల దూరంలో, ప్రధాన రహదారికి 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలి. కానీ,ఇక్కడ ఆ నిబంధనలు మచ్చుకు కూడా ఉండవు. ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వలస కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయిస్తూ శ్రమ దోపిడికి పాల్పడినా,చిన్నపిల్లల చేత పని చేయిస్తూ బాల కార్మిక చట్టాలను తుంగలో తొక్కినా ఎవరూ పట్టించుకోరు. ఇక్కడ పనిచేసే కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి. కానీ,అవి భూతద్దం వేసి వెతికినా కనిపించవు. వలస కార్మికులతో పని చేయించుకుంటూ వారికి కావాల్సిన వసతులను ఏర్పాటు చేయకపోవడం వల్ల దుర్భర జీవితాలు గడుపుతున్నారు. పని చేసిన కడుపునిండా తిండి లేక కడుపున పుట్టిన పిల్లల్ని బాల కార్మికులుగా మారుస్తున్నారు. వారి బాల్యాన్ని ఇటుక బట్టీల్లో బందీ చేస్తూ చిన్నారుల జీవితాలను చిదిమేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ ఇటుక బట్టీల వ్యాపారులకు అండదండగా అంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే రహదారి పక్కనే ఇటుక బట్టీలు ఉండడంతో వాటికి వినియోగించే బూడిద,బొగ్గు,ఊక పదార్థాలను వినియోగించడంతో పూర్తిగా వాతావరణ కాలుష్యం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఇటుక బట్టీల కాల్చడం కోసం కలప అక్రమ రవాణా యథేచ్చగా కొనసాగుతుంది. టన్నుల కొద్దీ కలవను ఇటుక బట్టీలకు తరలుతోంది. యాజమాన్యం దురుసు ప్రవర్తన అక్రమార్కులు వాల్టా చట్టానికి తూట్లు పొడిచి అక్రమ వ్యాపారం చేస్తున్నారని తెలిసి మీడియా ప్రతినిధి అక్కడికి వెళ్లి సమస్యలను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుండగా ఇటుక బట్టీల యజమాన్యం దురుసుగా ప్రవర్తిస్తూ. మాకు అన్ని అనుమతులు ఉన్నాయి. మీరేంది అడిగేదని,మీలాంటి వాళ్లు చాలామంది వచ్చి పోయింద్రు,చాలామందిని చూసినం,వాళ్లజీవితాలను మీరేమన్నా మారుస్తారా?వాళ్లని మీ ఇంటికి తీసుకెళ్లి రోజూ భోజనం పెట్టు అని హేళన చేస్తూ ఏం చేసుకుంటావో చేసుకోపో అంటూ బెదిరింపులకు పాల్పడం కొసమెరుపు. ఇటుక బట్టీల యాజమాన్యం ఇంతలా బరితెంగించడం వెనుక అధికారుల హస్తం ఉందని భావించాల్సి వస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా వలస కార్మికుల కష్టాన్ని కొల్లగొట్టి,బాలలతో వెట్టి చాకిరీ చేయిస్తున్నా ప్రభుత్వ అధికార యంత్రాంగం మాత్రం వీటిపై దృష్టి సారించని దాఖలాలు లేకపోవడం దానికి బలం చేకూరుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటుక బట్టీల్లో తనిఖీలు నిర్వహించి,బందీ అయిన బాలకార్మికులకు విముక్తి కల్పించి,శ్రమ దోపిడికి గురవుతున్న వలస కార్మికులకు పని గంటలు తగ్గించి,కనీసం వేతనం అమలయ్యేలా,వారికి కనీస వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.



# ప్లే స్టోర్‌లోనూ డీప్‌సీక్ దూకుడు.. ఆ ప్రశ్నలకు సమాధానాలు దాటవేత




చైనాకు చెందిన ఏఐ స్టార్టప్ డీప్‌సీక్ దూకుడు కొనసాగుతోంది. ఆర్1 మోడల్ విడుదలతో మొత్తం ఇండస్ట్రీనే షేక్ చేసిన ఈ స్టార్టప్ సంస్థ.. అటు డౌన్‌లోడ్స్‌లోనూ దూసుకెళుతోంది. యాపిల్ యాప్ స్టోర్‌లో ఇప్పటికే అగ్రస్థానంలోకి చేరిన డీప్‌సీక్ యాప్.. గూగుల్ ప్లేస్టోర్‌లోనూ నంబర్.1 స్థానంలో నిలిచింది. అమెరికాలోని యాపిల్ యాప్ స్టోర్‌లో ప్రస్తుతం ఫ్రీ యాప్స్ జాబితాలో తొలిస్థానంలో ఉండగా.. ఓపెన్‌ఏఐ రూపొందించిన చాట్‌జీపీటీ రెండో స్థానంలో ఉంది.ఒక్క అమెరికాలోనే కాదు దాదాపు 51 దేశాల్లో డీప్‌సీక్ ప్లే స్టోర్‌లో అగ్రస్థానంలో ఉందని యాప్‌ఫిగర్స్ సంస్థ చెబుతోంది. 111 దేశాల్లో యాపిల్ యాప్‌స్టోర్‌లో, 18 దేశాల్లో గూగుల్ ప్లే స్టోర్‌లో టాప్–10 జాబితాలో కొనసాగుతోందని పేర్కొంది. డీప్‌సీక్ మొత్తం డౌన్‌లోడ్లలో 80 శాతం గడిచిన వారంలోనే రావడం గమనార్హం. భారత్‌లోనూ కోటికి పైగా డౌన్‌లోడ్లు ఉన్నాయి. మొత్తం డౌన్‌లోడ్లలో చైనా వాటానే దాదాపు 23 శాతంగా ఉంటుందని యాప్ డౌన్‌లోడ్లను విశ్లేషించే సంస్థలు చెబుతున్నాయి.ఆ ప్రశ్నలపై మౌనంఅతి తక్కువ ఖర్చుతో రూపొందిన డీప్‌సీక్ ఆర్1 మోడల్.. ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీతో సమానంగా ఫలితాలు ఇస్తుండడంతో ప్రపంచ వ్యాప్త దృష్టిని ఆకర్షించింది. దీని మూలాలు చైనాలో ఉండడమే అనేక సందేహాలు లేవనెత్తుతోంది. పైథాగరస్ సిద్ధాంతాన్ని కేవలం 30 నిమిషాల్లోనే వివరించిన ఈ ఏఐ మోడల్.. చైనాకు సంబంధించిన అంశాల విషయంలో దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోలు ఇప్పటికే చక్కర్లు కొడుతున్నాయి. 1989లో తియానన్మెన్ స్క్వేర్ ఘటన గురించి ఓ నెటిజన్ అడిగినప్పుడు 'ప్రస్తుతానికి ఇది నా పరిధిలోని లేని అంశం. వేరే ఏవైనా ప్రశ్నలు అడగండి' అని దాటవేత ధోరణిని ప్రదర్శిస్తోంది. 1989లో జూన్ 3 అర్ధరాత్రి, జూన్ 4 ఉదయం బీజింగ్‌లోని తియానన్మెన్ స్క్వేర్ వద్ద జరిగిన భారీ ప్రదర్శనపై సైన్యం ట్యాంకులతో విరుచుకుపడటంతో వేలమంది మరణించారు. ఈ ఘటనలో ఎంతమంది మరణించారో ఇప్పటికీ తెలియదు. ఇదొక్కటే కాదు.. అరుణాచల్ ప్రదేశ్, బీజింగ్, తైవాన్‌కు సంబంధించిన అంశాలపై ప్రశ్నలకు తన పరిధిలో లేని అంశమని పేర్కొంటోంది. ఆఖరికి భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల పేర్లు అడిగినా వేరే ప్రశ్న అడగాలంటూ సమాధానం ఇస్తోంది.డీప్‌సీక్‌పై మరిన్ని కథనాలుఏఐలో కొత్త సంచలనం.. అమెరికా కంపెనీలకు డీప్‌సీక్ స'వాల్'!డీప్‌సీక్ మాత్రమే కాదు.. ఇతర చైనీస్ ఏఐ మోడళ్లూ రె'ఢీ'!డీప్‌సీక్ విజయం వెనక 'జీనియస్' లేడీ!

# మరింత ఆకర్షణీయంగా కొత్త ఆదాయపు పన్ను విధానం..




మోదీ 3.0 సర్కారు తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌ను మరికొన్ని రోజుల్లో పార్లమెంట్ ముందుకు తీసుకురానుంది. దీనిలో ఏదోరకంగా ఊరట లభిస్తుందని వేతనజీవి ఆశగా ఎదురు చూస్తున్నాడు. సంకీర్ణ ప్రభుత్వం కావడం.. కీలక భాగస్వామి జేడీయూ పాలించే బిహార్‌లో ఎన్నికలు ఈ ఏడాదే ఉండటంతో కచ్చితంగా ప్రజాకర్షక నిర్ణయాలు ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కొత్త ఆదాయపు పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది ప్రజలను దీని వైపు మళ్లించే యత్నం జరగొచ్చన్న అంచనాలున్నాయి. ఈ క్రమంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను పెంచే అవకాశాలున్నాయి. కొత్త ఆదాయపు పన్ను విధానాన్ని 2020–21లో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత దీనిలో చాలా మార్పులు చేర్పులు చేసి పన్ను చెల్లింపుదారులను ఆకర్షించేలా చేశారు. 2024 బడ్జెట్‌లో స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50 వేల నుంచి రూ. 75 వేలకు పెంచారు. జాతీయ పింఛన్ స్కీమ్ లబ్ధిలను కూడా కల్పించారు. పాత పన్ను విధానంలో మాత్రం ఇది రూ.50వేలుగానే ఉంది.వేతన ఆదాయంపై పన్ను విధించడానికి ముందు స్టాండర్డ్ డిడక్షన్ మొత్తాన్ని తీసేస్తారు. దీంతో పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం తగ్గుతుంది. స్వల్ప మొత్తంతో అధిక ట్యాక్స్ స్లాబ్‌లో చేరేవారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. కొత్త ఆదాయ పన్ను విధానం సిస్టమ్‌లో అందరికీ డీఫాల్ట్‌గా వస్తుంది. అవసరమైతే పాత దానిలోకి మారవచ్చు.

పెంపు ఎందుకు..?కొత్త విధానంలో పెద్దగా మినహాయింపులు, తగ్గింపులు లేకపోవడంతో.. పన్ను నిపుణులు అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో దీనివైపు పన్నుదారులను మళ్లించేందుకు స్టాండర్డ్ డిడక్షన్ పెంపు ఒక్కటే బలమైన మార్గంగా ఉంది. పన్ను వ్యవస్థను సరళంగా ఉంచుతూ.. అన్ని వర్గాలకు రాయితీలను అందించేలా ఇది ఉపయోగపడుతుంది. దీనిని ఈ సారి రూ.75 వేల నుంచి రూ.లక్షకు మార్చాలనే డిమాండ్లు ఉన్నాయి. దీనికి తోడు పన్ను ఆదాయంపై కొంత శాతం మేరకు తగ్గింపు ఇవ్వాలన్న ప్రతిపాదనలూ వస్తున్నాయి. ఇప్పటికే వ్యాపారులు, వృత్తి నిపుణులు పన్ను చెల్లించే వేళ తమ ఖర్చులను క్లెయిమ్ చేసుకొంటారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్ రూపంలో పెరుగుతున్న వ్యయాలను తీసుకొనే చేయడం న్యాయమైన డిమాండే అని నిపుణులు చెబుతున్నారు. ఇది చిరు, మధ్యతరగతి వేతనజీవులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ విధానం ఎప్పుడు మొదలైంది..1974లో తొలిసారి ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 16 కింద దీనిని తొలిసారి పరిచయం చేశారు. పన్ను సంక్లిష్టతలను తగ్గించి సరళ తరం చేయడం దీని ఉద్దేశం. ఉద్యోగి ఆఫీసుకు వెళ్లి వచ్చేందుకు అయ్యే రవాణా ఖర్చులు, ఆరోగ్య వైద్య ఖర్చులను వారికి తిరిగి ఇవ్వడం కూడా దీనిలో మరో కోణం. కానీ, 2005లో దీనిని పూర్తిగా తొలగించారు. దాదాపు దశబ్దానికి పైగా ఎటువంటి పన్ను లబ్ధి ఇవ్వలేదు. తిరిగి 2018లో రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్‌తో దీనిని ప్రవేశపెట్టారు. ప్రయాణ ఖర్చులు కింద రూ.19,200, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ రూ.15వేల నుంచి తొలగించారు. ఇక 2019లో తాత్కాలిక బడ్జెట్‌లో రూ.50 వేలకు పెంచారు. 2023లో దీనికి కొత్త పన్ను విధానంలోకి కూడా తీసుకొచ్చారు. ఆ తర్వాత ఏడాదే దానిలో రూ.75 వేలకు పెంచారు. పాత విధానంలో మారలేదు.

# మన బడ్జెట్ వెనుక వీరు..

సార్వత్రిక ఎన్నికల తర్వాత వస్తున్న పూర్తి స్థాయి బడ్జెట్ ఇది. దీంతో ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ నిర్ణయాలపై ఆసక్తి నెలకొంది. కొత్తపాత వారితో కూడిన ఆమె బడ్జెట్ బృందం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఆమె బృందంలోని కీలక వ్యక్తులు వీరు.. తుహిన్ కాంత పాండే..తుహిన్ ప్రస్తుతం దేశ ఫైనాన్స్ అండ్ రెవెన్యూ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఆయన 1987 ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారి ఆయన. పన్ను రాయితీలను బ్యాలెన్స్ చేస్తూ ఆదాయాలు తగ్గకుండా చూసుకోవడమే ఆయన ప్రధాన విధి. కాకపోతే ఆయన బడ్జెట్‌కు కొన్ని నెలల ముందే ఈ బాధ్యత స్వీకరించారు. ఆదాయపు పన్ను చట్టాల పునర్ వ్యవస్థీకరణను ఈ సారి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. అజేయ్ సేథ్..

ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి అజేయ్ సేథ్ ఈ సారి బడ్జెట్‌కు తుదిరూపు ఇవ్వనున్నారు. 1987 కర్ణాటక బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఆయన. ప్రతిపాదనల తుది కాపీని ఫైనల్ చేసేది ఇక్కడే. వృద్ధిని, ఆర్థిక వనరులను జాగ్రత్తగా నిర్వహించడం, వ్యయాల నియంత్రణ వంటి అత్యంత జాగ్రత్తగా చేయాల్సి ఉంటుంది. అనంత్ నాగేశ్వరన్.. ప్రస్తుతం చీఫ్ ఎకానమిస్ట్‌గా పనిచేస్తున్న వి. అనంత నాగేశ్వరన్ బృందమే ఆర్థిక సర్వేను తయారు చేస్తుంది. ఆయన గతంలో ప్రధాని ఆర్థిక సలహా మండలిలో తాత్కాలిక సభ్యుడిగా పనిచేశారు. వృద్ధిని ప్రోత్సహించడం, సంస్కరణల ఫలితాలను అంచనావేయడం, తిరోగమనంలో ఉన్న గ్లోబలైజేషన్‌ను ఎదుర్కొవడానికి సిద్ధపడే మార్గాలను ఆయన బృందం సిద్ధం చేయనుంది. మనోజ్ గోవిల్..

ఆయన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయన గతంలో కార్పొరేట్ వ్యవహారాలశాఖలో పనిచేశారు. ప్రస్తుతం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సబ్సిడీలు, కేంద్ర ప్రభుత్వ పథకాల నిర్వహణ వంటివి చూస్తారు. ప్రభుత్వ వ్యయాలు సద్వినియోగం అయ్యే చూడటం మనోజ్ బృందం



విధి. ఎం నాగరాజుప్రస్తుతం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగానికి ఎం నాగరాజు కార్యదర్శి. ఈ శాఖే రుణాల జారీ, డిపాజిట్ల మొబలైజేషన్, ఫిన్‌టెక్‌లను నియంత్రించడం, బీమా కవరేజీలను పెంచడం, డిజిటల్ ఇన్ఫ్రామెరుగు పర్చడం వంటివి ఉన్నాయి. నాగరాజు 1993 త్రిపుర కేడర్ ఐఏఎస్ అధికారి. అరుణిష్ చావ్లాఆర్థిక మంత్రి బృందంలో సరికొత్త సభ్యుడు. ఆయన 1992 బ్యాచ్ బిహార్ కేడర్ ఐఏఎస్ అధికారి. గతంలో ఫార్మాస్యూటికల్స్ విభాగంలో పనిచేశారు. ప్రస్తుతం ఉన్న ఆస్తుల నిర్వహణ, డిజ్‌ఇన్వెస్ట్‌మెంట్ వంటి అంశాలను ఆయన పర్యవేక్షించనున్నారు. ఐడీబీఐ బ్యాంక్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల వద్ద పడిఉన్న ఆస్తుల నుంచి నిధుల సమీకరణకు ప్రణాళికలు తయారు చేయనున్నారు.

## త్రివేణి టర్బైన్‌కు రూ.290 కోట్ల ఆర్డర్

రూ.290 కోట్ల విలువైన ఆర్డర్‌ను పొందినట్లు 'త్రివేణి టర్బైన్' ఈ రోజు తెలిపింది. కర్ణాటకలోని ఎన్‌టీపీసీ 'కుడ్గీ' (సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్)లో 160 సామర్థ్యం గల 2–ఆధారిత స్టాండలోన్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం( ను ఇన్‌స్టాల్ చేసేందుకు ఆర్డర్ పొందినట్లు 'త్రివేణి టర్బైన్' తన ఎక్స్చేంజ్ ఫైలింగ్‌లో తెలిపింది.

# అప్పుల ఊబిలో చిక్కుకోవద్దు



'పెరుగుతున్న వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల వినియోగం ఆందోళనకరంగా ఉంది. రాబోయే రోజుల్లో ఇది కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులకు దారితీయొచ్చు' జెరోదా సహ వ్యవస్థాపకుడు నితిన్ కామత్ హెచ్చరిక ఇది. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ తమ అప్పుల గురించి ఆలోచించాల్సిన అవసరాన్ని ఈ మాటలు నొక్కిచెబుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్పుల ఊబిలో చిక్కుకోకుండా మనం ఏం చేయాలి అనేది తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అవసరానికి రుణం తీసుకోవడం.. ఇస్తున్నారు కదా అని అప్పు చేయడం..ఈ రెండింటికీ ఎంతో తేడా ఉంది. మహమ్మారి తర్వాత చాలామంది భరించలేని స్థాయిలో అప్పులు తీసుకున్నారని నితిన్ కామత్ విశ్లేషించారు. దీనికి ప్రధాన కారణం ముందస్తు ఆమోదంతో రుణం ఇస్తున్నామని చెప్పే ఫిన్‌టెక్ యాప్‌లే. రూ.10వేల లోపు తక్షణమే అప్పు ఇస్తామంటూ.. పదే పదే వచ్చే సందేశాలు ఎంతోమందిని ఆకర్షిస్తున్నాయి. దీంతో వీటిని తీసుకున్న వారి సంఖ్య పెరిగింది. కానీ.. గత రెండు త్రైమాసికాల నుంచి బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల నివేదికలను పరిశీలిస్తే... రాబోయే రెండు, మూడు త్రైమాసికాల్లో ఇబ్బందికరమైన పరిస్థితులు కనిపించే అవకాశం ఉంది. అధిక వడ్డీని వదిలించుకోండి..

'అప్పులు ఉన్నప్పుడు మానసికంగా ఎంతో ఒత్తిడి ఉంటుంది. వ్యక్తిగత జీవితం, కుటుంబం, ఉద్యోగం.. ఇలా ప్రతి చోటా అది మీపై ప్రభావం చూపిస్తుంది' అని నితిన్ పేర్కొన్నారు. ముందుగా అధిక వడ్డీ వసూలు చేసే రుణాలను వదిలించుకునే ప్రయత్నం చేయండి. ఆ తర్వాతే మీ మిగులు మొత్తం నుంచి పెట్టుబడులు పెట్టండి అని సూచించారు. ఈ నేపథ్యంలో మనమూ ఒకసారి మన ఖర్చుల తీరు, రుణాల నిర్వహణ గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. మీ అప్పుల్లో అధిక వడ్డీ వసూలు చేస్తున్న వాటి జాబితాను సిద్ధం చేసుకోండి. వాటిని సాధ్యమైనంత త్వరగా తీర్చేసేందుకు ప్రయత్నించండి.

క్రెడిట్ కార్డులతో.. క్రెడిట్ కార్డును తీసుకునే ముందే మీ ఆదాయం, ఖర్చులకు సంబంధించిన బడ్జెట్‌ను కలిగి ఉండటం చాలా అవసరం. బడ్జెట్‌ను సిద్ధం చేసుకుంటేనే క్రెడిట్ కార్డు బాకీని ఎప్పటికప్పుడు చెల్లించే వెసులుబాటు ఉంటుంది.మీ ఖర్చు అలవాట్లకు సరిపోయే కార్డును ఎంచుకోండి. రాయితీలు అధికంగా ఇచ్చేదీ, వడ్డీ రేట్లు తక్కువగా, వార్షిక రుసుములు లేకుండా ఉన్న కార్డును తీసుకోవాలి.చెల్లింపు తేదీలు, ఆలస్య రుసుము, మీ క్రెడిట్ పరిమితిని మించినప్పుడు విధించే జరిమానాలు తదితర నిబంధనలను తనిఖీ చేయాలి. మీ క్రెడిట్ కార్డును సమర్థంగా నిర్వహించడంలో ఇది సాయం చేస్తుంది.బిల్లును మొత్తం చెల్లించాల్సిన అవసరం లేకుండా.. కనీస మొత్తం చెల్లించడం చాలామందికి సౌలభ్యంగా ఉంటుంది. కానీ, ఇలా చేయడం వల్ల మిగిలిన బాకీపై అధిక వడ్డీకి కారణం అవుతుంది. ఇది మీ అప్పును పెంచుతూ వెళ్తుంది. కాబట్టి, పూర్తి బిల్లును సకాలంలో చెల్లించడమే ఎప్పుడూ ఉత్తమం.వ్యక్తిగత రుణాల విషయంలో..వ్యక్తిగత రుణాలు తీసుకునే ముందు మీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడం చాలా అవసరం. మీ ఆదాయం, ఖర్చులు, ఇప్పటికే ఉన్న రుణాలను తీర్చే సామర్థ్యం పరిగణనలోకి తీసుకోండి.ఎక్కువ రుణాలు తీసుకోవద్దు. మీ అవసరాలకు సరిపోయే రుణ మొత్తం ఒకే చోట తీసుకోవడం మేలు.వ్యక్తిగత రుణాల పరిశీలనా రుసుము, వడ్డీ, ముందస్తు చెల్లింపు ఖర్చులవంటివి చూసుకోండి. రుణం కోసం దరఖాస్తు చేసేముందు మీ రుణ దరఖాస్తు తిరస్కరించకుండా ఉండాలంటే మంచి క్రెడిట్ స్కోరు ముఖ్యం.తీసుకున్న రుణాన్ని ఎలా చెల్లిస్తారు.. దీనికి సరైన ప్రణాళిక ఉండాలి.

# బ్యాంకు రుణం కాకుండా విదేశీ విద్యకు ప్రత్యామ్నాయాలున్నాయా..



విదేశాల్లో విద్య అంటే ఎక్కువ ఖర్చవుతుందని అందరికి తెలిసిందే. అయితే..యూకే, యూఎస్ వంటి దేశాలతో పోలిస్తే స్పెయిన్, జర్మనీ మొదలైన దేశాల విశ్వవిద్యాలయాల్లో తక్కువ ట్యూషన్ ఫీజులతో విదేశీ విద్యను పూర్తి చేయోచ్చు.

గతంతో పోలిస్తే, విదేశాల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య ఇప్పుడు బాగా పెరిగింది. విదేశీ విద్య అనేది అనేకమంది విద్యార్థులకు ప్రతిష్టాత్మకమైన ఆకాంక్ష. అయితే, విదేశీ విద్యకు ఖర్చు కూడా ఎక్కువే అవుతుంది. విదేశాలల్లో..విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు, వసతి, జీవన వ్యయాలు లాంటి వాటికి అధికంగానే ఖర్చువుతుంది. కాబట్టి, విద్యార్థులకు..వివిధ వనరుల నుంచి నిధులు, తగిన ప్రణాళిక ఉంటేనే విదేశాల్లో చదువుకోవాలనే కల నేరవేరుతుంది. చాలా మంది బ్యాంకు రుణాలు తీసుకుని విదేశీ విద్యను పూర్తి చేస్తుంటారు. అయితే, చాలా మందికి రుణాలు లభించకపోవచ్చు లేదా పొందిన రుణం సరిపోకపోవచ్చు. అందుచేత, విదేశీ విద్యకు నిధులు సమకూర్చుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాల గురించి తెలుసుకోవడం చాలా అవసరం. అవేంటో ఇక్కడ చూద్దాం.స్కాలర్‌షిప్‌లు, గ్రాంట్లువిదేశీ విద్యకు నిధులు సమకూర్చుకోవడానికి ఉత్తమ మార్గం స్కాలర్‌షిప్‌లతో విదేశాల్లో చదువుకోవడం. ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు వివిధ ప్రమాణాల ఆధారంగా విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయి. దాదాపు చాలా విదేశీ విశ్వవిద్యాలయాలు అవసరమైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, గ్రాంట్లు అందించడానికి మొగ్గు చూపుతున్నాయి. ఉదాహరణకు అర్హత కలిగిన మాస్టర్ డిగ్రీ విద్యార్థులకు 'చెవెనింగ్' స్కాలర్‌షిప్ ప్రోగ్రాంతో యూకేలోని ఏదైనా విశ్వవిద్యాలయంలో చదువుకోవడానికి పూర్తిగా ఆర్థిక సహాయం అందుతుంది.యూఎస్‌లోని మాస్టర్స్ డిగ్రీని అభ్యసించాలనే లక్ష్యంతో ఉన్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, గ్రాంట్లు అందుతుంటాయి. ఇవి మెరిట్, అకడమిక్ ఎక్సలన్స్, టాలెంట్ లేదా స్పాన్సర్ చేసే సంస్థ నిర్దేశించిన నిర్దిష్ట ప్రమాణాల ఆధారంగా లభిస్తాయి. ఆర్థిక అవసరాన్ని కోరే విద్యార్థులకు..సంస్థలు, ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు గ్రాంట్లు అందిస్తాయి. ఈ నిధులు ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, జీవన వ్యయాలు, ఇతర విద్యా సంబంధిత రుసుములతో సహా అనేక రకాల విద్యా ఖర్చులను కవర్ చేస్తాయి. అయితే, స్కాలర్‌షిప్‌లు యూఎస్‌లోని అగ్రశ్రేణి సంస్థ నుంచి పొందాలంటే, ఒక విద్యార్థి వారి మునుపటి విద్యలో అసాధారణమైన విద్యా రికార్డును కలిగి ఉండాలి.పార్ట్–టైం జాబ్‌విదేశాల్లో చదువుతున్నప్పుడు పార్ట్‌టైంగా పనిచేసి డబ్బులను ఆర్జించడం ద్వారా బ్యాంకు రుణాలు అవసరం లేకుండా విద్యనభ్యసించవచ్చు. విద్యార్థులు విదేశాల్లో చదువుకునేటప్పుడు యూనివర్సిటీల్లో వివిధ వర్క్–స్టడీ ప్రోగ్రాంలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్స్ ద్వారా క్యాంపస్‌లోని క్వాలిఫై అయిన అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు పార్ట్ టైం ఆన్–క్యాంపస్ ఉపాధిని యూనివర్సిటీ అందిస్తుంది. వర్క్–స్టడీ ప్రోగ్రాంలపై ఆసక్తి ఉన్నవారు నమోదు చేసుకున్న అధ్యయన ప్రాంతానికి అనుగుణంగా ఇంటర్న్‌షిప్ లేదా ఆన్–క్యాంపస్ ఉద్యోగాన్ని కనుగొనడం మంచి మార్గం.యూఎస్‌లోని మాస్టర్స్ డిగ్రీలో చేరిన 1 వీసా ఉన్న విద్యార్థులు పార్ట్‌టైం ఉద్యోగాలను చేసుకోవచ్చు. ఇక్కడ వీసా నిబంధనల ప్రకారం అంతర్జాతీయ విద్యార్థులు క్యాంపస్ లోపల/వెలుపల పార్ట్‌టైం జాబ్ చేసుకోవచ్చు. చదువుకునేటప్పుడు వారానికి 20 పని గంటల వరకు, సెలవుల్లో అయితే పూర్తి సమయం పనిచేయడానికి అనుమతి ఉంటుంది. ఈ అవకాశాల ద్వారా విద్యార్థులు మంచి ఆదాయాన్ని పొందడమే కాకుండా, జీవిత నైపుణ్యాలతో పాటు పని అనుభవాన్ని పొందుతారు.తక్కువ ఫీజులు

విదేశాల్లో విద్య అంటే ఎక్కువ ఖర్చవుతుందని అందరికి తెలిసిందే. అయితే..యూకే, యూఎస్ వంటి దేశాలతో పోలిస్తే స్పెయిన్, జర్మనీ మొదలైన దేశాల విశ్వవిద్యాలయాల్లో తక్కువ ట్యూషన్ ఫీజులతో విదేశీ విద్యను పూర్తి చేయోచ్చు. కాబట్టి, ట్యూషన్ ఫీజులు, వసతి, జీవన వ్యయాలు తక్కువగా ఉండే దేశాలు/విశ్వవిద్యాలయాలను కనుగొనడం మేలు. అయితే, కొన్ని దేశాల్లో హౌసింగ్ ఎంపికలు, కెరీర్ అవకాశాలు విభిన్నంగా ఉంటాయి. ఇలాంటి వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. అందుచేత, విదేశీ విద్యనభ్యసించాలనుకునేవారు ఇప్పటికే విదేశాల్లో విద్యను పూర్తి చేసిన పూర్వ విద్యార్థులను లేదా అంతర్జాతీయ విద్యా సలహాదారులను సంప్రదించడం మంచిది. దీనివల్ల వివిధ దేశాలు, అధ్యయన కేంద్రాల్లో విద్యకయ్యే ఖర్చులను తెలుసుకోవచ్చు.పొదుపు, ఆస్తులువిదేశీ విద్యకు బ్యాంకు రుణాలపై ఎక్కువగా ఆధారపడకుండా నిధులు సమకూర్చుకునే ఉత్తమ మార్గాల్లో డబ్బును ముందుగానే పొదుపు చేయడం ఒకటి. విదేశీ విద్యకు ముందుగానే ప్లాన్ చేసే వారు బ్యాంకులో రికరింగ్ డిపాజిట్, ఎఫ్‌డీ/పీపీఎఫ్ వంటి వాటిలో పొదుపు చేయడం ద్వారా నిధిని సమకూర్చుకోవచ్చు. ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్న కుటుంబ సభ్యుల వద్ద ఆర్థిక సహాయం కూడా పొందొచ్చు. ఇంకా, నిరుపయోగంగా ఉన్న సొంత ఆస్తులను అమ్మి విదేశీ విద్యకు ఖర్చు పెట్టొచ్చు. ఇలా సొంతంగా నిధులు కలిగి ఉండడం వల్ల రుణాలను తిరిగి చెల్లించే వత్తిడి కూడా ఉండదు.ఆర్థిక సహాయంస్వదేశం నుంచి స్కాలర్‌షిప్‌లు/గ్రాంట్లు పొందే అవకాశం గురించి వాకబు చేయడం మంచిది. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలు అక్కడ ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుజేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలు స్వదేశీ విద్యకే కాకుండా విదేశీ విద్యకు కూడా నిధులు ఇస్తున్నాయి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఇలాంటి పథకాల గురించి విచారణ చేయడం మంచిది. ఇంకా, దేశంలో అనేక ప్రాంతాల్లో బలమైన ఆర్థిక వనరులు ఉన్న కమ్యూనిటీలు, వివిధ మతాలకు చెందిన ట్రస్ట్‌లు స్వదేశీ/విదేశీ విద్యనభ్యసించే విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తుంటాయి. ఇలాంటి వాటిని కూడా విద్యకై ఆర్థిక వనరుల కోసం ఉపయోగించుకోవచ్చు. విద్య కోసం తీసుకున్న ఇలాంటి సహాయాన్ని తిరిగి ఇవ్వనవసరం లేదు.

క్రౌడ్ ఫండింగ్‌మరోవైపు విద్యార్థులు విదేశాల్లో తమ చదువుల కోసం సోషల్ మీడియా ఛానళ్ల ద్వారా క్రౌడ్ ఫండింగ్‌ను సేకరించొచ్చు. సోషల్ మీడియా/ఆన్‌లైన్ నిధుల సేకరణ ప్లాట్‌ఫాంలను ఉపయోగించి క్రౌడ్ ఫండింగ్‌ను సేకరించడం లాంటివి ఈ మధ్యకాలంలో చాలా మంది చేస్తున్నారు. దీనికై విద్యార్థులు తమ ప్రేరణలు, లక్ష్యాలు, ఆర్థిక అవసరాలను ఎక్కువ మంది వ్యక్తులతో కమ్యూనికేట్ చేయడానికి ప్రత్యేకమైన నిధుల సేకరణ ప్రచారాన్ని రూపొందించవచ్చు. సోషల్ మీడియాను ఉపయోగించడం ద్వారా విద్యార్థులు..తమ స్నేహితులు, దూరంగా ఉన్న కుటుంబ సభ్యులు, పూర్వ సహచర విద్యార్థులు, ఇతర దాతల నుంచి వేగంగా విరాళాలు పొందొచ్చు.



# అప్పుడూ విరాట్‌కు అదే బలహీనత.. ఊహించని రీతిలో ఎదిగాడు: కైఫ్

: భారత స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ రంజీ మ్యాచ్ ఆడుతున్నాడు. రైల్వేస్‌తో జరుగుతోన్న పోరులో దిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. చివరిసారిగా 2012లో విరాట్ దేశవాళీ మ్యాచ్ ఆడిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఉత్తర్ ప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ గత మ్యాచ్‌ను గుర్తు చేసుకున్నాడు. అప్పుడు వీరేంద్ర సెహ్వాగ్, గౌతమ్ గంభీర్, ఇషాంత్ శర్మ, ప్రవీణ్ కుమార్, భువనేశ్వర్ వంటి సీనియర్లు ఆడినట్లు పేర్కొన్నాడు. అయితే, విరాట్ కోహ్లీకి అప్పుడూ ఆఫ్‌సైడ్ బంతులను వెంటాడి ఔటయ్యే బలహీనత ఉండేదని.. ఆ తర్వాత క్రికెట్ కెరీర్‌లో భారీగా పరుగులు చేసిన తీరు అద్భుతమని కైఫ్ కొనియాడాడు.

“2012లో దిల్లీతో మ్యాచ్‌లో మేం తలపడ్డాం. అంతర్జాతీయ క్రికెట్‌లో బిజీ కాకముందు విరాట్ కోహ్లీ చివరిగా ఆ మ్యాచ్ ఆడాడు. అప్పటికి అతడేమీ స్టార్ కాదు. అప్పుడు కూడా అతడికి ఆఫ్‌సైడ్ బంతి వీక్‌నెస్ ఉంది. ఇప్పుడూ ఇదే బలహీనతతో ఉండటం నమ్మశక్యం కావడం లేదు. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ (%దీశీతీ- నవతీ - +ుఱఖంఝితీ ఆతీశీజూష్ట్రం%)లో ఆసీస్ బౌలర్లు పక్కాగా ప్లాన్ చేసి కోహ్లీని ఔట్ చేశారు. మాతో రంజీ మ్యాచ్‌లో ఆడినప్పుడు కూడా ఇలానే పెవిలియన్‌కు చేరాడు. భువనేశ్వర్ బౌలింగ్‌లో వికెట్ ఇచ్చేసేవాడు. కానీ, అతడు తన వీక్‌నెస్‌ను జయించి అంతర్జాతీయ క్రికెట్‌లో భారీగా పరుగులు చేయడం అద్భుతమనే చెప్పాలి. వన్డేల్లో 50 శతకాలు చేశాడు. టెస్టుల్లో ఇటీవల మినహా.. అంతకుముందు టాప్ బ్యాటర్‌గా నిలిచాడు” అని కైఫ్ తెలిపాడు.

గత వన్డే ప్రపంచకప్‌లో మాదిరిగా..

“ఇప్పుడు విరాట్ కోహ్లీ రంజీ మ్యాచులో ఆడటం అతడికే కాకుండా.. జట్టుకూ మంచిది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఫామ్‌ను అందుకొంటే టీమ్‌ఇండియాకు తిరుగుండదు. గత వన్డే ప్రపంచకప్‌లో కోహ్లీ ఆటను మరిచిపోకూడదు. టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇప్పుడు రంజీల్లో కొంత ప్రాక్టీస్ చేసినట్లవుతుంది. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు కొన్ని పరుగులు చేస్తే ఆత్మవిశ్వాసం పెరగడం ఖాయం. అప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలో అతడి బ్యాట్ నుంచి మెరుగైన ప్రదర్శనను చూసే అవకాశం ఉంటుంది” అని మాజీ క్రికెటర్ వెల్లడించాడు.

# ధోనీ, విరాట్ అంటే గంభీర్‌కు ఇష్టం ఉండదా? చిన్ననాటి కోచ్ ఏమన్నాడంటే?



వారిద్దరూ దాదాపు ఒకే తరం క్రికెటర్లు. ఒకరేమో భారత జట్టుకు వన్డే, టీ20 ప్రపంచకప్‌లను అందించిన సారథి. మరొకరు ఆ జట్టులో కీలక పాత్ర పోషించిన స్టార్ బ్యాటర్. కానీ, వారి మధ్య సరైన సంబంధాలు లేవనేది క్రికెట్ వర్గాల్లో నడిచే చర్చ. ఇప్పటికే అర్థమై ఉంటుంది కదా.. వారిద్దరే ఎంఎస్ ధోనీ, గౌతమ్ గంభీర్. ధోనీ ఇంకా ఐపీఎల్‌లో కొనసాగుతూ ఉండగా.. గంభీర్ భారత జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్నాడు. ధోనీ అంటే గంభీర్( కు పడదనే వ్యాఖ్యలు సరైనవి కాదంటూ సంజయ్ భరద్వాజ్ స్పష్టం చేశారు. ఈయన గంభీర్‌కు చిన్ననాటి కోచ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. గంభీర్ తీరుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అందరూ అతడిని తలబిరుసు కలిగిన వ్యక్తిగా భావిస్తారని.. కానీ, దేశం కోసం ఆడేటప్పుడు నిబద్ధతతో ఉంటాడని భరద్వాజ్ వ్యాఖ్యానించాడు.

‘‘గంభీర్ ఎప్పుడూ ఎవరిపైనా అయిష్టత వ్యక్తం చేయడు. ఇదే నిజం. చాలా మంది బయట నుంచి ధోనీ అంటే గంభీర్‌కు ఇష్టం లేదనే వ్యాఖ్యలు చేస్తుంటారు. విరాట్ కోహ్లీ విషయంలోనూ అలాగే ఉంటాడని చెబుతుంటారు. కానీ, గంభీర్‌కు ఎవరిమీదా వ్యక్తిగత కోపం ఉండదు. అలాంటి వాటిని మనస్సులో కూడా పెట్టుకోడు. 2004లో ఇండియా %ూ%సిరీస్ సమయంలో ధోనీ - గంభీర్ మధ్య వివాదం రేగినట్లు చెబుతారు. కానీ, వారిద్దరూ అప్పుడు రూమ్మేట్లు. ఇక విరాట్ కోహ్లీ తో ఐపీఎల్ సమయంలో వాగ్వాదం జరిగింది. ఆ విషయం గురించి మేమిద్దరం మాట్లాడుకున్నాం. ‘అక్కడ కరెక్ట్ ఏంటో మీకు తెలుసు?’ అని గంభీర్ అన్నాడు.

తన జట్టు సభ్యుల కోసం గంభీర్ ఎంతవరకైనా వెళ్తాడు. కోహ్లీ కూడా టీమ్ కోసమే అలా వ్యవహరించాడు. నవీనుల్ హక్‌ను ఏదో అనడంతోనే గంభీర్ ముందుకు రావాల్సి వచ్చింది. అక్కడ కోహ్లీ లేదా ఇంకెవరైనా ఉన్నా సరే గంభీర్ ప్రవర్తన అలానే ఉంటుంది. తన జట్టు ప్లేయర్ కాబట్టే గంభీర్ ముందడుగు వేశాడు. జట్టునే తన కుటుంబంగా భావించే అద్భుతమైన వ్యక్తి గంభీర్. ఏది జరిగినా అది మైదానం వరకే పరిమితం చేస్తాడు’’ అని వెల్లడించాడు.



# సిరాజ్‌తో మహిరా శర్మ డేటింగ్ వార్తలు? స్పందించిన నటి తల్లి

భారత క్రికెటర్, హైదరాబాదీ ప్లేయర్ మహ్మద్ సిరాజ్ ప్రేమ వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఇంతకుముందు లెజెండరీ గాయని ఆశా భోస్లే మనవరాలు జనై భోస్లేతో ప్రేమలో ఉన్నాడని రూమర్లు వచ్చాయి. వాటిని సిరాజ్ ఖండించాడు. ఆమె తనకు సోదరిలాంటివారని స్పష్టం చేశాడు. ఇప్పుడు హిందీ బిగ్‌బాస్ ఫేమ్ మహిరా శర్మ తో సిరాజ్ డేటింగ్‌లో ఉన్నాడంటూ కథనాలు వస్తున్నాయి. చాలా దగ్గరి సన్నిహితులు ఈ విషయాన్ని వెల్లడించారని పలు ఆంగ్ల సైట్లలో వచ్చింది. దానికి కారణం.. మహిరా చేసిన పోస్టుకు ఇన్‌స్టాగ్రామ్‌లో సిరాజ్ లైక్ కొట్టడంతో పాటు ఫాలో కావడమేనని అందులో పేర్కొన్నాయి.

ఈ ఊహాగానాలపై తాజాగా మహిరా శర్మ తల్లి సానియా శర్మ స్పందించారు. వాటిని ఎవరూ నమ్మొద్దని కోరారు. ఓ ఇంటర్వ్యూ సందర్భంగా జర్నలిస్టులు ఆమె వద్ద ఈ ప్రశ్న అడగ్గా.. “అసలు మీరేం మాట్లాడుతున్నారు? బయట వాళ్లు ఎన్నో అంటుంటారు. ఇప్పుడు నా కుమార్తె ఒక సెలబ్రిటీ. దీంతో ఫ్యాన్స్ ఆమెకు ఎవరితోనైనా సంబంధాలు కలిపేస్తారు. వాటన్నింటినీ మనం విశ్వసించాలా? అసలు అలాంటి వార్తలన్నీ తప్పే” అని స్పష్టం చేశారు.

గతంలో పరాస్ ఛాబ్రాతో మహిరా డేటింగ్!

బిగ్‌బాస్ 13వ సీజన్ సమయంలో పరాస్ ఛాబ్రాతో మహిరా శర్మ ప్రేమలో పడింది. అయితే, ఇద్దరూ రెండేళ్ల కిందట విడిపోయారు. ఇదే విషయాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో పరాస్ మాట్లాడుతూ.. “మేమిద్దరం ఒకప్పుడు రిలేషన్‌షిప్‌లో ఉన్నాం. అప్పుడు అంతా బాగుంది. చాన్నాళ్లు కలిసి ఉన్నాం. అయితే, విధి మరోలా రాసిపెట్టి ఉంది. జీవితంలో మంచి చెడులు ఉంటాయి. వేం ఆ రెండింటిని అనుభవించాం. కొన్నాళ్లకు మేమిద్దరం భవిష్యత్తులో కలిసి ఉండలేమని అర్థమైంది. అందుకే, బ్రేకప్ చెప్పేసుకున్నాం” అని తెలిపాడు. హిందీ టీవీ సీరియల్స్‌తో బాలీవుడ్ ప్రేక్షకులకు తెలిసిన మహిరా శర్మ బిగ్‌బాన్ 13తో ఒక్కసారి ఫేమస్ అయిపోయింది. ఆ తర్వాత వెబ్‌సిరీసుల్లోనూ బిజీగా మారిపోయింది.




# ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభ వేడుకల షెడ్యూల్ ఇదే..

ఐసీసీ మెగా టోర్నీ ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. అయితే, స్టేడియాల ఆధునికీకరణ పనులు ఇంకా పూర్తి కాలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో ట్రోఫీ ప్రారంభ వేడుకలకు సంబంధించి షెడ్యూల్‌ను పీసీబీ అప్రూవ్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఫిబ్రవరి 16న లాహోర్ వేదికగా ప్రారంభ వేడుకలు జరగనున్నాయి. అంతర్జాతీయంగా ఉన్న క్రికెట్ బోర్డుల ప్రతినిధులు, సెలబ్రిటీలు, క్రికెట్ దిగ్గజాలు, ప్రభుత్వ అధికారులను ఆహ్వానించనుంది.

ప్రారంభ వేడుకల్లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ పాల్గొనడంపై ఇంకా క్లారిటీ రాలేదు. ఐసీసీ, పీసీబీ అధికారిక వర్గాలు కూడా ఇంకా ఏమీ ధ్రువీకరించలేదు. ఫిబ్రవరి 16న ఎనిమిది జట్ల కెప్టెన్ల ప్రెస్ కాన్ఫరెన్స్‌లు, ఫొటో షూట్‌లు ఉండనున్నాయి. తొలి మ్యాచ్ పాకిస్థాన్ - న్యూజిలాండ్ జట్ల మధ్య కరాచీ వేదికగా జరగనుంది. భారత్ మ్యాచులన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఒకవేళ టీమ్‌ఇండియా ఫైనల్‌కు అర్హత సాధిస్తే ఆ మ్యాచ్ కూడా దుబాయ్‌లోనే నిర్వహించేందుకు ఇప్పటికే ఐసీసీ నిర్ణయం తీసుకుంది. ఐసీసీ విధించిన డెడ్‌లైన్‌లోగా స్టేడియాల ఆధునికీకరణ పనులను పూర్తి చేసేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రయత్నిస్తోంది.


ఫిబ్రవరి 7న ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేతుల మీదుగా గడాఫీ మైదానం ప్రారంభం కానుంది.

ఫిబ్రవరి 11న కరాచీలోని నేషనల్ స్టేడియం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి హాజరుకానున్నారు.

ఇంకా స్క్వాడ్‌ను ప్రకటించని పాక్

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఎనిమిది జట్లు తలపడనున్నాయి. ఇప్పటికే ఏడు దేశాలు తమ స్క్వాడ్‌లను ప్రకటించాయి. ఆతిథ్య పాకిస్థాన్ మినహా.. భారత్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, అఫ్గానిస్థాన్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తమ జట్లను వెల్లడించాయి. ఐసీసీ ఇచ్చిన గడువు కూడా ఇప్పటికే దాటిపోయింది.

# ఏం సాధించినట్లు?




రంజీ ట్రోఫీ అంటే.. భారత దేశవాళీ క్రికెట్‌కు ఆయువుపట్టు. ఎంతోమంది దిగ్గజ టెస్టు ఆటగాళ్లు వెలుగులోకి వచ్చింది ఈ టోర్నీ ద్వారానే. అంతర్జాతీయ స్థాయికి ఎదిగాక కూడా ఒకప్పటి ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్‌కు సముచిత ప్రాధాన్యం ఇస్తూ వీలున్నపుడల్లా రంజీ ట్రోఫీలో పాల్గొనేవారు. కానీ రాను రాను పరిస్థితులు మారిపోయాయి. తీరిక లేని క్రికెట్ వల్లో.. రంజీల్లో ఆడడాన్ని తక్కువగా భావించో స్టార్ ఆటగాళ్లు ఈ టోర్నీలో బరిలోకి దిగడమే మానేశారు. కానీ టీమ్‌ఇండియా ఇటీవలి ఘోర వైఫల్యాల నేపథ్యంలో భారత ఆటగాళ్లు రంజీల్లో ఆడాలని బీసీసీఐ అల్టిమేటం విధించింది. కానీ స్టార్ ఆటగాళ్లు ఈ విషయాన్ని ఏమాత్రం సీరియస్‌గా తీసుకున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

భారత జట్టులో స్థానం సంపాదించి, కొంచెం స్టార్ హోదా సంపాదిస్తే చాలు.. ఇక రంజీ ట్రోఫీ వైపు చూడడమే మానేస్తున్నారు ఈ తరం క్రికెటర్లు. స్టార్ ఆటగాళ్లు రంజీ ట్రోఫీని పట్టించుకోకపోవడం రెండు మూడు దశాబ్దాల కిందట్నుంచే జరుగుతోంది. అయితే ఒకప్పటితో పోలిస్తే అంతర్జాతీయ మ్యాచ్‌ల సంఖ్య బాగా పెరిగిపోయిన మాట వాస్తవం. దీనికి తోడు ఐపీఎల్ రాకతో క్రికెటర్ల మీద ఒత్తిడి పెరిగిపోయి దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యం మరింత తగ్గించేశారు. అయితే స్టార్ ఆటగాళ్లు మంచి ఫామ్‌తో సాగుతుంటే, టీమ్‌ఇండియా విజయాలు సాధిస్తుంటే దీని గురించి చర్చే ఉండేది కాదు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి కొంత కాలంగా పేలవ ప్రదర్శన చేస్తున్నారు. భారత జట్టేమో సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాభవం చవిచూసింది. ఆపై ఆస్ట్రేలియా పర్యటనలోనూ ఓటమి తప్పలేదు. దీంతో స్టార్ ఆటగాళ్లు రంజీల్లో ఆడకపోవడం మీద దృష్టి పడింది. సునీల్ గావస్కర్ సహా మాజీలంతా టీమ్‌ఇండియా క్రికెటర్లు రంజీలు ఆడకపోవడాన్ని తప్పుబట్టారు.

# ఆగని జోరు.. 'సంక్రాంతికి వస్తున్నాం' అదిరే వసూళ్లు

'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ ఈ పెద్ద పండగకు ప్రేక్షకుల ముందుకు వచ్చారు వెంకటేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ నటించిన ఈ చిత్రం జనవరి 14న విడుదలై హిట్‌ను సొంతం చేసుకుంది. తాజాగా దీని వసూళ్లను చిత్రబృందం ప్రకటించింది. ఇప్పటి వరకు రూ.260 కోట్లు రాబట్టినట్లు తెలిపింది . త్వరలోనే రూ.300 కోట్లు వసూళ్లు చేసే అవకాశం ఉందని టీమ్ పేర్కొంది. విడుదలై రెండు వారాలు గడుస్తున్నా.. గత 24 గంటల్లో బుక్‌మైషోలో లక్షా 70వేల టికెట్స్ అమ్ముడైనట్లు మూవీ యూనిట్ తెలిపింది. విడుదలైన నాటి నుంచి థియేటర్‌లో హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిస్తోన్న ఈ సినిమా ఆంధ్ర, సీడెడ్, నైజాం ప్రాంతాల్లో ఐదో రోజు అత్యధిక కలెక్షన్లు రాబట్టిన తెలుగు సినిమాల జాబితాలో రెండో స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే.




తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ సంక్రాంతికి వస్తున్నాం విడుదలై విశేష స్పందన సొంతం చేసుకుంటోంది. అక్కడ ఈ సినిమా వెంకటేశ్ కెరీర్‌లోనే ఆల్‌టైమ్ వసూళ్లు సాధించింది. నార్త్ అమెరికాలో ఇప్పటి వరకు 2.6మిలియన్ డాలర్లను తన ఖాతాలో వేసుకుంది. త్వరలోనే అక్కడ మూడు మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉన్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఇప్పటి వరకు నమోదైన తెలుగు సినిమాల రికార్డులను ఈ చిత్రం బ్రేక్ చేయడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు

మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్ ఆకట్టుకోవడంలో సక్సెస్ అయింది. మరోవైపు సూపర్ హిట్‌ను సొంతం చేసుకున్న టీమ్ ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపింది. ప్రముఖ నగరాల్లో సక్సెస్ మీట్‌లను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో జనవరి 26న భీమవరంలో ఈ విజయోత్సవం జరగనున్నట్లు నిర్మాతలు తెలిపారు.

# సైఫ్‌పై దాడి.. కరీనాను తప్పుపడుతూ ప్రచారం.. నటుడి భార్య ఆగ్రహం

ఏదైనా విషయంలో పురుషుడు విఫలం అయితే అతడి భాగస్వామిని నిందించడాన్ని ఉద్దేశించి బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ సతీమణి, రచయిత ట్వింకిల్ ఖన్నా స్పందించారు. ఈ మేరకు ఆమె ఓ ఆంగ్ల పత్రికలో వ్యాసం రాశారు. విరాట్ కోహ్లీ – అనుష్క శర్మ, సైఫ్ అలీఖాన్ – కరీనా కపూర్ దంపతుల గురించి ఇందులో ఆమె ప్రస్తావించారు.



"సైఫ్ ఆస్పత్రిలో ఉన్నప్పుడు ఆయన సతీమణి గురించి ఎన్నో వదంతులు వ్యాప్తి చెందాయి. ఆయనపై దాడి జరిగినప్పుడు ఆమె ఇంట్లో లేదని కొందరు.. గాయాలతో ఇబ్బందిపడుతున్న ఆయనకు ఆమె ఏమాత్రం సాయం చేయలేదని మరికొందరు మాట్లాడుకున్నారు. దీనికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ ఈ వదంతులు మాత్రం ఆగలేదు. మహిళ అందులోనూ ఒక వ్యక్తి భార్యపై నిందలు రావడంతో ప్రతిఒక్కరూ ఎంజాయ్ చేశారు. అదే విధంగా విరాట్ కోహ్లీ సరిగ్గా ఆడనప్పుడల్లా కొంతమంది ఆయన సతీమణి అనుష్క శర్మను నిందిస్తుంటారు" అని ఆమె రాసుకొచ్చారు. సెలబ్రిటీల విషయంలోనే కాదు సామాన్యుల విషయంలోనూ ఇదే జరుగుతుందని ఆమె చెప్పారు.

జనవరి 16వ తేదీ తెల్లవారుజామున సైఫ్‌పై దాడి జరిగిన విషయం తెలిసిందే. షరీఫుల్ ఇస్లాం అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. దొంగతనం చేయాలనే ఉద్దేశంతో నిందితుడు సైఫ్ ఇంట్లోకి వెళ్లాడని పోలీసులు తెలిపారు. విచారణలో భాగంగా నటుడి ఇంటిని పరిశీలించిన క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ బృందం అక్కడ ఉన్న దాదాపు 19 వేలిముద్రలను సేకరించింది. వాటిల్లో ఏవీ నిందితుడి ఫింగర్ ప్రింట్స్‌తో మ్యాచ్ కావడం లేదని పోలీసులకు ఫోరెన్సిక్ బృందం వెల్లడించినట్లు తెలుస్తోంది. తదుపరి పరీక్షల కోసం మరోసారి ఘటనా స్థలం నుంచి మరిన్ని వేలిముద్రల నమూనాల్ని సేకరించాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# మా నాన్న జీవించి ఉంటే బాగుండేది.. పద్మ అవార్డుపై స్పందించిన అజిత్

: సినీ పరిశ్రమకు చేసిన సేవలకు అజిత్ కుమార్‌ను కేంద్రం దేశంలోనే మూడో అత్యున్నత పురస్కారంతో గౌరవించింది. పద్మభూషణ్‌తో సత్కరించింది. దీనిపై ఆయన ఆనందం వ్యక్తం చేస్తూ భావోద్వేగ పోస్ట్ పెట్టారు.



"పద్మభూషణ్ పురస్కారానికి నన్ను ఎంపిక చేయడం గౌరవంగా భావిస్తున్నా. భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ గుర్తింపు కేవలం వ్యక్తిగత ప్రశంస మాత్రమే కాదు. ఎంతోమంది సమష్టి కృషి, మద్దతుకు నిదర్శనమని భావిస్తున్నా. సినీ పరిశ్రమలో ఎంతోమంది నాకు సహకరించారు. వారందరికీ ధన్యవాదాలు. వారందరి ప్రేరణ, సహకారం, మద్దతు కారణంగానే నేను ఈ స్థాయిలో ఉన్నాను. ఎన్నో ఏళ్లుగా రేసింగ్, షూటింగ్‌లో నాకు సహకారం అందించిన వారికి కృతజ్ఞతలు. ఈ రోజును చూసేందుకు నా తండ్రి జీవించి ఉంటే ఎంతో బాగుండేదనిపిస్తోంది. నన్ను చూసి ఆయన గర్వపడేవాడు. భౌతికంగా మా మధ్య లేకపోయినా.. నేటికి ఆయన నాతోనే ఉన్నాడని అనుకుంటున్నాను"

"25 ఏళ్ల నుంచి నా భార్య షాలిని సహకారంతోనే ఇలా ఉన్నాను. నా విజయానికి, సంతోషానికి ఆమె ప్రధాన కారణం. చివరగా నా అభిమానుల గురించి చెప్పాలి. మీ అంచంచలమైన ప్రేమ, మద్దతు కారణంగానే నేను అంకితభావంతో పనిచేయగలుగుతున్నా. ఈ అవార్డు మీ అందరిది. మీ అందరికీ వినోదాన్ని అందించడానికి ఇలానే కష్టపడతాను" అని ఆనందం వ్యక్తం చేశారు.

# అభినయ శోభన

కళ్లతోనే అభినయాన్ని పండించగలదు..90ల కాలంలో 'యమునా తటిలో నల్లనయ్యకై ఎదురుచూసెనే రాధా" అంటూ మురిపించిన ఈ నటి ఎంతో మంది కుర్రకారు కలల రాణి.. 'రౌడీ గారి పెళ్ళాం'లో భర్తను దారిలో పెట్టే భార్యగా..'అభినందన'లో డ్యాన్సర్ రాణిగా.. ఇలా పాత్ర ఏదైనా నటనతో కట్టిపడేసిన ఆమే.. అలనాటి అగ్రతార శోభన. నాగార్జున నటించిన 'విక్రమ్' సినిమాతో తెలుగు తెరకు నాయికగా పరిచయమైన ఈమె నటిగానే కాకుండా..అద్భుతమైన క్లాసికల్ డ్యాన్సర్‌గా కూడా ప్రశంసలు అందుకున్నారు. ఆమె నాట్యంలోనూ, నటనలోనూ ప్రసిద్ధి గాంచిన లలిత, పద్మిని, రాగిణిల మేనకోడలు. తెలుగుతో పాటు తమిళ, మలయాళంలో నటించి మెప్పించిన శోభనకు కళారంగంలో చేసిన సేవలకు గానూ తాజాగా కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది.



అప్పట్లో పాత్రలు.. కథల ఎంపికలో శోభనదే ప్రత్యేకత. ఆకర్షించే అందం, చక్కటి హావభావాలతో మురిపించిన ఈమె..1980లో 'మంగళ నాయగి' అనే సినిమాతో తొలి అడుగులోనే ఉత్తమ బాలనటిగా పురస్కారాన్ని అందుకున్నారు. 1984లో 'ఏప్రిల్ 18' అనే మలయాళ సినిమాతో నాయికగా సినీరంగంలోకి అడుగుపెట్టారు. ఈ సినిమా అప్పట్లో అంతగా ఆడకపోయినా.. శోభన నటనకు మాత్రం మంచి మార్కులే పడ్డాయి. ఆ తర్వాత తెలుగులో 'రౌడీ అల్లుడు', 'అజేయుడు', 'మువ్వగోపాలుడు', 'త్రిమూర్తులు', 'ఏప్రిల్ 1 విడుదల', 'రక్షణ', 'రుద్రవీణ', 'దళపతి', 'నారీనారీ నడుమ మురారి', అల్లుడుగారు లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల్ని అలరించారు. ఇటీవలే ప్రభాస్ 'కల్కి' చిత్రంలో నటించి ఆకట్టుకున్నారు శోభన. 'మణిచిత్రతారు' అనే మలయాళ చిత్రంలో ద్విపాత్రాభినయంతో మెప్పించిన శోభన తన నటనతో ఉత్తమ నటిగా జాతీయ స్థాయిలో నిలిచారు. దీంతో పాటు 'మిత్ర్ మై ఫ్రెండ్' అనే ఇంగ్లిష్ చిత్రానికి గానూ మరోసారి జాతీయ పురస్కారం గెలుచుకున్నారు. కళారంగంలో ఆమె చేసిన సేవలకుగానూ 2006లో కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. 1994లో 'కళార్పణ' పేరిట చెన్నైలో నాట్య పాఠశాలను ఏర్పాటు చేశారు.

# స్వర సంచలనం అర్జిత్‌సింగ్

%కొత్తతరం సంగీత సంచలనం అర్జిత్‌సింగ్. హిందీ, బెంగాలీ సహా పలు భాషల్లో వందలాది గీతాల్ని ఆలపించి శ్రోతల్ని ఉర్రూతలూగించిన ప్రతిభాశాలి. స్వరకర్తగా ఆయన ప్రతిభని చాటారు. 15ఏళ్ల సినీ ప్రయాణంలో లెక్కలేనన్ని పురస్కారాలు. రెండుసార్లు ఆయన భారత ప్రభుత్వం నుంచి జాతీయ చలన చిత్ర పురస్కారాల్ని అందుకున్నారు. ఆయన ప్రతిభకు తాజాగా 'పద్మశ్రీ' పురస్కారం వరించింది. 2011లో వచ్చిన 'మర్డర్2' చిత్రం కోసం మిథున్ స్వరపరిచిన 'ఫిర్ మొహబ్బత్...' పాటతో హిందీ ప్రయాణాన్ని ఆరంభించిన అర్జిత్ 'ఆషికి2' చిత్రం కోసం పాడిన 'తుమ్ హి హెూ...', 'చాహున్ మై యానా' పాటతో మంచి గుర్తింపుని సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత ఆయన వెనుదిరిగి చూడలేదు. హిందీ, బెంగాలీ, తెలుగు, తమిళంతోపాటు పలు భాషల్లో సినీ, ఇతర పాటల్ని ఆలపించారు. తెలుగులో 'మనం' సినిమాలోని కనులను తాకే... పాటతోపాటు, 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'లో మాయు... పాటని ఆలపించారు. 'ఉయ్యాలా జంపాలా', 'కేశవ', 'దోచెయ్', 'రౌడీ ఫెలో', 'కేడీ', 'స్వామి రారా' తదితర చిత్రాలతో పాటు, గతేడాది విడుదలైన 'ఓం భీమ్ బుష్'లోనూ ఆయన 'అణువణువు..' అంటూ సాగే పాటని ఆలపించారు. పశ్చిమబెంగాల్‌లోని జియాగంజ్‌లో 1987లో జన్మించిన అర్జిత్‌సింగ్ ఓ రియాలిటీ షోలో పాల్గొని సినీ రంగంలోకి అడుగుపెట్టారు.



# ఎందులో ఓడినా జీవితంలో గెలవాలి

%"జీవితాన ఎందులో గెలిచావనేది ముఖ్యం కాదు. దేంట్లో ఓడినా జీవితంలో గెలవడమే ముఖ్యం'' అంటున్నాడు ఓ యువకుడు. అతనెవరు? తన జీవిత ప్రయాణం ఎలా సాగిందన్నది తెలియాలంటే 'మదగజ రాజా' చూడాల్సిందే. విశాల్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. అంజలి, వరలక్ష్మి శరత్‌కుమార్ కథానాయికలు. సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నారు. జెమినీ ఫిలిం సర్క్యూట్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం తమిళంలో సంక్రాంతి సందర్భంగా విడుదలై విజయవంతంగా ప్రదర్శితమైంది. ఈ నెల 31న సత్యకృష్ణన్ ప్రొడక్షన్స్ ద్వారా తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ని ప్రముఖ కథానాయకుడు వెంకటేశ్ శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. నా స్నేహితుల జోలికి వస్తే ఏమవుతుందో తెలిసేలా చేస్తానంటూ విశాల్ చేసిన యాక్షన్ హంగామా, సంతానం కామెడీ, కథానాయికల అందం ట్రైలర్‌కి ఆకర్షణగా నిలిచింది. "కామెడీ ప్రధానంగా సాగే సినిమాల్ని రూపొందించడంలో దిట్ట సుందర్.సి. ఆయన తన మార్క్ మాస్ అంశాలతో రూపొందించిన చిత్రమిది.



# నీతి జాతి లేని పార్టే ఏంఐఎం

## అధికారంలో ఎవరున్నా వారితో అంటగాగేదే మజ్లిస్

## బండి సంజయ్ పై నోరుజారితే సహించేదిలేదు

### ఏం ఐ ఎం పార్టీ పార్టీపై నిప్పులు చెరిగిన మాజీ నగర మేయర్



కరీంనగర్, జనవరి 30(భారత శక్తి):ఏం ఐ ఎం పార్టీ అంటే నీతి జాతి లేని పార్టీ అని, 1999 నుంచి రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో అంటే ఆ పార్టీతో అంటకాగుతుందన్నారు. ఈ మజ్లిస్ పార్టీ పుట్టింది పేద ప్రజల కోసం కాదని, వారు ఆస్తులను కాపాడుకునే సిగ్గులేని పార్టీని బిజెపి జిల్లా నాయకులు, మాజీ నగర మేయర్ యాదగిరి సునీల్ రావు మజ్లిస్ నేతలపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. నగరానికి వచ్చిన ఓ మజ్లిస్ నాయకుడు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. గురువారం భగత్ నగర్ లోని మాజీ మేయర్ క్యాంపు కార్యాలయంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ నగర డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళపు రమేష్ తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సునీల్ రావు మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ ను అసెంబ్లీ లో అడుగు పెట్టనివ్వని దమ్ము మాకే ఉందని విర్రవిగడం వాపును చూసి బల్పపంటారని విమర్శించారు. ఏం ఐ ఎం (మజ్లిస్) కు దమ్ముంటే ఒంటరిగా పోటీచేసి ఓడించే గట్స్ మీకు ఉన్నాయా, ఈ పార్టీకో సపోర్ట్ చేస్తా సంజయ్ నీ ఓడించామనడం పిరికీపందల చర్యని ఆరోపించారు.

తెలంగాణ లో బీజేపీని అధికారంలోకి రాకుండ అడ్డుకున్నది అసదొద్దిన్ ఓవైసిదే అని తప్పుడు కూతలు కుయడం వారి నైజాంకు నిదర్శనమన్నారు. అర్ధం పర్థం లేని వాఖ్యలు చెడిన ఎంఐఎం పార్టీ నాయకులకు సిగ్గు ఉండాలేని మండిపడ్డారు. అందుకే నీతి జాతి లేని పార్టీ ఎంఐఎం పార్టీగా రాష్ట్రంలో ముద్రపడిందని చెప్పారు. గత 30 సంవత్సరాలుగా ఆ పార్టీ అనుభవిస్తున్న రాజకీయ ఎత్తుగడలు, అనుభవిస్తున్న రాజభోగాలు అంత ఇంత కాదని విమర్శించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో అంటకాగడం మజ్లిస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్యన్నారు.1999 నుండి ఇప్పటి వరకు ఓవైసీ కుటుంబం ఎంఐఎం పార్టీ తమ ఆస్తులను కాపాడుకోవడానికి రక్షించికోవాడనికి రాజకీయ ఎత్తుగడలు వేస్తూ... అధికార పార్టీలతో అంటకాగుడం పరిపాటేనని, 1999 లో అధికారంలో ఉన్న టీడీపి సంకన చేరారని, 2004 లో రాజశేఖర్ రెడ్డి పంచన చేరి కాంగ్రెస్ తో అంటకాగిన సంగతి రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఇలా అధికారంలో ఉన్న అన్ని పార్టీల సంకన చేరి సుపర్ పవర్ నాయకుడు దిగజారుడు రాజకీయాలు వారికే సాధ్యం అనరు ఎంఐఎం నాయకులను ఉ చ్చపోయించిన నాయకులకు మాజీ ఉమ్మడి ఎపి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి పేరు చెబితే వారికి లాగులు తడుస్తయాన్నారు.ఎంఐఎం పార్టీ అరాచకలు, దౌర్జన్యాలను అరికట్టిన వ్యక్తి బీజేపీ నాయకులు కిరణ్ కుమార్ రెడ్డి మాత్రమేనని గుర్తు చేశారు. ఎంఐఎం పార్టీని స్థాపించింది ఒకప్పటి పాకిస్తాన్ ఏజెంట్ కాసీం రజీఫ్ కాదా, కాసీం రజీఫ్ పాకిస్తాన్ పోతు పోతు ఎంఐఎం ను ఇక్కడి నాయకులకు అప్పగించ లేదని ప్రశ్నించారు. ఎంఐఎం పార్టీ దురాఘాతాలు ఓటీటీలో, రజాకర్ సినిమా చూస్తే అర్దమౌతుందని, అన్యాయాలు, అరచకాలు కల్లకు కట్టుగా కనిపిస్తాయని స్పష్టం చేశారు.

వారి కాలేజీల్లో పని చేస్తు దొరికిన వారందరు కూడ పాకిస్తాన్ ఏజెంట్లేనని ఆరోపించారు. ఈ నీచుల పార్టీ నాయకులు కరీంనగర్ గడ్డ మీద బండి సంజయ్ పై వాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. నిజమైన బారతమాత బిడ్డ బండి సంజయ్ కుమార్ , హిందుత్వాన్ని కాపాడుతూ... హిందువులకు రక్షణ కల్పిస్తున్న నాయకులు అని తేల్చిచెప్పారు. కబర్ధార్ ఎంఐఎం నాయకుడా... నోరు దగ్గర పెట్టుకో...మరో సారి నోరు జారితే సహించేది లేదని హెచ్చరించారు. బండి సంజయ్ కుమార్ అంటేనే కరీంనగర్ ప్రజల ఆశా, శ్వాస, ధౌర్యంన్నారు. ఎంఐఎం పార్టీది ఒక అవకాశ వాదరాజకీయ నీచమైనచరిత్రా అన్నారు. స్మార్ట్ సిటీ కరీంనగర్ లో ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటై నగరాన్ని మళ్లీ పాతబస్తి చేసేలా కుట్రలు చేస్తున్నారని, మీరు చేసే కుట్రలు, కుతంత్రాలు, కరీంనగర్ ప్రజల ముందు, బండి సంజయ్ కుమార్ ముందు ఏమాత్రం సాగవని ఎద్దేవా చేశారు.దమ్ముంటే ఎంఐఎం పార్టీ పోటి చేసి... ఓడించాలే తప్ప ఏ పార్టీకో సపోర్ట్ చేసి సంజయ్ ని ఓడించామనడం పిరికిపందల చర్యన్నారు..ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, మాజీ ఎంపిపి వాసాల రమేష్, మాజీ కార్పొరేటర్లు పెద్దపెల్లి జితేందర్, కొలగాణి శ్రీనివాస్, చంద్రమౌళి పాల్గొన్నారు

# నిర్మల్ మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్జేడీ



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో షేక్ అహ్మద్, జనవరి 30: నిర్మల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం మున్సిపల్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ షహి మసూద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కార్యాలయంలోని ప్రతి డిపార్ట్మెంటు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అధికారులు సమయపాలన పాటించాలని విధుల్లో నిర్లక్ష్యం వహిణిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయన వెంట మున్సిపాలిటీ డీఈ హరి భవన్ కార్యాలయ ఉద్యోగులు ఉన్నారు.

# మధ్యప్రదేశ్ లోని మైహార్ దేవాలయాలను దర్శించుకున్న నిర్మల్ జిల్లా వాసులు



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో షేక్ అహ్మద్, జనవరి 30: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు దేశవిదేశాల నుంచి భక్తులు వస్తున్నారు. హిందూ మతంలోని గొప్పతనం ఇదే అని అంతా ప్రశంసిస్తున్నారు. ఇది నాణేనికి ఒకవైపే. పవిత్ర స్నానాల కోసం ఇంత దూరం వచ్చి చేస్తున్నారు. అమృత స్నానాలు చేసే చోట అన్ని వస్తువులు కలవు.144 ఏళ్ల తర్వాత వచ్చిన మహాకుంభమేళా ఇది. అందుకే ప్రయాగ్‌రాజ్‌లో ఈ సారి జరుగుతున్న కుంభమేళాకు అందరూ అంత విశిష్టమైనదిగా భావిస్తున్నారు. ఈ సమయంలో ఒక్కసారైనా త్రివేణి సంగమ జలాల్లో పవిత్ర స్నానం ఆచరించాలని దేశవిదేశాల్లో ఉన్న వృద్ధులు, మహిళలు, సాధువులు తరలి వస్తున్నారు. జనాల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వమూ భక్తులు బస చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కిలోమీటర్ల పొడవునా టెంట్లు, తాగు నీటి సౌకర్యం, పోర్టబుల్ టాయిలెట్లు వంటివి ఏర్పాటు చేసింది. రోజూ లక్షల మంది జనాభా వస్తున్నా శానిటైజేషన్ పరంగా ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటోంది.మహా కుంభమేళాలో అమృత స్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయనే నమ్మకంతో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

# నాటి అమరుల త్యాగాలే నేటి స్వతంత్ర ఫలాలు. అమరులను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు శాంతియుతంగా, అహింస మార్గం లో నడవాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జనవరి 30:నాటి అమరుల త్యాగాలే నేడు మనం అనుభవిస్తున్న స్వతంత్ర ఫలాలు అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.

గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరం లో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా అమరవీరుల దినోత్సవం లో పాల్గొని అమరవీరులను స్మరించుకుంటూ 2 నిముషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం లో, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాపాడుకోవటానికి ఎందరో మహనీయులు సత్యాగ్రహమే ఆయుధంగా, అహింస మార్గంలో పోరాడి అద్భుతమైన సాహసం, ధైర్యాన్ని చూపుతూ ప్రాణం పోయిన లెక్క చేయకుండా దేశానికి స్వాతంత్ర్యమే ముఖ్యమని భారత జాతికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యలు అందించారని వారి త్యాగాలను నేడు గుర్తు చేసుకుంటూ నివాళు లు అర్పించటమే కాకుండా అమరులను స్ఫూర్తి గా తీసుకొని శాంతియుతంగా, అహింసా మార్గం లో దేశానికి, ప్రజలకి సేవ చేసేందుకు ముందుకు నడవాలని కలెక్టర్ అధికారులకి సూచించారు.

ఈ కార్యక్రమం లో డి ఆర్ డి ఓ వి డి వి వి అప్పారావు,హౌజింగ్ ఈ ఈ ధర్మారెడ్డి,డి పి ఓ నారాయణ రెడ్డి,డి ఈ ఓ అశోక్,డి డబ్ల్యూ ఓ నరసింహారావు, ఎంపిడిఓ లు,ఎం పి ఓ లు,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ మున్సిపల్ కమిషనర్ గా జగదీశ్ గౌడ్ బాధ్యతల స్వీకరణ



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 30 : నిర్మల్ మున్సిపల్ కమిషనర్ గా జగదీష్ గౌడ్ గురువారం సాయంత్రం పదవి బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ కమిషనర్ గా విధులు నిర్వహించిన మొహమ్మద్ ఖమర్ అహ్మద్ రాయికల్ కు బదిలీపై వెళ్లారు. జగిత్యాల జిల్లా రాయికల్ కమిషనర్ గా విధులు నిర్వహించిన జగదీష్ గౌడ్ ను ప్రభుత్వం ఇటీవల నిర్మల్ కమిషనర్ గా బదిలీ చేసింది. కమిషనర్ జగదీష్ గౌడ్ కు మేనేజర్ షమీం అహ్మద్, డిఈ హరి భువన్, ఆర్ వో అనుఫ్ కుమార్, అహ్మద్ ఖాన్. మునిసిపల్ సిబ్బంది తదితరులు స్వాగతం పలికారు.

# హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ను కలిసిన భారతశక్తి విలేకర్లు



హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)జనవరి30: భారత శక్తి దినపత్రిక 2025 సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించడం కోసం గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ను హనుమకొండ ప్రతినిధి దుబాసి రవిందర్, హైదరాబాద్ విలేకరి పల్లె మొగిలి కలిసారు.హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూఎం.ఎల్. సి ఎన్నికల కోడ్ ఉన్నందున క్యాలెండరు ఆవిష్కరణ ఉండది అని అన్నారు.ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిల పత్రికలు ఉండాలని ప్రశ్నించే గొంతుకలుగా ఉండి ప్రజలకు మేలు చేసేలా పనిచేయాలని అన్నారు. భారత శక్తి దినపత్రిక యాజమాన్యానికి, ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో, హనుమకొండ ప్రతినిధి దుబాసి రవిందర్, , హైదరాబాద్ జర్నలిస్ట్ పల్లె మొగిలి లకు శుభాకాంక్షలు తెలిపారు.

# జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 30: నిర్మల్ జిల్లా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సోన్ మండలం కడ్తాల్ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణ, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులు, గ్రామస్తులతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కడ్తాల్ గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన జాతీయ రహదారి పై ప్రమాదాల నియంత్రణకు వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకై అధికారులందరితో ఇప్పటికే పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్డీఓ అధ్యక్షతన సంబంధిత అధికారులందరితో కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించిందన్నారు. సంబంధిత అధికారుల నుంచి వై జంక్షన్ సమస్య పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో వివరాలను తెలుసుకున్నారు. త్వరితగతిన గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్తుల నుంచి సమస్య పరిష్కారానికి సూచనలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, జాతీయ రహదారుల అధికారి ప్రసన్న, ఆర్ టి ఓ దుర్గా ప్రసాద్, సోన్ తహసిల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, కడ్తాల్ గ్రామస్తులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy